## క్లుప్తంగా...

### మే 5 లేదా 6 నుంచి ఎంసెట్

సాక్షి, హైదరాబాద్: 2020 మే 5 లేదా 6 నుంచి ఎంసెట్ నిర్వహించే అవకాశముంది. మే 3న నీట్ పరీక్ష ఉన్న నేపథ్యంలో ఆ తరువాత 2 రోజులకు ఎంసెట్ నిర్వహించాలని ఉన్నత విద్యామండలి భావిస్తోంది. ఈ మేరకు ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూలు ఖరారుపై మండలి కసరత్తు చేస్తోంది. ఈ నెలాఖరులో సెట్స్ తేదీలను ఖరారు చేయనుంది.

### ఇండియా కొత్త మ్యాప్‌ల వినియోగంపై ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన ఇండియా కొత్త మ్యాప్‌ను వినియోగించాలని ఆర్జేడీలు, డీఈవోలను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ఆదేశించింది. ఈ మేరకు సర్వే ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ నుంచి మ్యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొంది. విద్యాశాఖ కార్యాలయాలతోపాటు అన్ని పాఠశాలల్లోనూ నూతన మ్యాప్‌ను ఉపయోగించాలని స్పష్టం చేసింది. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠ్య పుస్తకాల్లోనూ ఇదే మ్యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

### వివాహ రిసెప్షన్‌కు హాజరైన సీఎం కేసీఆర్



సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంగళవారం ఢిల్లీలో జరిగిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌శర్మ కుమారుడి రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అంతకుముందు సీఎం కేసీఆర్‌ను ఆయన అధికారిక నివాసంలో పలువురు టీఆర్‌ఎస్ ఎంపీలు కలిశారు. సాయంత్రం వివాహ రిసెప్షన్‌లో కేసీఆర్ పాల్గొన్నారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా విమానాశ్రయానికి వెళ్లి హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.

### శ్రీకాంతాచారికి టీజేఎస్ నివాళులు



సాక్షి, హైదరాబాద్: మలిదశ రాష్ట్ర ఉద్యమంలో తొలి అమరుడైన శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా తెలంగాణ జన సమితి పార్టీ అధినేత ప్రొఫెసర్ కోదండరాం గన్‌పార్కు వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి జి.వెంకట్‌రెడ్డి, బైరీ రమేష్, అంబటి శ్రీనివాస్‌తో పాటు ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు. శ్రీకాంతాచారి ఆశయ సాధన కోసం తాము ఎల్లప్పుడూ పోరాడుతామని వారు నినాదాలు చేశారు. అనంతరం టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో శ్రీకాంతాచారికి కోదండరాం, విద్యార్థి జన సమితి (వీజేఎస్) నేతల బృందం నివాళులు అర్పించింది.

### 'ఎక్స్‌షోరూమ్ ధరలపై లైఫ్‌ట్యాక్స్ వద్దు'

సాక్షి, హైదరాబాద్: వాహనాల ఎక్స్‌షోరూమ్ ధరలపై లైఫ్‌ట్యాక్స్ వసూలు చేయొద్దని తెలంగాణ రవాణాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇంతకాలం ఎక్స్‌షోరూమ్ ధరలపై లైఫ్‌ట్యాక్ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ తాజా ఆదేశాలతో ఇక నుంచి షోరూమ్‌లో వాహనం కొన్న ఇన్‌వాయిస్ ధర ప్రకారమే లైఫ్‌ట్యాక్స్ వసూలు చేయాలని రాష్ట్రంలోని వాహన డీలర్లకు రవాణాశాఖ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశాలు జారీ చేశారు. అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### వరంగల్‌లోని కాలుష్య శుద్ధీకరణ ప్లాంటుకు రూ.6 కోట్లు

సాక్షి, హైదరాబాద్: వరంగల్ తోలు శుద్ధి పరిశ్రమతో పాటు కూనూరు లెదర్ పార్కులో సమీకృత కాలుష్య శుద్ధీకరణ ప్లాంటు ఆధునీకరణ కోసం రూ. 6 కోట్లు విడుదల చేస్తూ పరిశ్రమల శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కాలుష్య శుద్ధీకరణ ప్లాంటు (సీఈటీపీ)ని ఆధునీకరించాలని చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎల్ఆర్ఐ) గతంలో ప్రతిపాదించింది. ఆధునీకరణలో రాష్ట్ర లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ సహకరించాలని కోరింది. ఆధునీకరణకు అయ్యే నిధుల్లో 70 శాతం కేంద్రం, 30 శాతం రాష్ట్రం భరించాలని సీఎల్ఆర్ఐ సూచించింది. ఈ నేపథ్యంలో రూ. 6 కోట్లను గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఎండ్‌నౌ సంస్థకు కర్మవీర్‌చక్ర పురస్కారం

సాక్షి, హైదరాబాద్: ఇంటర్‌నెట్, సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్పించినందుకు ఎండ్‌నౌ ఫౌండేషన్‌కు కర్మవీర్‌చక్ర పురస్కారం లభించింది. సంస్థ వ్యవస్థాపకుడు అనిల్ రాచమల్ల ఢిల్లీలో సోమవారం ఈ అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం పోలీసులు, విమెన్‌సేఫ్టీ వింగ్, షీటీమ్స్‌తో కలసి రాష్ట్రవ్యాప్తంగా పలు అవగాహన కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి భాగస్వామ్యంతో నడిచే 'రెక్స్ కాన్‌క్లేవ్'సంస్థ ఏటా ప్రదానం చేసే పురస్కారాలకు ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల నుంచి ఎండ్ నౌ సంస్థ ఎంపికైంది.



**చుట్టూ పచ్చగా.. చూడముచ్చటగా..!**

ములుగు జిల్లా వెంకటపురం (ఎం) మండలంలోని రామప్ప సరస్సు కింద వరి పొలాలు కోనసీమను తలపిస్తున్నాయి. ఈ ఖరీఫ్‌లో మంచి వర్షాలు కురవడంతో సరస్సు కింద వేలాది ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇప్పుడు కోతకు రావడంతో చుట్టూ పచ్చగా.. చూడ ముచ్చటగా కనువిందు చేస్తోంది.

- ఫొటో : జి.సంపత్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి

# మున్సి'పోల్స్' కసరత్తు వేగిరం

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించనుంది. కొత్త వార్డులు/డివిజన్ల వారీగా ఎస్సీ, ఎస్టీ జనాభా గణనను చేపట్టనున్నారు. దీనికి దాదాపు 5 రోజుల సమయం పట్టనుందని పురపాలక శాఖ అధికారవర్గాలు తెలిపాయి. అన్ని మున్సిపాలిటీల్లోని ఎస్సీ, ఎస్టీల జనాభా దామాషా ప్రకారం మున్సిపాలిటీల వార్డు, చైర్‌పర్సన్ స్థానాలను కేటాయిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లలో సైతం ఇలానే ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 50 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తుండగా, ఎస్సీ, ఎస్టీల కోటా పోగా మిగిలిన స్థానాలను బీసీలకు రిజర్వు చేయనున్నారు. వార్డు/డివిజన్ స్థానాలకు రిజర్వేషన్లను ప్రకటిస్తూ స్థానిక జిల్లా కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేయనున్నారు. చైర్‌పర్సన్, మేయర్ స్థానాల రిజర్వేషన్లను మాత్రం పురపాలికల వారీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించనుంది. రిజర్వేషన్లను ప్రకటించిన వెంటనే ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేయనుంది.

### వార్డుల విభజన షెడ్యూల్ ఇది..

| క్ర.సం | విషయం | సమయం |
|---|---|---|
| 1 | వార్డుల పునర్విభజన ముసాయిదా ప్రకటన, అభ్యంతరాలు, సలహాలకు ఆహ్వానం | డిసెంబర్ 3 |
| 2 | వార్తా పత్రికల్లో వార్డుల పునర్విభజన ముసాయిదా ప్రచురణ | డిసెంబర్ 4 |
| 3 | ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి సలహాలు, అభిప్రాయాల సేకరణ (సాయంత్రం 5 గంటల వరకు) | డిసెంబర్ 3 నుంచి 9 |
| 4 | ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన సలహాలు, అభ్యంతరాల పరిష్కారం | డిసెంబర్ 16 వరకు |
| 5 | కౌన్సిల్/ప్రత్యేకాధికారి ఆమోదం పొందడం | డిసెంబర్ 16 |
| 6 | పురపాలక శాఖ డైరెక్టర్‌కు నివేదిక సమర్పణ | డిసెంబర్ 17 |
| 7 | వార్డుల విభజనపై తుది ప్రకటన జారీ | డిసెంబర్ 17 |

ఈ ప్రక్రియలన్నీ సజావుగా జరిగితే జనవరిలో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. కొత్త మున్సిపల్ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి సాధారణ మున్సిపల్ ఎన్నికలు కావడంతో కొత్త రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ (ఆర్ఓఆర్)ను అమలు చేయనున్నారు. ఇప్పటివరకు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అమలు చేసిన రోస్టర్‌ను ఈ ఎన్నికల్లో కొనసాగించరు. రోస్టర్‌ను ఒకటో పాయింట్ నుంచి ప్రారంభించనున్నారు. ఈ ఎన్నికల్లో ఖరారు చేసే రిజర్వేషన్లను మరో రెండు సాధారణ ఎన్నికల వరకు కొనసాగించనున్నారు.

### టెన్త్ పరీక్షల షెడ్యూల్

| తేదీ | సబ్జెక్టు |
|---|---|
| 19-3-2020 | ప్రథమ భాష పేపరు-1, ప్రథమ భాష పేపరు-1 (కాంపోజిట్ కోర్సు) |
| 20-3-2020 | ప్రథమ భాష పేపరు-2, ప్రథమ భాష పేపరు-2 (కాంపోజిట్ కోర్సు) |
| 21-3-2020 | ద్వితీయ భాష |
| 23-3-2020 | ఇంగ్లిష్ పేపర్-1 |
| 24-3-2020 | ఇంగ్లిష్ పేపర్-2 |
| 26-3-2020 | మ్యాథమెటిక్స్ పేపర్-1 |
| 27-3-2020 | మ్యాథమెటిక్స్ పేపర్-2 |
| 28-3-2020 | జనరల్ సైన్స్ పేపర్-1 |
| 30-3-2020 | జనరల్ సైన్స్ పేపర్-2 |
| 31-3-2020 | సోషల్ స్టడీస్ పేపర్-1 |
| 1-4-2020 | సోషల్ స్టడీస్ పేపర్-2 |
| 3-4-2020 | ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 |
| 4-4-2020 | ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 |
| 6-4-2020 | ఎస్ఎస్‌సీ ఒకేషనల్ థియరీ |

# లైంగిక హింస ఆపండి

▶ మొదటి పేజీ తరువాయి

దానిపై ఓ విధానం తీసుకురావాలని సూచించింది. స్త్రీలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాల వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపింది. దీనివల్ల సమాజ అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని, కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది.

**లైంగిక హింసతో విలవిల..**

ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. కౌమారదశలో ఉన్న బాలికలు, యువతులు, ఇతర మైనారిటీ మహిళలు, వైకల్యాలున్న స్త్రీలు అనేక రకాల హింసలకు గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 38 నుంచి 50 శాతం మహిళల హత్యలు వారి సన్నిహితుల ద్వారానే జరుగుతున్నాయి. ఈ పరిస్థితులు సామాజిక, ఆర్థిక, కుటుంబాలపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. హింస నుంచి బయటపడిన మహిళల్లో దాదాపు 55 శాతం నుంచి 95 శాతం మంది వరకు ఆ సంఘటనను బయటకు చెప్పడానికి ముందుకు రావట్లేదు. పురుషుల అక్రమ సంబంధాలు కూడా అనేకసార్లు మహిళలపై హింసకు కారణంగా నిలుస్తున్నాయి.

**ఆరోగ్యంపై ప్రభావం..**

లైంగిక హింస మహిళలకు తీవ్రమైన శారీరక, మానసిక, లైంగిక, పునరుత్పత్తికి సంబంధించిన ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. గర్భం దాల్చడం, ప్రేరేపిత గర్భస్రావం, హెచ్ఐవీ సహా పలు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. లైంగిక వేధింపులకు గురైన మహిళల్లో ఇలాంటి వ్యాధులు ఒకటిన్నర రెట్లు ఎక్కువ. గర్భస్రావం రెండింతలు ఎక్కువ. ఈ రకమైన హింస కారణంగా నిరాశ, ఒత్తిడి, నిద్రలేమి, ఆత్మహత్యాయత్నాలకు పాల్పడే ప్రమాదం ఉంది. తాగుడుకు బానిసలు అవుతారు. తలనొప్పి, వెన్నునొప్పి, జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశముంది. హింస ఉన్న కుటుంబాల్లో పెరిగే పిల్లల్లో నేర ప్రవృత్తి ఉండే అవకాశం ఉంది.

**కింది జాగ్రత్తలు తీసుకోవాలి..**

స్త్రీలకు సురక్షితమైన బహిరంగ ప్రదేశాలుండాలి. బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉండకూడదు. పురుషుల హక్కులను కాపాడుతూ స్త్రీ అణచివేతను సమర్థించే నిబంధనలను తొలగించాలి. మహిళలకు చట్టబద్ధమైన, సామాజిక రక్షణలు మాత్రమే సరిపోవని, రాజకీయ సంకల్పం ఉండాలని డబ్ల్యూహెచ్‌వో స్పష్టం చేసింది. మహిళలపై హింసను పరిష్కరించడానికి కార్యక్రమాలు, పరిశోధనలు, ఆరోగ్యం, విద్య, చట్టం అమలు, సామాజిక సామర్థ్యాలను బలోపేతం చేయడానికి వనరులు కేటాయించాలి. మహిళా సాధికారత పెరగాలి. పేదరికం తగ్గించాలి. ప్రభుత్వాలు మహిళలపై హింసను అంతం చేయాలి.

# ఐపాస్ సక్సెస్

▶ మొదటి పేజీ తరువాయి

కంపెనీలు పెట్టుబడులతో రాష్ట్రానికి రాగా వాటిలో ఎక్కువగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఉన్నాయి. టీఎస్ ఐపాస్ మూలంగా సులభతర వాణిజ్య విధానం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ర్యాంకింగ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా జాతీయ స్థాయిలో తొలి రెండు స్థానాల్లో కొనసాగుతోంది. టీఎస్ ఐపాస్ చట్టం అమలుతో ఐదేళ్లలో పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణలో 70 శాతానికిపైగా వృద్ధిరేటు సాధించినట్లు పరిశ్రమలశాఖ నివేదిక వెల్లడిస్తోంది.

**టీఎస్ ఐపాస్ ప్రత్యేకతలివే...**

పారిశ్రామిక అనుమతులు పొందడాన్ని హక్కుగా చేస్తూ దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో వివరాలు సమర్పించేలా టీఎస్ ఐపాస్ చట్టం-2014 రూపొందించారు. 27 ప్రభుత్వ విభాగాల పరిధిలో 35 అంశాలకు సంబంధించి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా వాటన్నింటినీ టీఎస్ ఐపాస్ గొడుగు కిందకు తెచ్చారు. పారిశ్రామిక అనుమతుల కోసం 110 రకాలైన పత్రాలను సమర్పించాల్సి ఉండగా వాటి సంఖ్యను పదికి కుదించారు. దరఖాస్తు చేసిన 30 రోజుల్లోగా అనుమతి లభించని పక్షంలో అనుమతి లభించినట్లుగానే భావించాల్సి ఉంటుందనే నిబంధనకు చోటు కల్పించారు. రూ. 200 కోట్లకు పైబడిన పెట్టుబడితో వచ్చే భారీ పరిశ్రమలకు అనుమతులను 15 రోజుల్లోనే ఇవ్వాలని చట్టంలో పేర్కొన్నారు. భారీ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో 'టీ స్విఫ్ట్'బోర్డుతోపాటు సీఎం నేతృత్వంలో 'ఇండస్ట్రియల్ చేజింగ్ సెల్'ను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుతోపాటు దరఖాస్తు రుసుము చెల్లింపునూ ఇదే విధానంలో చేయాలని చట్టంలో స్పష్టం చేయడంతో భారీ ఫలితాలు సాధించినట్లు పరిశ్రమలశాఖ వర్గాలు వెల్లడించాయి.

**మూడు కేటగిరీల్లో అవార్డులు...**

నూతన పారిశ్రామిక విధానంగా పేర్కొనే టీఎస్ ఐపాస్‌కు చట్టబద్ధత కల్పించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కె. తారక



రామారావుతోపాటు మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులు ఈ ఉత్సవాలకు అతిథులుగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా చట్టం అమల్లో ప్రతిభ చూపిన 33 జిల్లాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించి ఒక్కో కేటగిరీలో మూడేసి జిల్లాలకు బుధవారం అవార్డులు అందజేయనున్నారు. మొదటి కేటగిరీలో కరీంనగర్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, రెండో కేటగిరీలో సిద్దిపేట, కామారెడ్డి, మెదక్, మూడో కేటగిరీలో జగిత్యాల, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల తరపున ఆయా జిల్లాల కలెక్టర్లు అవార్డులు అందుకోనున్నారు. ప్రభుత్వ విభాగాల కేటగిరీలో ఉత్తర, దక్షిణ మండల విద్యుత్ పంపిణీ సంస్థలు, భూగర్భ జలవనరులు, రెవెన్యూ విభాగాలకు అవార్డులు అందించనున్నారు. టీఎస్ ఐపాస్‌ను సమర్థంగా అమలు చేయడంలో కీలకపాత్ర పోషించిన అధికారులు ఈవీ నర్సింహారెడ్డి (టీఎస్ఐఐసీ), అర్విండ్ కుమార్ (మెట్రోపాలిటన్ కమిషనర్), టీకే శ్రీదేవి (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్), కె. విద్యాధర్ (టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్), నీతూకుమారి ప్రసాద్ (పీసీబీ సభ్య కార్యదర్శి), అహ్మద్ నదీమ్ (లేబర్, ఇండస్ట్రీస్ కమిషనర్) అవార్డులు అందుకోనున్నారు.

**ఐదేళ్లలో టీఎస్ ఐపాస్ అమలు తీరు**

| అమలు దశ | పరిశ్రమలు | పెట్టుబడి (రూ. కోట్లలో) | ఉపాధి |
|---|---|---|---|
| ఉత్పత్తి ప్రారంభించినవి | 8,992 | 85,122.87 | 6,22,944 |
| పురోగతిలో ఉన్నవి | 765 | 28,118.77 | 2,87,103 |
| ప్రాథమిక దశలో ఉన్నవి | 640 | 51,009.31 | 2,57,024 |
| నిర్మాణం ప్రారంభించాల్సినవి | 1,223 | 9,385.58 | 1,35,731 |
| మొత్తం | 11,620 | 173636.53 | 13,02,802 |

### ఐఎస్‌బీ విద్యార్థులకు ఆఫర్ల వెల్లువ

సాక్షి, హైదరాబాద్: నగరంలోని ప్రముఖ బిజినెస్ స్కూల్ 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)' ఈ ఏడాది ప్లేస్‌మెంట్స్‌లో సత్తా చాటింది. ప్లేస్ మెంట్స్ ప్రారంభమైన మొదటి రోజే పీజీ ప్రోగ్రాం ఇన్ మేనేజ్ మెంట్(పీజీపీ) విద్యార్థులకు కంపెనీలు 1,383 ఆఫర్లు ప్రకటించాయి. గతేడాది మొదటి రోజు ప్లేస్‌మెంట్స్‌లో పొందిన వార్షిక సగటు వేతనం కంటే ఈ సంవత్సరం 124 శాతం అదనంగా ఆఫర్ చేసినట్లు ఐఎస్‌బీ ప్రతినిధులు వెల్లడించారు. సగటున రూ.26.15 లక్షల ప్యాకేజీ తో 231 కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ఐఎస్‌బీ ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం ఆఫర్లల్లో కన్సల్టింగ్ సం స్థలు 22.75 శాతంతో ముందు వరుసలో ఉన్నాయి.

### కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వండి: ఎంపీ పసునూరి

సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించాలని టీఆర్‌ఎస్ ఎంపీ పసునూరి దయాకర్ కేంద్రాన్ని కోరారు. మంగళవారం ఆయన లోక్‌సభ జీరోఅవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదాతోపాటు, ఆర్థిక సాయంగా తక్షణం రూ. 20 వేల కోట్లు ఇవ్వాలి'అని కోరారు.

### హైదరాబాద్‌లో వైఎస్సార్ మెమోరియల్ ఏర్పాటు చేయండి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పాలన స్వర్ణయుగం లాంటిదని, అన్ని ప్రాంతాల ప్రజలు ఆయన పథకాలతో లబ్ధి పొందారని, వైఎస్ జ్ఞాపకార్థం ప్రపంచస్థాయి స్మారక చిహ్నాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'వైఎస్ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు, ఆరోగ్యశ్రీ మొదలైన అనేక విప్లవాత్మక పథకాల ద్వారా కోట్లాది మంది పేద ప్రజలు లబ్ధి పొందారు. పేదలకు అనుకూలమైన పాలన సాగించిన వైఎస్‌కి నివాళులు అర్పించేందుకుగాను స్మారక చిహ్నం ఏర్పాటు చేసేందుకు కేసీఆర్ చొరవ తీసుకోవాలి' అని ఆయన ఒక ప్రకటనలో ఆయన కోరారు.

### 'దివ్య'మైన ప్రతిభకు పురస్కారాలు

**దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జాతీయ అవార్డులు ప్రదానం**

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారికి కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డులు ప్రదానం చేసింది. వ్యక్తిగత విభాగంలో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన నారా నాగేశ్వరరావుకు రోల్‌మోడల్ అవార్డు దక్కింది. 20 ఏళ్లుగా దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు, సమాన అవకాశాలకు ఆయన కృషి చేస్తున్నారు. అలాగే అశ్వారావుపేటకు చెందిన ఐవీ శ్రీనివాస్‌రెడ్డికి ఉత్తమ ఉద్యోగి విభాగంలో అవార్డు దక్కింది. ఆయన భద్రాద్రి కొత్తగూడెం వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోసం బ్రెయిలీ బ్యాలెట్ పేపర్లను రూపొందించిన బేగంపేటలోని దేవ్నార్ ప్రింటింగ్ హౌస్ ఫర్ ద బ్లైండ్ సంస్థకు ఉత్తమ బ్రెయిలీ ప్రెస్ విభాగంలో అవార్డు లభించింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకున్నారు.

### 'గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గిరిజనులకు జనాభా దామాషా ప్రకారం 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ గిరిజన శక్తి సంఘం మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టింది. గిరిజన రిజర్వేషన్ల పెంపునకు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఆమోదించాలని సంఘం ప్రతినిధులు రాజేష్‌నాయక్, వెంకటేష్ చౌహాన్ కోరారు. రిజర్వేషన్ల అమలులో జాప్యం వల్ల విద్య, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వీరి ధర్నాకు ఎంపీ ఎం.కవిత సంఘీభావం తెలిపారు.

**గిరిజన పోరాటానికి మద్దతు: ఉత్తమ్**

గిరిజన రిజర్వేషన్ల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ధర్నాకు సంఘీభావం తెలిపిన పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసినట్టే సీఎం కేసీఆర్ గిరిజనులను కూడా మోసం చేస్తున్నారని, ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా రిజర్వేషన్లు అమలు చేయవచ్చన్నారు. రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే మద్దతు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఉత్తమ్ పేర్కొన్నారు.

### 'ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి'

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ, తెలంగాణ ఎమ్మార్పీఎస్ మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టింది. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఏపీ, తెలంగాణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దండు వీరయ్య, ఇటుక రాజు కోరారు. ధర్నాలో మాదిగ జేఏసీ అధ్యక్షుడు పిడమర్తి రవి పాల్గొని సంఘీభావం తెలిపారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు.

### 'రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి'

సాక్షి, న్యూఢిల్లీ: రేషన్ డీలర్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా రేషన్‌షాపు డీలర్ల సమాఖ్య మంగళవారం ఢిల్లీలో ధర్నా చేపట్టింది. డీలర్లకు షాపు నిర్వహణ ఖర్చుతో కూడిన శాశ్వత భృతి నెలకు రూ.30 వేలు ఇవ్వాలని, రేషన్ డీలర్లను పీడీఎస్ ఉద్యోగులుగా పరిగణించాలని సంఘాల నేతలు కోరారు. నగదు బదిలీ పథకాన్ని ఉపసంహరించుకొని క్వింటాల్‌కు రూ.250 కమీషన్ ఇవ్వాలన్నారు. ధర్నాలో ఏపీ సంఘం నుంచి కేఎస్‌వీ రామారావు, ఎం.గిరిజారావు పాల్గొన్నారు.

### మూసీని కాలుష్య రహితంగా మార్చండి

**లోక్‌సభలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

సాక్షి, న్యూఢిల్లీ: మూసీ నదిని కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్రాన్ని కోరారు. మంగళవారం ఆయన లోక్‌సభలో ప్రత్యేక ప్రస్తావనల కింద ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. 'నమామి గంగే కార్యక్రమం ద్వారా గంగా నదిని శుభ్రపరుస్తున్నందుకు ధన్యవాదాలు. మూసీ నదిని కూడా నమామి గంగే తరహాలో శుభ్రపరిచి కాలుష్య రహిత నదిగా తీర్చిదిద్దాలి. మూసీ నది దాదాపు 70 కిలోమీటర్ల పొడవునా పూర్తిగా మురికి, మట్టితో నిండిపోయిందని ఇటీవల ఉస్మానియా వర్సిటీ జియోఫిజిక్స్ విభాగం పరిశోధనలో తేలింది. పోచంపల్లి, చౌటుప్పల్ ప్రాంతాల్లో దాదాపు 40 ఫార్మసీ కంపెనీలు వ్యర్థ రసాయనాలను ఈ నదిలో విడుదల చేస్తున్నాయి. నీటి వనరులను కలుషితం చేసేవారిపై భారీ జరిమానాలు విధించాలి'అని కోమటిరెడ్డి కేంద్రాన్ని కోరారు.

### జడ్జిపై చర్యలకు కేంద్రానికి హైకోర్టు సిఫార్సు

**రుణ వసూళ్ల ట్రిబ్యునల్ తీర్పుపై ధర్మాసనం విస్మయం**

సాక్షి, హైదరాబాద్: చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు అనుకూలంగా హైదరాబాద్ డెట్ రికవరీ ట్రిబ్యునల్-1 జడ్జి (ప్రిసైడింగ్ అధికారి) ఉత్తర్వులు ఇవ్వడంపై హైకోర్టు విస్మయాన్ని వ్యక్తం చేసింది. జడ్జిగా ఆ ప్రిసైడింగ్ అధికారి చెప్పిన తీర్పుల ప్రతులను పరిశీలించి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శికి హైకోర్టు సిఫార్సు చేసింది. బ్యాంకులకు అనుకూలంగా వ్యవహరించడమే కాకుండా రుణాలు తీసుకున్న వారికి వ్యతిరేకంగా ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు, జస్టిస్ కె.లక్ష్మణ్‌ల ధర్మాసనం ఇటీవల తీర్పు చెప్పింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ఎస్ఎస్ఆర్ పౌల్ట్రీ ఫాం వరంగల్‌లోని ఓబీసీ బ్యాంకు నుంచి 2014లో రూ.15 లక్షలతో పాటు రూ.5 లక్షల నగదు రుణం పొందింది. కొన్నేళ్ల తర్వాత పౌల్ట్రీ ఫాం వాయిదాలు చెల్లించలేకపోయింది. దీంతో రూ.15,20,800 చెల్లించాలని ఓబీసీ బ్యాంకు నోటీసులు జారీ చేసింది. పౌల్ట్రీ ఫాంకు చెందిన పంథిని గ్రామంలో ఉన్న రెండెకరాల భూమిని బ్యాంకు వేలం వేసింది. భూమిని వేలం వేయడాన్ని పౌల్ట్రీ ఫాం రుణ వసూళ్ల ట్రిబ్యునల్‌లో సవాల్ చేసింది. భూమిని పరిశీలించి వాస్తవ నివేదిక సమర్పించేందుకు అడ్వకేట్ కమిషన్‌ను ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. వేలం వేసిన రెండెకరాలు వ్యవసాయ భూమి అని కమిషన్ నివేదిక ఇచ్చినా ట్రిబ్యునల్ పట్టించుకోకుండా అది సాగు భూమి కాదని తేల్చింది. దీంతో భూమిని స్వాధీనం చేసుకోవడానికి అడ్వకేట్ కమిషన్‌కు అనుమతినిస్తూ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'ఎస్ఎస్ఆర్ పౌల్ట్రీ ఫాంకు చెందిన రెండెకరాల భూమిని బ్యాంకు వేలం వేయడం చెల్లదు. చట్ట విరుద్ధంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు అనుకూలంగా గుడ్డిగా ఉత్తర్వులు జారీ చేసింది. పౌల్ట్రీ ఫాం తీసుకున్న అప్పును చట్ట ప్రకారం వసూలు చేసేందుకు ఈ ఉత్తర్వులు ఏమాత్రం అడ్డుకాబోవు' అని తీర్పు చెప్పింది.

### 'దిశ'పై అనుచిత పోస్టులు

**నిందితుడు శ్రీరామ్‌ను అరెస్టు చేసిన పోలీసులు**



సాక్షి, హైదరాబాద్/నవీపేట: దిశపై జరిగిన దారుణాన్ని ఓ పక్క యావద్భారతం ముక్త కంఠంతో ఖండిస్తుంటే... కొందరు పోకిరీలు మాత్రం విజ్ఞత మరిచి ప్రవర్తిస్తున్నారు. మరణానంతరమూ ఆమెను ఉద్దేశించి ఫేస్‌బుక్ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేస్తున్నారు. ఈ తరహాలో శనివారం నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న శ్రీరామ్‌ను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసినట్లు సంయుక్త పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి పేర్కొన్నారు. నిజామాబాద్‌లోని నవీపేట్ మండల ఫకీరాబాద్‌కు చెందిన చవన్ శ్రీరామ్ ఐటీఐ పూర్తి చేశాడు. కొన్నాళ్ల పాటు ఓ హోటల్‌లో కార్మికుడిగా పని చేసినా ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఇతడికి ఫేస్‌బుక్‌లో స్టాలిన్ శ్రీరామ్ పేరుతో ఖాతా ఉంది. దిశ ఉదంతం నేపథ్యంలో ఆమెను ఉద్దేశించి తన వాల్‌పై శ్రీరామ్ అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు పోస్ట్ చేశాడు. వీటిని వ్యతిరేకిస్తూ పలువురు చేసిన కామెంట్స్‌తో ఇవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో స్పందించిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ వ్యవహారంపై శనివారం సుమోటోగా కేసు నమోదు చేశారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మోహన్‌రావు నేతృత్వంలోని బృందం ఈ కేసును సాంకేతికంగా దర్యాప్తు చేసింది. ఆ ఆధారాలను బట్టి శ్రీరామ్ నిందితుడిగా గుర్తించి నిజామాబాద్ జిల్లా ఫకీరాబాద్‌లో ఉండగా మంగళవారం అరెస్టు చేసింది. ఈ తరహాలోనే మరికొందరు తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా కామెంట్స్ చేస్తున్నట్లు గుర్తించామని, వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మంగళవారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి

# ‘దిశ’పై ఢిల్లీలో ఆందోళనలు ఉధృతం

**జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగిన మహిళా సంఘాలు**

**సాక్షి, న్యూఢిల్లీ:** దిశ ఘటనపై నిరసనగా ఢిల్లీలో ఆందోళనలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చట్టం చేయాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కేసులను త్వరితగతిన విచారించి నిర్ణీతకాలంలో దోషులను ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉద్యమించాయి. విద్యార్థి సంఘాలు, ఉద్యోగాలు చేస్తున్న యువతులు, మహిళలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. దేశంలో నిర్భయ ఘటన అనంతరం కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టినా మహిళలపై నేరాలు జరుగుతుండడంపై నిరసనలో పాల్గొన్న మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. హత్యాచారాలకు పాల్పడే దోషులను ఆరు నెలల్లో ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ నిరాహార దీక్షకు దిగారు. అయితే దీక్షకు అనుమతి లేదంటూ పోలీసులు ఆమెను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ దేశంలో ప్రతిరోజూ మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేవలం చట్టాలు రూపొందిస్తే సరిపోదని, వాటిని అమలు చేసి చూపించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ‘అత్యాచారాల్లో మరణించిన బాధితులు మనతో లేకపోయినా, వారి ఆర్తనాదాలు వినిపిస్తూనే ఉన్నాయి. అవి మనసులను కలచివేస్తున్నాయి. వారు అనుభవించిన నొప్పిని తలచుకుంటే వణుకు పుడుతోంది. అందుకే అత్యాచారాల కేసుల్లో దోషులుగా తేలిన వారిని ఆర్నెల్లలో ఉరి తీయండి’అంటూ ఆమె ప్రధాని మోదీకి లేఖ రాశారు.

# మహిళా భద్రతకు ప్రత్యేక కమిటీ

- నలుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులతో ఏర్పాటు
- త్వరలోనే డీజీపీకి ముసాయిదా నివేదిక

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ‘దిశ’ ఘటన తర్వాత తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. మహిళల భద్రతకు ప్రస్తుతమున్న చట్టాల అమలు, కొత్త చట్టాల రూపకల్పన, చట్టాల బలోపేతానికి సంబంధించి ఓ కమిటీని ఏర్పాటు చేశారు. డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశాలతో ఈ కమిటీ ఏర్పాటైంది. ఏడీజీ (లా అండర్ ఆర్డర్) జితేందర్ నేతృత్వం వహిస్తున్న ఈ కమిటీలో ఐజీ స్వాతి లక్రా, ఐజీ స్టీఫెన్ రవీంద్ర, డీజీఐ శివశంకర్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. మహిళల భద్రత కోసం ఈ కమిటీ కొన్ని మార్గదర్శకాలు, చట్టాల బలోపేతం తదితర విషయాలపై అధ్యయనం చేస్తుంది. తర్వాత ముసాయిదా రూపొందిస్తుంది. దానిని డీజీపీకి సమర్పిస్తారు. దీనికనుగుణంగా మహిళల భద్రతకు సంబంధించి పలు కొత్త నిర్ణయాలు అమలు చేయాలన్న యోచనలో తెలంగాణ పోలీసులు ఉన్నారు. ఈ విషయమై సోమ, మంగళవారాల్లో కమిటీ సభ్యులు డీజీపీ నేతృత్వంలో సమావేశమయ్యారు.

**గత కమిటీ ఆధారంగా..**

రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో ప్రభుత్వం ఓ కమిటీని వేసింది. పలువురు ఐపీఎస్, ఐఏఎస్‌లతో కూడిన ఆ కమిటీ ప్రభుత్వానికి పలు సిఫారసులు చేసింది. వాటి ఆధారంగా షీటీమ్స్, భరోసా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రత్యేక వసతులు, మధ్య మెష్‌ల ఏర్పాటు తదితర నిర్ణయాలు అమల్లోకి వచ్చాయి. ఇందులో ఆర్టీసీ బస్సుల్లో మెష్‌ల ఏర్పాటు పెద్దగా విజయవంతం కాలేదు. కానీ షీ టీమ్స్, భరోసా కేంద్రాల ఏర్పాటుతో మహిళలకు వేధింపులు, గృహ హింస తదితర కేసుల్లో సత్వర న్యాయసహాయం అందుబాటులోకి వచ్చింది. షీ టీమ్స్, భరోసా కేంద్రాలను ఇతర రాష్ట్రాలు స్ఫూర్తిగా తీసుకోవడం విశేషం. దీంతో గతంలో మాదిరే ప్రస్తుత కమిటీని ఏర్పాటు చేశారు.

# ఎలా విచారిద్దాం!

- దిశ కేసులో నిందితుల భద్రతపై పోలీసుల ఆందోళన
- ప్రస్తుతం సీన్ ఆఫ్ అఫెన్స్‌కు వెళ్లలేని పరిస్థితి
- తరచూ కోర్టులు, ఇతర ప్రదేశాలకు వెళ్లేందుకు వెనుకంజ

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ‘జస్టిస్ ఫర్ దిశ’అంటూ ప్రజాందోళనలు తారాస్థాయికి చేరడంతో ఈ కేసులో నిందితులను ఎలా విచారిద్దామన్న మీమాంసలో సైబరాబాద్ పోలీసులు ఉన్నారు. ఇప్పటికే ఆ నిందితులను మాకు వదిలేయండి, చంపేస్తామంటూ ప్రజలు ఆందోళనలు చేస్తుండటంతో వారి భద్రత ఎలా అన్న దానిపై పోలీసులు ఎటూ పాలుపోని స్థితిలో ఉన్నారు. రోజురోజుకు ప్రజా నిరసనలు మిన్నంటుతుండటంతో నిన్నటి వరకు నిందితుల విచారణ సాఫీగా జరుగుతుందనుకోగా, ఇప్పుడు వారిని సీన్ ఆఫ్ అఫెన్స్‌కు తీసుకువెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందుకే నిందితుల కస్టడీ అంశాన్ని కూడా పోలీసులు ఎక్కడా బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. షాద్‌నగర్‌లోని కోర్టు సిబ్బంది కానీ, పోలీసులు కానీ నిందితుల బెయిల్‌పై పెదవి విప్పడం లేదంటే ఈ కేసును ఎంత సీరియస్‌గా తీసుకున్నారో అర్థమవుతోంది. నిందితుల విచారణ క్రమంలో దిశ సామూహిక అత్యాచారానికి గురైన ప్రాంతం తొండుపల్లి టోల్ ప్లాజా సర్వీసు రోడ్డు, పెట్రోల్, డీజిల్ పోసి మృతదేహాన్ని కాల్చిన చటాన్‌పల్లి అండర్ పాస్ ప్రాంతంలో క్రైమ్ సీన్‌ను రీకన్‌స్ట్రక్షన్ చేయనున్నారు. దోషులకు ఉరిశిక్ష పడేలా చేయాలన్న ఉద్దేశంతో ఉన్న పోలీసులు నిందితుల విచారణ అంశాల్నీ బయటకు రాకుండా చూసుకుంటున్నారు. తరచూ కోర్టులు, ఇతర ప్రదేశాలకు నిందితులను తీసుకెళ్లేందుకు వెనకడుగు వేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి.


**చర్లపల్లి జైలు వద్ద 144 సెక్షన్..**

దిశ కేసులో నిందితులు మహమ్మద్ ఆరిఫ్, శివ, నవీన్ కుమార్, చెన్నకేశవులు చర్లపల్లి జైలులో ఉండటంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఓవైపు పోలీసులు కస్టడీలోకి తీసుకుంటారని, మరోవైపు ప్రజలు ఆందోళనకు దిగే అవకాశం ఉండటంతో చర్లపల్లి జైలు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను పోలీసులు విధించారు. అయితే శాంతిభద్రతల దృష్ట్యా నిందితులను బుధవారం తెల్లవారుజామున, లేదంటే అదే రోజు రాత్రిలోపు పోలీసు కస్టడీలోకి తీసుకునే అవకాశముందని తెలిసింది. మరోవైపు నిందితుల తరఫున వాదించేందుకు న్యాయవాది లేకపోవడంతో.. కస్టడీకి తీసుకుంటున్నామంటూ మంగళవారం వారికే నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.







# కేంద్ర ఉద్యోగాలకు 'సెట్'



**గ్రూప్ బీ, గ్రూప్ సీ ఉద్యోగాలకు ఒకే పరీక్ష నిర్వహించాలని కేంద్రం ప్రతిపాదన**

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వంలోని కొన్ని గ్రూప్ బీ, గ్రూప్ సీ ఉద్యోగాల భర్తీకి ఒకే పరీక్ష ద్వారా చేపట్టాలని కేంద్రం ప్రతిపాదించింది. అందుకు ఒక ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ప్రస్తుతం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ పరీక్ష ద్వారా ఐఏఎస్ (ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్), ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీసెస్), ఐఎఫ్ఎస్(ఇండియన్ ఫారిన్ సర్వీసెస్), ఐఎఫ్ఓఎస్(ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్) ఉద్యోగాలతో పాటు గ్రూప్ ఏ, గ్రూప్ బీలోని కొన్ని గెజిటెడ్ ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కూడా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో మధ్య, దిగువ స్థాయి ఉద్యోగాల భర్తీకి, ముఖ్యంగా కొన్ని గ్రూప్ బీ ఉద్యోగాల కోసం ఏటా పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో.. 'కేంద్ర ప్రభుత్వ శాఖలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోని గ్రూప్ బీ నాన్ గెజిటెడ్ పోస్ట్‌లు, కొన్ని గ్రూప్ బీ గెజిటెడ్ పోస్ట్స్, గ్రూప్ సీ పోస్ట్‌ల భర్తీకి ప్రత్యేకంగా ఒక ఏజెన్సీని ఏర్పాటు చేసి, ఆ ఏజెన్సీ ద్వారా కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్ష 'కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్(సెట్)'ను నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది' అని కేంద్ర సిబ్బంది శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ప్రతిపాదనపై స్పందించాల్సిందిగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరామన్నారు. అలాగే, ఉద్యోగార్థులు ఈ ప్రతిపాదనపై స్పందించాలని కోరారు. సెట్ నిర్వహణతో ఉద్యోగార్థులకు, ప్రభుత్వ సంస్థలకు డబ్బు, సమయం ఆదా అవుతుందని కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర చెప్పారు. ప్రధాని లక్ష్యమైన సులభతర పాలనలో భాగంగా ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చామన్నారు. 'ప్రస్తుతం, ప్రభుత్వ ఉద్యోగం కోసం వేర్వేరు సంస్థలు ప్రకటించే వేర్వేరు ఉద్యోగాలకు అభ్యర్థులు వేరుగా దరఖాస్తు చేయాల్సి వస్తోంది. వేర్వేరు సమయాల్లో, వేర్వేరు ప్రాంతాల్లో జరిగే ఆ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడం నుంచి పరీక్షకు హాజరవడం వరకు అభ్యర్థి అనేక వ్యయ ప్రయాసలకు లోనవాల్సి వస్తోంది. అందువల్ల ఒకే ఏజెన్సీ నిర్వహించే ఒకే పరీక్ష ద్వారా అభ్యర్థి వివిధ ఉద్యోగాలకు ఒకేసారి ప్రిపేర్ కావచ్చు' అని అన్నారు. అధికారిక లెక్కల ప్రకారం కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 6,83,823 ఖాళీలున్నాయి.

# ఈ దశాబ్దం చాలా హాట్ గురూ..!



**అధిక ఉష్ణోగ్రతల్లో తొలి మూడు స్థానాల్లో 2019**

**మాడ్రిడ్:** చరిత్రలో అత్యంత అధిక ఉష్ణోగ్రతలు ప్రస్తుత దశాబ్దం(2010–2019)లోనే నమోదైనట్లు ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన ఐక్యరాజ్యసమితి వార్షిక సమావేశంలో వాతావరణ మార్పులు మానవాళి సామర్థ్యాన్ని ఏవిధంగా అధిగమిస్తున్నాయో తెలిపింది. అలాగే పారిశ్రామికీకరణ ముందు సమయం (1850–1900)లోని సగటు ఉష్ణోగ్రత కంటే ఈ ఏడాదిలో ఇప్పటివరకు ప్రపంచ ఉష్ణోగ్రతల్లో సుమారు 1.1 డిగ్రీల సెల్సియస్ మేర పెరుగుదల నమోదైనట్లు ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎమ్‌వో) వెల్లడించింది. దీంతో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరాల్లో 2019 మొదటి 3 స్థానాల్లో నిలిచిందని పేర్కొంది. మానవ కారణ ఉద్గారాలు, మౌలిక వసతుల నిర్మాణం, పంట సాగు, వస్తు రవాణా వంటివి 2019ని అత్యంత కార్బన్ ఉద్గారాలు వెలువడిన ఏడాదిగా రికార్డుకు ఎక్కించిందని డబ్ల్యూఎమ్‌వో వెల్లడించింది. గ్రీన్ హౌస్ వాయువుల కారణంగా ప్రపంచంలో వెలువడిన ఉష్ణోగ్రతల్లో 90 శాతానికిపైగా వేడిని సముద్రాలు గ్రహిస్తాయని, దీంతో అవి ప్రస్తుతం అత్యంత వేడిని నమోదు చేస్తున్నాయని తెలిపింది. గత 12 నెలల్లో గ్రీన్‌ల్యాండ్ మంచు పలకల్లో సుమారు 329 బిలియన్ టన్నుల మంచు కరిగిపోయిందని డబ్ల్యూఎమ్‌వో వివరించింది.

## క్లుప్తంగా...

### ఉల్లి నిల్వ పరిమితి కుదింపు



**న్యూఢిల్లీ:** ఉల్లి ధరలు పైపైకి ఎగబాకుతున్న నేపథ్యంలో కేంద్రం మరిన్ని చర్యలు ప్రకటించింది. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల వద్ద ఉల్లి నిల్వల పరిమితిని 25 టన్నులు, 5 టన్నులకు కుదించింది. ఉల్లి సరఫరాను పెంచినప్పటికీ ధరలు గత కొద్ది వారాలుగా పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభకు వినియోగదారుల వ్యవహారాల శాఖ దన్వే రావ్ చెప్పారు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఉల్లి నిల్వల వివరాలను రోజువారీగా సమర్పించాలని ఆదేశించామని తెలిపారు. దేశంలోని నగరాల్లో ఉల్లి గడ్డల ధర కిలో రూ.75 నుంచి రూ.100 వరకు ఉంది. సరాసరి ధర కిలో రూ.75 కాగా అత్యధికంగా పోర్ట్‌బ్లెయిర్‌లో రూ.140 వరకు పలుకుతోందని కేంద్రం తెలిపింది.

### బిహార్‌లో మరో 'దిశ'!

**బక్సర్:** దిశ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ దేశవ్యాప్తంగా నిరసనలు హోరెత్తుతున్నా.. బిహార్‌లో అలాంటి ఘటన జరిగింది. ఓ బాలికను అత్యాచారం చేసి ఆపై తుపాకీతో కాల్చి హత్య చేసి, దుండగులు నిప్పు పెట్టారని పోలీసులు చెప్పారు .ఈ ఘటన బక్సర్ జిల్లాలోని కుకుందలో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం తెలిసిన వెంటనే అక్కడికి వెళ్లి ఛాతీ వరకు కాలిపోయి ఉన్న బాలిక మృతదేహాన్ని గుర్తించారు. బాలికపై అత్యాచారం జరిగి ఉంటుందని భావిస్తున్నట్లు బక్సర్ డీఎస్పీ సతీశ్ తెలిపారు. తలపై బుల్లెట్ గాయం ఉందని, సంఘటనా స్థలంలో ఖాళీ బుల్లెట్ షెల్ లభించిందని తెలిపారు.

### అయోధ్య కేసు నుంచి ధావన్‌కు ఉద్వాసన

**న్యూఢిల్లీ:** రామ జన్మభూమి –బాబ్రీమసీదు కేసులో సుప్రీంకోర్టులో వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్‌కు ముస్లిం పక్షాలు ఉద్వాసన పలికాయి. అనారోగ్యంతో ఉన్నానంటూ అర్థం లేని కారణం చూపి ఈ కేసు నుంచి తప్పించారని న్యాయవాది రాజీవ్ ధావన్ మంగళవారం వెల్లడించారు. 'బాబ్రీ కేసు నుంచి నన్ను తప్పించినట్లు కక్షిదారైన జమియత్ ఉలేమా–ఇ– హింద్ ప్రతినిధి ఏవోఆర్ (అడ్వొకేట్ ఆన్ రికార్డు) ఎజాజ్ మక్బూల్ తెలపగా వెంటనే అంగీకరించా. ఈ కేసులో నా జోక్యం ఉండదు'అని అన్నారు. 'నన్ను తొలగించేందుకు ఎజాజ్‌కు అధికారం ఉంది. కానీ, నాకు ఆరోగ్యం బాగోలేని కారణంగానే తీసేసినట్లు పేర్కొనడం అర్థం లేనిది. అనారోగ్యంతో ఉంటే ఇతర కేసులను ఎలా డీల్ చేస్తున్నా?'అని ప్రశ్నించారు.

### పాక్ కాల్పుల్లో ఇద్దరు మృతి

**జమ్మూ:** పూంఛ్‌లోని నియంత్రణ రేఖను ఆనుకుని మంగళవారం పాక్ భారీగా కాల్పులు జరపడంతో ఇద్దరు పౌరులు మరణించారు. 35 ఏళ్ల మహిళ, 16 ఏళ్ల బాలుడు మృతిచెందారని, మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారని, గాయపడిన వారిలో ఇద్దరు మహిళలు, ఒక మైనర్ బాలుడు ఉన్నాడని అధికారులు తెలిపారు. అయితే భారత్ స్పందించి వెంటనే కాల్పులను తిప్పికొట్టింది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో షహపూర్ సెక్టార్‌లో మోర్టార్లతో పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, భారత సైన్యం కూడా ధీటుగా సమాధానం ఇచ్చిందని రక్షణ శాఖ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

### భారత జలాల్లో చైనా నౌక



**న్యూఢిల్లీ:** భారత సముద్ర జలాల మీద తిరుగుతున్న చైనా నౌకను తిప్పిపంపినట్లు నేవీ చీఫ్ అడ్మిరల్ కరంబీర్ చెప్పారు. చైనాకు చెందిన షియాన్ 1 నౌక భారత ఆధీనంలోని అండమాన్ సముద్ర జలాలపై పరిశోధనలు చేస్తున్నట్లు తాము గుర్తించినట్లు చెప్పారు. పరిశోధనలకు సంబంధించిన వివరాలను తమకు అందించలేదని, తమ అనుమతి లేకుండానే నిషేధిత ప్రాంతంలో ప్రవేశించినట్లు తెలిపారు. దాదాపు 7 నుంచి 8 చైనా నౌకలు ఆయా ప్రాంతాల్లో ఉన్నట్లు తెలిపారు. సముద్రజలాలపై చైనాకు చెక్ పెట్టేందుకు శ్రీలంక, మాల్దీవులు, ఇండోనేషియా, థాయ్‌లాండ్ వంటి దేశాలతో కలసి పనిచేసేందుకు భారత్ కృషిచేస్తోంది.


# ఎట్టకేలకు 'విక్రమ్' గుర్తింపు

**చెన్నై యువ ఇంజనీర్ సాయంతో ల్యాండర్ శకలాలను గుర్తించిన నాసా**

**వాషింగ్టన్:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రుడి ఉపరితలం మీదకు సెప్టెంబర్ 7న ప్రయోగించిన విక్రమ్ ల్యాండర్ జాడలను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) ఎట్టకేలకు గుర్తించింది. అయితే ఈ ఘనత పూర్తిగా తమదేమీ కాదని, చెన్నై యువ ఇంజనీర్ షణ్ముగ సుబ్రమణియన్ సాయపడటంతో విక్రమ్ పడిన ప్రాంతాన్ని, శకలాలను గుర్తించగలిగామని నాసా ప్రకటించింది. ఈ మేరకు నాసా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ ఏడాది జూలై 22న శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి చంద్రయాన్–2 నింగికి ఎగిరిన విషయం మనకు తెలిసిందే. నెలల ప్రయాణం తర్వాత సెప్టెంబర్‌లో జాబిల్లి కక్ష్యలోకి చేరిన చంద్రయాన్–2 నుంచి విక్రమ్ ల్యాండర్ వేరుపడి నెమ్మదిగా చంద్రుడి ఉపరితలం వైపు ప్రయాణించింది. అయితే సెప్టెంబర్ 7న చివరిక్షణంలో విక్రమ్ ల్యాండర్‌తో సమాచార సంబంధాలు తెగిపోయాయి. నెమ్మదిగా ల్యాండ్ అవడానికి బదులు కొంత ఎత్తు నుండి కుప్పకూలిపోయినట్లు నాసా నిర్ధారించింది. చంద్రయాన్ –2 విక్రమ్ ల్యాండర్‌ను నాసా అంతరిక్ష నౌక లూనార్ రికానిసెన్స్ ఆర్బిటర్ (ఎల్ఆర్‌ఓ) గుర్తించిందని, వివరాల కోసం ఫొటోలు చూడాల్సిందిగా నాసా మంగళవారం ఒక ట్వీట్ చేసింది. విక్రమ్ ల్యాండర్ కూలిపోయిన పదిరోజులకు అంటే సెప్టెంబర్ 17న ఎల్ఆర్‌ఓ తీసిన కొన్ని ఛాయాచిత్రాలను నాసా విడుదల చేసింది. సెప్టెంబర్ 26న విడుదల చేసిన ఈ ఫొటోలను అదే ప్రాంతపు ఇతర ఫొటోలతో పోల్చి చూసి ల్యాండర్ జాడలను గుర్తించాలని నాసా ప్రజలను ఆహ్వానించింది. ఇందుకు స్పందించిన చెన్నై మెకానికల్ ఇంజనీర్ షణ్ముగ సుబ్రమణియన్ (33) తన ప్రయత్నం చేశారు.

ఎట్టకేలకు విక్రమ్ కూలిన ప్రాంతాన్ని, శకలాలను కనుగొన్నారు. అక్టోబర్ 3న నాసా, ఎల్ఆర్‌వో, ఇస్రో ట్విట్టర్ హ్యాండిళ్లను ట్యాగ్ చేసిన షణ్ముగ కొన్ని ఫొటోలను జత చేస్తూ 'విక్రమ్ ల్యాండర్ ఇదేనా (ల్యాండింగ్ ప్రాంతానికి కిలోమీటర్ దూరం)?.. జాబిల్లి మట్టిలో కూరుకుపోయిందా?' అంటూ ఓ ట్వీట్ చేశారు. 'విక్రమ్ ల్యాండర్ కూలిన ప్రాంతమిదే కావచ్చు. శకలాలు ఇక్కడే పడి ఉండవచ్చు' అంటూ మరికొన్ని వివరాలు, ఫొటోలను జత చేసి నవంబర్ 17న మరో ట్వీట్ చేశాడు.






చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ కూలిన ప్రాంతం (పసుపు రంగు వృత్తం). యువ ఇంజనీర్ షణ్ముగ

## 750 మీటర్ల దూరంలో...

షణ్ముగ ముందు విక్రమ్ కుప్పకూలిందన్న ప్రాంతానికి వాయవ్య దిశలో 750 మీటర్ల దూరంలో శకలాలను గుర్తించాడని, భారీ ఫొటోలో ఈ శకలం ప్రకాశవంతమైన పిక్సెల్‌గా కనిపించిందని నాసా వివరించింది. షణ్ముగ ఈ సమాచారాన్ని నాసాకు అందించడంతో ఎల్ఆర్‌ఓ కెమెరా సిబ్బంది ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టడం మొదలుపెట్టి శకలాల గుర్తింపులో విజయం సాధించింది. షణ్ముగ సమాచారం ఇచ్చిన తరువాత ఎల్ఆర్‌ఓ అక్టోబర్ 14, 15, నవంబర్ 11 తేదీల్లో ఆ ప్రాంతాన్ని మళ్లీ ఫొటోలు తీసిందని తెలిపింది. ఈ కొత్త పరిశీలనల ద్వారా విక్రమ్ ల్యాండర్ ముందుగా నిర్ణయించిన సాఫ్ట్‌ల్యాండింగ్ ప్రాంతం నుంచి ఆగ్నేయంగా సుమారు 2,500 అడుగుల దూరంలో కూలిందని, శకలాలు చెల్లాచెదురుగా పడ్డాయని నాసా తెలిపింది. విక్రమ్ ల్యాండర్ శకలాలను గుర్తించారని ధ్రువీకరించిన నాసా ఇందుకు సంబంధించి షణ్ముగకు కృతజ్ఞతలు తెలిపింది. సమాచారమిచ్చినందుకు ధన్యవాదాలని ఎల్ఆర్‌ఓ ప్రాజెక్టు డిప్యూటీ, సైంటిస్ట్ అయిన జాన్ కెల్లెర్ మంగళవారం ఒక ట్వీట్ చేశారు.

# ఎస్పీజీ బిల్లుకు పార్లమెంటు ఓకే

- రాజ్యసభ నుంచి కాంగ్రెస్ వాకౌట్
- రాజకీయ కక్ష కానే కాదు: అమిత్ షా



**న్యూఢిల్లీ:** దేశంలోని ప్రముఖులకు రక్షణ కల్పించే ఎస్పీజీ చట్టానికి చేసిన సవరణకు రాజ్యసభ మంగళవారం ఆమోదం తెలిపింది. రాజకీయ కక్షతోనే చట్ట సవరణ చేశారన్న ప్రతిపక్షాల ఆరోపణలను హోం మంత్రి తిరస్కరించగా, ఇదే అంశంపై తమ నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ సభ నుంచి వాకౌట్ చేసింది. ఎస్పీజీ చట్ట సవరణ బిల్లుపై జరిగిన చర్చకు హోం మంత్రి సమాధానమిస్తూ ప్రభుత్వం దేశంలోని 130 కోట్ల మంది ప్రజల భద్రతపై ఆలోచన చేసిందని, ఒక్క గాంధీ కుటుంబం గురించి మాత్రం కాదని స్పష్టం చేశారు. మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, ఐకే గుజ్రాల్, చంద్రశేఖర్, దేవేగౌడ, మన్మోహన్‌ల ఎస్పీజీ భద్రతపై సమీక్షలు జరిపినప్పుడు ఎలాంటి చర్చ జరగలేదని, ఆయన అన్నారు. అయితే హోం మంత్రి సమాధానంపై తాము సంతృప్తి చెందడం లేదన్న కాంగ్రెస్ పార్టీ సభ నుంచి వాకౌట్ చేసింది.

**ప్రధాని, కుటుంబ సభ్యులకు మాత్రమే..**

ఎస్పీజీ చట్టానికి చేసిన సవరణను పార్లమెంట్ ఆమోదించిన నేపథ్యంలో ఇకపై దేశ ప్రధాని, అధికార నివాసంలో ఉండే కుటుంబ సభ్యులకు మాత్రమే ఈ అత్యున్నత రక్షణ వ్యవస్థ సేవలు అందుతాయి. 'ప్రధానికి కేటాయించిన అధికారిక నివాసంలో ఉండే కుటుంబ సభ్యులకు ఐదేళ్లపాటు ఎస్పీజీ రక్షణ కల్పిస్తాం. అధికారం కోల్పోయిన రోజు నుంచి ఈ సేవలు నిలిపివేస్తారు' అని అమిత్ షా వివరించారు. చట్ట సవరణ వల్ల ప్రధాని మోదీకే నష్టం జరుగుతుందని, గద్దె దిగిన తరువాత ఆయనకు ఈ రక్షణ వ్యవస్థ అందుబాటులో ఉండదని చెప్పారు. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఇంట్లోకి ఆగంతకులు కొందరు చొరబడిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. నల్లటి టాటా సఫారీ వాహనంలో రాహుల్ గాంధీ వస్తారని ప్రియాంకకు ముందస్తు సమాచారం ఉందని, కానీ అతడికి బదులు మీరట్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు అదే వాహనంలో రావడంతో సెక్యూరిటీ సిబ్బంది లోనికి అనుమతించారని వివరించారు.

# 370 రద్దు.. పౌరసత్వ బిల్లు సమానమే!

**మంత్రి రాజ్‌నాథ్ వ్యాఖ్య**



**న్యూఢిల్లీ:** కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగ అధికరణ 370ని రద్దు చేయడం ఎంత ముఖ్యమైన విషయమో.. పౌరసత్వ సవరణ బిల్లూ అంతే ప్రాముఖ్యత కలిగిన అంశమని కేంద్ర రక్షణ మంత్రి, బీజేపీ సీనియర్ నేత రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ బిల్లును హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్లో ప్రవేశపెట్టే సమయంలో బీజేపీ ఎంపీలంతా కచ్చితంగా హాజరు కావాలన్నారు. ఆ బిల్లును బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదించే అవకాశముందన్నారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో మంగళవారం రాజ్‌నాథ్ పార్టీ ఎంపీలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా, పార్లమెంటు సమావేశాలకు ఎంపీలు గైర్హాజరు కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ పలు సందర్భాల్లో ఈ విషయంపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. రానున్న రోజుల్లో కీలక బిల్లులు సభ ముందుకు రానున్నందున ఎంపీలంతా తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. బీజేపీ ఎప్పుడూ దేశ ఐక్యత కోసమే పాటుపడుతుందన్నారు. 'పాక్, బంగ్లా, అఫ్గాన్‌లు ప్రధానంగా ముస్లిం మెజారిటీ దేశాలు. అక్కడ మత వేధింపులకు సాధారణంగా ముస్లిమేతరులే గురి అవుతారు. అందువల్ల ముస్లింలు కానివారికే ఆశ్రయం కల్పించాలన్నది బిల్లు ఉద్దేశం' అని అన్నారు. సమావేశాల్లో అంశాలపై విపక్ష ఆరోపణలను తిప్పికొట్టాలని ఎంపీలకు ఉద్బోధించారు.

# జూన్ నుంచి ఒకే దేశం–ఒకే రేషన్

**న్యూఢిల్లీ:** వలస కార్మికులకు, దినసరి కూలీలకు ప్రయోజనకర పథకంగా భావిస్తున్న 'వన్ నేషన్, వన్ రేషన్ కార్డ్'పథకం వచ్చే జూన్ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం, అర్హత కలిగిన లబ్ధిదారులు ఈ రేషన్ కార్డు ద్వారా దేశంలోని ఏదైనా చౌక ధరల దుకాణం(ఎఫ్‌పీఎస్) నుంచి తమ కోటా ఆహార ధాన్యాలను పొందగలుగుతారు. బయోమెట్రిక్ లేదా ఆధార్ ధ్రువీకరణ తర్వాత ఇది అందుబాటులోకి వస్తుందని ప్రజాపంపిణీ శాఖ మంత్రి పాశ్వాన్ చెప్పారు. 'ఉపాధి కోసం లేదా దేశవ్యాప్తంగా తమ నివాస చిరునామా మార్చుకునే వలస కార్మిక లబ్ధిదారులు, దినసరి కూలీలు, ఇతర రంగాల కార్మికులకు ఈ వ్యవస్థ ప్రయోజనం చేకూరుస్తుంది'అని ఆయన చెప్పారు. లబ్ధిదారుల ధ్రువీకరణను సమన్వయం చేయడానికి ప్రభుత్వం 'వన్ నేషన్ వన్ స్టాండర్డ్'పై కృషి చేస్తోందని చెప్పారు.

# అయోధ్య సమస్యకు కాంగ్రెసే కారణం

- జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారసభల్లో మోదీ



**జంషెడ్‌పూర్/ఖుంతి:** కాంగ్రెస్ నాన్చుడు ధోరణి కారణంగానే అయోధ్య వివాదం, ఆర్టికల్ 370 ఏళ్లపాటు కొనసాగాయని ప్రధాని మోదీ విమర్శించారు. గతంలో జార్ఖండ్‌లో కాంగ్రెస్ అవినీతిమయ, అస్థిర పరిపాలన సాగించిందని ఆరోపించారు. మంగళవారం ప్రధాని జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్, ఖుంతిల్లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ను, అయోధ్యలో రామజన్మభూమి సమస్యను కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలపాటు పట్టించుకోలేదని ఆరోపించారు. 'కాంగ్రెస్ చిక్కుముళ్లను మా ప్రభుత్వం పరిష్కరించింది. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య వివాదం ఇలాంటివే. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆర్టికల్ 370 ఉంది. అది రాజ్యాంగంలో చేర్చిన తాత్కాలిక నిబంధన. అయినా కాంగ్రెస్ తొలగించలేదు. ఆ పార్టీ ప్రభుత్వాలు చేయలేకపోయిన పనిని మేం చేసి చూపాం. ఆర్టికల్ 370ను తొలగించాం. అలాగే, రామ జన్మభూమి సమస్య. మేం అధికారంలోకి వచ్చాక ఈ సమస్య పుట్టిందా? దీన్ని పరిష్కారం కాకుండా అడ్డుకున్నది కాంగ్రెస్ కాదా? అలా చేయడం ఓటు బ్యాంకు రాజకీయం కాదా?'అని ప్రశ్నించారు. జార్ఖండ్‌లో అత్యధికంగా ఉన్న ఆదివాసీ ఓటర్లనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'అయోధ్య యువరాజుగా ఉన్న శ్రీరాముడు.. వనవాసం సమయంలో ఆదివాసీలతో గడిపి, వారి జీవనవిధానాన్ని అలవర్చుకుని మర్యాద పురుషోత్తముడిగా మారాడు'అని పేర్కొన్నారు. గతంలో జార్ఖండ్‌లో కాంగ్రెస్–జేఎంఎం కూటమి ప్రభుత్వాలు అవినీతిమయంగా నడిచాయన్నారు. ముఖ్యమంత్రి కుర్చీని సైతం అమ్మకానికి పెట్టాయన్నారు. ఆ కూటమి హయాంలో 15 ఏళ్లలో పది మంది సీఎంలు మారారన్నారు. కానీ, రఘుబర్ దాస్ సీఎంగా పూర్తి కాలం ఐదేళ్లు పనిచేశారన్నారు.

# హవాలా కేసు.. కాంగ్రెస్‌కు ఐటీ నోటీసు

**న్యూఢిల్లీ:** రూ.3,000 కోట్ల హవాలా రాకెట్‌కు సంబంధించి ఆదాయ పన్ను(ఐటీ) శాఖ కాంగ్రెస్‌కు నోటీసులిచ్చింది. ఓ కార్పొరేట్ సంస్థ నుంచి అందుకున్న రూ.170 కోట్ల విరాళంపై వివరణ ఇవ్వాల్సిందిగా ప్రతిపక్ష పార్టీని ఐటీ శాఖ కోరింది. రూ.3 వేల కోట్ల హవాలా రాకెట్‌కు సంబంధించి గత నెలలో దేశవ్యాప్తంగా జరిపిన సోదాల్లో ఈ విరాళం వ్యవహారం బయటపడిందని వివరించింది. ఈ కేసులో తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీకి, కొందరు కాంగ్రెస్ నేతలకు ఉన్న బంధంపై దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించింది. ఇందులో భాగంగానే కాంగ్రెస్‌కు నోటీసులిచ్చామంది. 'మౌలిక రంగ కార్పొరేట్ సంస్థలకు హవాలా రాకెట్‌తో ఉన్న లింకులపై ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, పుణే, ఆగ్రా, గోవాల్లోని 42 చోట్ల దాడులు జరపగా తప్పుడు బిల్లులు, బోగస్ కాంట్రాక్టులు, అక్రమ లావాదేవీలు భారీగా బయటపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ ప్రముఖుడికి రూ.150 కోట్లకు పైగా నగదు ముట్టినట్లు ఆధారాలు దొరికాయి. రూ.4.19 కోట్ల లెక్క చూపని నగదుతోపాటు రూ.3.2 కోట్ల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నాం'అని ఐటీ శాఖ వెల్లడించింది. కార్పొరేట్ సంస్థలతో హవాలా నిర్వాహకులకు ఉన్న సంబంధాలపై కీలక ఆధారాలు దొరికాయని పేర్కొంది. హవాలా మార్గంలో భారీగా నిధుల మళ్లించిన సంస్థలు ఢిల్లీ, ముంబైల్లో ఎక్కువగా ఉన్నాయి.

# నిత్యానంద దేశం.. కైలాస!



- ఈక్వెడార్ నుంచి ఒక చిన్న ద్వీపం కొనుగోలు
- ప్రత్యేక పాస్‌పోర్ట్, జెండా
- దేశంగా గుర్తించాలంటూ త్వరలో ఐరాసకు లేఖ


**న్యూఢిల్లీ:** అత్యాచారం సహా పలు ఆరోపణలు ఎదుర్కొంటూ దేశం విడిచి పారిపోయిన వివాదాస్పద స్వామీజీ నిత్యానంద సొంతంగా ఓ దేశాన్నే ఏర్పాటు చేసుకున్నారు. ఈక్వెడార్ నుంచి ఒక చిన్న ద్వీపాన్ని కొనుగోలు చేసి, దానికి 'కైలాస' అని పేరు పెట్టారు. ట్రినిడాడ్ అండ్ టుబాగోకు దగ్గర్లోని తన ద్వీప దేశానికి ఒక పాస్‌పోర్ట్‌ను, జెండాను, జాతీయ చిహ్నాన్ని డిజైన్ చేశారు. ఒక ప్రభుత్వాన్ని, ప్రధాన మంత్రిని, కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. రోజు కేబినెట్ భేటీలు జరుపుతున్నారని సమాచారం. ప్రధానిగా 'మా'ని నియమించారని, గోల్డ్, రెడ్ కలర్లలో పాస్‌పోర్ట్‌ను రూపొందించారని ఆ 'దేశ' వెబ్‌సైట్ పేర్కొంది. తన 'కైలాస'కు ఒక దేశంగా గుర్తింపునివ్వాలని నిత్యానంద ఐక్యరాజ్య సమితికి విజ్ఞప్తి చేయనున్నారు. కైలాస రాజకీయేతర హిందూ దేశమని, హిందూత్వ పునరుద్ధరణ కోసం కృషి చేస్తుందని ఆ వెబ్ సైట్లో పేర్కొన్నారు. దేశ పౌరసత్వం కావాలనుకునే వారు విరాళాలు ఇవ్వాలనే విజ్ఞప్తిని కూడా అందులో పొందుపర్చారు. మెరూన్ కలర్ బ్యాక్‌గ్రౌండ్‌లో ఓ సింహాసనం ముందు నిత్యానంద కూర్చుని ఉండగా పక్కన నంది ఉన్న చిత్రంతో జెండాను రూపొందించారు. ప్రభుత్వంలో 10 శాఖలను కూడా ఏర్పాటుచేశారు. అందులో ఒకటి నిత్యానంద స్వామి కార్యాలయం కాగా, విదేశీ వ్యవహారాలు, రక్షణ, సోషల్ మీడియా, హోం, కామర్స్, విద్య.. మొదలైన ఇతర శాఖలు ఉన్నాయి. తమది సరిహద్దులు లేని దేశమని, తమ తమ దేశాల్లో స్వేచ్ఛగా హిందూయిజాన్ని అనుసరించలేని వారి కోసం ఈ దేశం ఏర్పాటయిందని కైలాస వెబ్ సైట్లో పేర్కొన్నారు. తమ దేశంలో ఉచితంగానే భోజనం, విద్య, వైద్యం లభిస్తాయని, ఆధ్యాత్మిక విద్య, ప్రత్యామ్నాయ వైద్య విధానాలపై ప్రధానంగా దృష్టి పెడతామని ఆ వెబ్ సైట్లో పేర్కొన్నారు. 'మాది భౌగోళికపరమైన దేశం కాదు. ఒక భావనాత్మక దేశం. శాంతి, స్వేచ్ఛ, సేవాతత్పరతల దేశం. ఏ దేశ ఆధిపత్యం కింద లేని మేం ఇతర దేశాలతో, అంతర్జాతీయ సంస్థలతో దౌత్య సంబంధాలు ఏర్పాటు చేసుకుంటాం' అని కూడా అందులో పేర్కొన్నారు. అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న నిత్యానంద నకిలీ పాస్‌పోర్ట్‌తో, నేపాల్ గుండా భారత్ నుంచి పారిపోయారు.






ప్రతిపాదిత కైలాస దేశం పాస్‌పోర్టు

# అజిత్, ఫడ్నవీస్‌ల మైత్రి ముందే తెలుసు



**ముంబై:** బీజేపీ నేత, మాజీ సీఎం ఫడ్నవీస్‌తో అజిత్ పవార్ సన్నిహితంగా మెలుగుతున్న విషయం నవంబర్ 23వ తేదీనాటి పరిణామాలకు ముందే తనకు తెలుసునని ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ వెల్లడించారు. బీజేపీతో చేతులు కలిపి మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంగా అజిత్ పవార్ ప్రమాణ స్వీకారం చేయకమునుపే వారిద్దరి మధ్య చర్చల వ్యవహారం తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే, అజిత్ నడిపించిన తంతు అంతా తనకు తెలిసే జరిగిందంటూ వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు. నవంబర్ 23వ తేదీనాటికే శివసేన–ఎన్సీపీ–కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు దాదాపు ఖరారైందని మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శరద్ పవార్ పేర్కొన్నారు. అజిత్‌ను కేబినెట్‌లో తీసుకునే విషయంలో శీతాకాల అసెంబ్లీ సమావేశాల అనంతరమే నిర్ణయిస్తామన్నారు. 'ఉద్ధవ్ ప్రభుత్వం పూర్తి కాలం ఐదేళ్లు కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రకారమే నడుస్తుంది. అంతేతప్ప ఏ భావజాలం ప్రకారమో కాదు' అని ఆయన స్పష్టం చేశారు.

సాక్షి
బుధవారం, డిసెంబర్, 4

# దిద్దుబాటు చర్యలే కీలకం

హైదరాబాద్ శివార్లలో జరిగిన 'దిశ' ఘటనపై సోమవారం పార్లమెంటు ఉభయ సభల్లో ఆగ్రహావేశాలు, ఆందోళన వ్యక్తమయ్యాయి. చర్చ సందర్భంగా అన్ని పక్షాల సభ్యులూ నిందితులకు ఉరిశిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేయడంతోపాటు, అత్యాచారానికి ఉరే ఏకైక శిక్షగా ఉండేలా చట్టాన్ని సవరించాలని కోరారు. ఆ ఘటన వెలుగుచూసిన నాటినుంచీ సమాజంలో భిన్న రంగాలకు చెందిన వారు చేస్తున్న డిమాండ్ వారి గళంలో ప్రతిఫలించింది. 'దిశ' ఉదంతం దేశవ్యాప్తంగా నిరసనలు రగిల్చింది. వేలాదిమంది వీధుల్లోకొచ్చి నేరగాళ్లను వెనువెంటనే బహిరంగంగా ఉరి తీయాలని లేదా ఎన్‌కౌంటర్ చేయాలని, సత్వరం కఠిన శిక్షలు పడితేనే ఇటువంటి అఘాయిత్యాలకు అడ్డుకట్ట పడుతుందని డిమాండ్ చేస్తున్నారు. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా ఎన్నోచోట్ల ధర్నాలు, ర్యాలీలు జరుగుతున్నాయి. నేరగాళ్ల క్రూరత్వం తీవ్రత సమాజం మొత్తాన్ని తల్లడిల్లజేస్తుంది. ఏడేళ్లక్రితం ఢిల్లీ వీధుల్లో నిర్భయను, ఆమె స్నేహితుణ్ణి మభ్యపెట్టి బస్సులో ఎక్కించుకున్న ఆరుగురు మృగాళ్లు పాశవికంగా ప్రవర్తించినప్పుడూ ఇదే తరహాలో దేశం మొత్తం భగ్గుమండింది. దాని పర్యవసానంగానే కఠినమైన నిబంధనలతో నిర్భయ చట్టం అమల్లోకి వచ్చింది. జస్టిస్ జేఎస్ వర్మ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ అలుపెరగకుండా చేసిన కృషి ఫలితంగానే ఇది సాధ్యమైంది. ఆ కమిటీ నెలరోజుల్లోనే నివేదిక అందజేయగలిగింది. దోషులకు కఠిన శిక్షపడేలా చట్టాన్ని సవరించడానికి సిద్ధంగా ఉన్నామని లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హామీ ఇచ్చారు. రాజ్యసభలో చర్చను ప్రారంభించిన సభాధ్యక్షుడు వెంకయ్యనాయుడు ఇలాంటి ఉదంతాలు పునరావృతం కాకుండా ఏం చేయాలన్న అంశంపై అందరూ దృష్టిపెట్టాలని అంటూనే చట్టం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారం కాదని సరిగానే అభిప్రాయపడ్డారు. చర్చలో పాల్గొన్న సమాజ్‌వాదీ సభ్యురాలు జయా బచ్చన్ అయితే అత్యాచారం కేసుల్లో దోషులుగా తేలినవారిని కొట్టి చంపాలని డిమాండ్ చేసి సంచలనం సృష్టించారు.

జస్టిస్ వర్మ కమిటీ తన నివేదికలో చేసిన వ్యాఖ్యల్ని ఈ సందర్భంగా గమనంలోకి తీసుకోవాలి. దేశంలో అభద్ర వాతావరణానికి కారణం చట్టాలు లేకపోవడం వల్ల కాదనీ, వాటిని సక్రమంగా అమలు పరిచే వ్యవస్థ లేకపోవడమే ప్రధాన సమస్య అని తెలిపింది. జస్టిస్ వర్మ కమిటీ ఒక్కటే కాదు... అంతక్రితం పలు సంఘాలు కూడా ఇదే మాట చెప్పాయి. వ్యవస్థలోని వివిధ విభాగాల్లో పేరుకుపోయిన అలసత్వాన్నీ, ఉదాసీనతనూ పారదోలనంతకాలం ఎన్ని చట్టాలున్నా ఫలితం ఉండదని లా కమిషన్ నివేదిక సైతం 2000 సంవత్సరంలో హెచ్చరించింది. పన్నెండేళ్లలోపు బాలికలపై అత్యాచారం లేదా సామూహిక అత్యాచారం చేసే నేరగాళ్లకు ఉరిశిక్ష విధించేలా 2018లో భారతీయ శిక్షాస్మృతిని సవరించారు. ఇది చరిత్రాత్మకమైనదని అందరూ ప్రశంసించారు. ఆ సవరణ ఫలితం నిరుడంతా కనబడింది. అత్యాచారం కేసుల్లో నేరగాళ్లకు 2000 సంవత్సరం తర్వాత అత్యధికంగా మరణశిక్షలు పడటం ఇదే తొలిసారని ఢిల్లీలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఈ ఏడాది మొదట్లో విడుదల చేసిన నివేదికలో తెలియజేసింది. 2018లో అత్యాచారం కేసుల్ని విచారించిన దిగువ కోర్టులు మొత్తం 162మంది నిందితులకు మరణశిక్షలు విధించాయి. అంతక్రితం ఈ సంఖ్య 108. కింది కోర్టులు విధించే ఉరిశిక్షలను హైకోర్టులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. 2018లో 23మంది ఉరిని మాత్రమే హైకోర్టులు ఖరారు చేశాయి. 58 కేసుల్లో యావజ్జీవ శిక్షగా మార్చాయి. దాదాపు 25 కేసుల్లో నిందితులు నిర్దోషులని తీర్పునిచ్చాయి. సుప్రీంకోర్టు నిరుడు మొత్తం 12 కేసుల్లో అప్పీళ్లను విచారించింది. వీటిల్లో 2017నాటివి, అంతక్రితం కేసులూ కూడా ఉన్నాయి. 11 కేసుల్లో దోషులకు యావజ్జీవశిక్ష విధించింది. ఒక్క కేసులో మాత్రమే ముగ్గురు నేరగాళ్లకు ఉరిశిక్ష ఖరారు చేసింది. అది నిర్భయ కేసు! వీరికి తక్షణం మరణశిక్ష అమలు చేయాలని దాఖలైన పిటిషన్‌ను నిరుడు సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ప్రస్తుతం ఆ హంతకులు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. వాస్తవానికి అంతకుముందున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ జేఎస్ కేహార్‌లతో పోలిస్తే ఈమధ్యనే రిటైరైన జస్టిస్ రంజన్ గొగోయ్ తన పదవీకాలంలో మరణశిక్షల కేసులను సాధ్యమైనంత త్వరగా తేల్చాలన్న సంకల్పాన్ని ప్రదర్శించారు. ముగ్గురేసి న్యాయమూర్తులుండే నాలుగు ధర్మాసనాలను ఇందుకోసం ఏర్పాటుచేశారు. ఈ ధర్మాసనాలు ఆరువారాలపాటు ప్రత్యేకించి ఈ కేసులను మాత్రమే విచారించాయి. ఒక నేరాన్ని మరణశిక్ష పరిధిలోకి తెస్తే ఇంత సుదీర్ఘ ప్రక్రియ సాగుతుంది. ఇప్పుడు పార్లమెంటులోనూ, వెలుపలా వెల్లువెత్తిన డిమాండ్ల పర్యవసానంగా చట్టాన్ని మరింత కఠినం చేయడానికి సిద్ధమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది గనుక ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఎలాంటి సూచనలొస్తాయో చూడాలి.

అయితే అంతకన్నా ముందు సమాజంలో అన్ని స్థాయిల్లోనూ పేరుకుపోయిన పురుషాధిక్య భావనను కూకటివేళ్లతో పెకిలించాలి. కుటుంబాలతో మొదలుపెట్టి వివిధ ప్రభుత్వ విభాగాల వరకూ అన్నిచోట్లా అంతర్లీనంగా ఉంటున్న ఈ చీడను వదలగొట్టకపోతే సమస్య పరిష్కారం కాదు. ఇంట్లోనూ, బయటా మహిళల్ని గౌరవించడం విషయంలో సమాజం ఆలోచనను మార్చకుండా కఠిన చట్టాల వల్ల ఒరిగేదేమీ ఉండదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భానుమతి ఒక సందర్భంలో చేసిన వ్యాఖ్య గమనించదగ్గది. అత్యాచార కేసులు నమోదు చేయడంలో ఉదాసీనత ప్రదర్శించే పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జస్టిస్ జేఎస్ వర్మ కమిటీ చెప్పింది. అసలు అత్యాచార కేసుల్ని విచారించే తీరు మారాలని సూచించింది. ఇలాంటి అంశాలన్నిటినీ సమగ్రంగా పరిశీలించి దిద్దుబాటు చర్యలు తీసుకోనంతకాలం ఎన్ని కఠిన చట్టాలు తీసుకొచ్చినా వృథా అవుతాయని గుర్తించాలి.


## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి శు.అష్టమి రా.12.52 వరకు తదుపరి నవమి, నక్షత్రం శతభిషం సా.5.14 వరకు తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం రా.12.19 నుంచి 2.07 వరకు దుర్ముహూర్తం ఉ.11.26 నుంచి 12.10 వరకు అమృతఘడియలు... ఉ.9.20 నుంచి 11.19 వరకు.

సూర్యోదయం : 6.19
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

# ఇంగ్లిష్ చదివితే మతం మారతారా!

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

**పేద, దిగువ తరగతుల పిల్లలు ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో చదివినంతమాత్రానే మతం మారిపోతారనడం అర్థరహితం. బోధనా మాధ్యమంలో, సిలబస్ కంటెంటులో, విద్యా వాతావరణంలో తీసుకొస్తున్న సమానత్వం అందరికీ అందుబాటులోకి వస్తుందన్న భయం నుంచే ఇలాంటి వాదనలు వస్తున్నాయి. బీజేపీ, టీడీపీ నేతలు భయపడితే అర్థం చేసుకోవచ్చు కానీ కమ్యూనిస్టులకు ఎందుకీ భయం? గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం, పిల్లలను బడికి పంపిన ప్రతి తల్లి ఖాతాకు అమ్మ ఒడి పేరుతో రూ. 15,000 అందించడం అనేవి రక్తపాతరహిత విప్లవాన్ని తీసుకొస్తాయి. తమ పిల్లలకు ఇంగ్లిష్ విద్యను వ్యతిరేకిస్తున్న వారిపై పోరాడేందుకు తల్లులందరూ అమ్మ హక్కుల బృందాలను ఏర్పర్చాలి. మన ఇళ్ల ముందుకు వచ్చిన ఈ అపూర్వ అవకాశాన్ని కోల్పోవడాన్ని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దు.**

పేద, దిగువ కులాలకు చెందిన పిల్లలు ఇంగ్లిష్ నేర్చుకోవడాన్ని ఇష్టపడని శక్తుల ద్వారా ఓ కొత్త సిద్ధాంతం వ్యాప్తిలోకి వచ్చింది. ప్రైవేట్ ఇంగ్లిష్ విద్య చదివిన పిల్లలతో గ్రామీణ విద్యార్థులు పోటీపడకూడదని వీరు భావిస్తున్నారు. వీరు ఒక రాజకీయ పార్టీ లేక ఒక రాజకీయ సిద్ధాంతానికి చెందినవారు కారు. మితవాద పార్టీల సంస్థల నుంచి మీడియా పరిశ్రమాధిపతుల నుంచి, వామపక్ష భావజాలానికి చెందిన విద్యావేత్తల వరకు అన్నిరంగాల్లో ఈ శక్తులు పాతుకుపోయాయి. ఈ కొత్త సిద్ధాంతం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఏమిటా సిద్ధాంతం? ఇంగ్లిష్ చదివిన వారందరూ క్రైస్తవులు అయిపోయారట. ఇది షాక్ కలిగించడం లేదూ? ఇది నిజమే అయితే, అమరావతిలో తిష్ట వేసిన సంపన్నులు, బంజారాహిల్స్ బంగ్లాల్లో నివసిస్తున్నవారు, జూబ్లీహిల్స్ భవనాల్లో ఉంటున్నవారు క్రైస్తవులుగా మారిపోయి ఉండాలి మరి. ఇది నిజమే అయినట్లయితే, గ్రేటర్ కైలాస్ ఖాన్ మార్కెట్ (న్యూఢిల్లీ) ప్రాంతంలోని భారతీయ మేధావులు, వాణిజ్యవేత్తలు, మెరీన్ డ్రైవ్ క్వీన్స్ నెక్లెస్ బీచ్ (ముంబై) ఆకాశ హర్మ్యాలలో నివసిస్తున్నవారు, చెన్నైలోని అయ్యర్, అయ్యంగార్లు నివసించే కాలనీలు ఇప్పటికే క్రైస్తవులతో నిండిపోయి ఉండాలి. వీళ్లంతా ఒక చేతిలో బైబిల్, నుదుటి మీద క్రాస్‌ని కలిగి ఉండాలి మరి. ఇకపోతే ఇంగ్లిష్‌లో వలసవాదాన్ని పసిగడుతున్న మన ఉదారవాద, వామపక్ష కామ్రేడ్లు కూడా ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో చదివి ఉండటమే కాకుండా తమ తమ పార్టీల సెంట్రల్ కమిటీ, పొలిట్ బ్యూరో సమావేశాలను కూడా ఇంగ్లిష్‌లోనే నిర్వహిస్తున్నారు. మరి వీరు కూడా సుత్తి కొడవలికి బదులుగా తమ ఎన్నికల చిహ్నాలుగా క్రాస్‌నే కలిగి ఉండాలి కదా.

మనం తినే ఆహారాన్ని పండిస్తున్న, మన నగరాలకు తిండి పెడుతున్న గ్రామీణులకు విద్యలో సమానత్వం అందుబాటులోకి వచ్చినప్పుడు, పట్టణ ప్రాంతాల్లోని సంపన్నులు సౌకర్యవంతమైన జీవితం ఎలా గడుపుతున్నారో వారు చూడగలిగినప్పుడు ఎలా ఉంటుందో చూడాల్సిందే. భారతీయ విద్యావంతులు క్రైస్తవులుగా మారిపోయారనే విషం చిమ్ముతున్న మితవాద కపటవేషధారులను సులభంగానే అర్థం చేసుకోవచ్చు. కానీ వామపక్షానికి చెందిన అగ్రకులాలు, వారి అనుయాయులు కూడా సూపర్ మితవాదులుగా వ్యవహరిస్తున్నారు. కారల్ మార్క్స్ వీరిని చూసి జాలిపడి ఉండేవారు, వారి ఉప తెలుగు జాతీయవాదపు అత్యంత చెత్త భావాలను చూసి ఆయన నిజంగానే చింతించేవారు. ఇప్పుడు ఆ మార్క్స్ కూడా వారిని కాపాడలేడు. దేవుడు మాత్రమే వీరిని కాపాడాల్సి ఉంది. మహాత్మాగాంధీ నుంచి జవహర్‌లాల్, ఇందిరాగాంధీ దాకా, జ్యోతిబసు నుంచి నంబూద్రిపాద్, ఇంద్రజిత్ గుప్తా, సీతారాం ఏచూరి, ప్రకాష్ కారత్, బృందా కారత్ వరకు అందరూ ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే చదువుకున్నారు. వీరు మాత్రమే కాకుండా మతఛాందసవాద పక్షానికి చెందిన లాల్ కృష్ణ అడ్వాణీ నుంచి అరుణ్ శౌరీ, అరుణ్ జైట్లీ, నిర్మలా సీతారామన్ నుంచి మోదీ ఆధునిక మార్కెట్ పరిశ్రమలో పనిచేస్తున్న అనేకమంది మేధావులు కూడా ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్నవారే.. పైగా వీరిలో చాలామంది క్రిస్టియానిటీ వ్యతిరేకులే.



మతఛాందసవాద పక్ష హీరో అయిన వీర్ సావర్కర్ పుణేలోని ఫెర్గూసన్ కాలేజీలో అధ్యయనం చేశారు. ఇక్కడే గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర్ తిలక్ కూడా చదువుకున్నారు. బాంబే ప్రావిన్స్‌లోని అత్యుత్తమ ఇంగ్లిష్ మీడియం కాలేజీల్లో ఫెర్గూసన్ కాలేజీ ఒకటని గుర్తుంచుకోవాలి. శ్యామాప్రసాద్ ముఖర్జీ కూడా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదువుకున్నారు. తర్వాత కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో ఇంగ్లిష్‌ను ప్రధాన భాషగా ఎంచుకున్నారు. ఆ ప్రాంతంలోనే అత్యుత్తమ ఇంగ్లిష్ కాలేజీల్లో అదొకటి. ఇంగ్లిష్ మీడియం విద్య నిజంగానే హిందూయిజంలోని వ్యక్తులను క్రిస్టియానిటీలోకి మార్చేటట్లయితే, పైన పేర్కొన్న వ్యక్తుల్లో చాలామంది పాస్టర్లు, బిషప్పుల్లా అయి ఉండేవారు. కానీ వీరందరూ ఎవరో మనకు బాగానే తెలుసు.

వీరిలో ఇప్పటికే చనిపోయినవారి మృతదేహాలను వారి సమాధులలో శిలువ చిహ్నం ఉంచి పూడ్చిపెట్టలేదు. తగిన హిందూ సంప్రదాయాలతో, వారి పార్థివ దేహాలను దహనం చేశారు. మరి ఏపీలో పైన పేర్కొన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో చదువుకున్న హిందూ నేతలను అనుసరిస్తున్న ఈ నాయకులంతా ప్రైవేట్ కాన్వెంట్ స్కూల్ ఇంగ్లిష్ విద్యను చదువుకోలేని పేదపిల్లలు ఇప్పుడు క్రిస్టియన్లుగా మారిపోతారని ఎందుకు భావిస్తున్నారు? వీరు ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం స్కూల్స్‌లో చదివినంతమాత్రానే మతం ఎందుకు మారిపోతారో ఈ నేతలే జవాబు చెప్పాలి. ఇలాంటి వాదన ఎక్కడి నుంచి వస్తోంది? సమానత్వం అనే ప్రగాఢమైన భయం నుంచే ఈ వాదనలు పుట్టుకొస్తున్నాయి. బీజేపీ, టీడీపీ నేతలు భయపడితే అర్థం చేసుకోవచ్చు కానీ కమ్యూనిస్టులకు ఎందుకీ భయం?

ఈ భయానికి అసలైన కారణం బోధనా మాధ్యమంలో, సిలబస్ కంటెంటులో, విద్యా వాతావరణంలో సమానత్వాన్ని తీసుకురావడమే. విద్యాపరంగా సమానత్వం తీసుకువస్తే.. పేదలు సంపన్నులను సవాలు చేయగలరని, దిగువ కులాలు ఎగువ కులాలను సవాలు చేయగలవని ఇలాంటి వారంతా భయపడిపోతున్నారు. సమానత్వం కోసం పోరాటంలో మానవ చరిత్ర చాలా రక్తం ధారపోసింది. అది దేవుడి ముందు సమానత్వం కోసం పోరాడింది. ఆ యుద్ధంలో సగం విజయాన్ని మాత్రమే సాధించింది. అది భూమిపై సమాన హక్కుల కోసం పోరాడింది. ఈ రంగంలో కూడా మానవ చరిత్ర సగం విజయాన్ని మాత్రమే సాధించింది. భారతదేశంలోనూ భూమి కోసం పోరాటంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల దాకా అనేకమంది భూ సమస్యపైనే పోరాడి ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ ఇప్పటికీ ఆ సమానత్వం రాలేదు. ఉదారవాద పెట్టుబడిదారీ విధానం కంప్యూటర్‌ని, ఇంటర్నెట్ విప్లవాన్ని తీసుకొస్తుందని కమ్యూనిస్టు సిద్ధాంతం ఎన్నడూ ఊహించలేదు. కానీ అంతర్జాతీయతత్వాన్ని విశ్వసించే వామపక్షవాదులు ఇంతగా ఎలా పతనమయ్యారు? మన దేశ వామపక్షాలు సృజనాత్మకతను మొత్తంగా కోల్పోయి సులభంగా ఆకర్షించే కపటత్వంలోకి ఎలా వెళ్లిపోయాయి?

రక్తాన్ని చిందించడం ద్వారా కంప్యూటర్, ఇంటర్నెట్ విప్లవాలను ఎవరూ తీసుకురాలేదు. మంచి పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచే వీటిని సాధించారు. ప్రత్యేకించి తెలుగు, తమిళం, హిందీ ద్వారా కాకుండా ఇంగ్లిష్ భాషలో విద్య ద్వారానే ఈ విప్లవాలను తీసుకొచ్చారు. ఏ భాష అయినా కొత్త విషయాలను కనిపెట్టే శక్తిసామర్థ్యాలను కలిగి ఉండాలి. హిందుత్వ శక్తులు నూతన విప్లవాల చరిత్రను అర్థం చేసుకుంటారని ఎవరూ ఊహించరు కానీ ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే సూత్రాన్ని విశ్వసించే కమ్యూనిస్టులు చరిత్రను అర్థం చేసుకుంటారని అందరూ భావిస్తారు. కానీ కార్మికుల మధ్య భావ వ్యక్తీకరణ సాధనంగా ఒక ఉమ్మడి ప్రపంచ భాష లేకుండా వారు కార్మికులను ఎలా ఐక్యపర్చగలరు?

బోధనా మాధ్యమం, సిలబస్ కంటెంట్, పాఠశాల మౌలిక వసతి వంటి అంశాలపరంగా విద్యాపరమైన సమానత్వం గురించి ఇతర రాజకీయనేతలు ఆలోచించకముందే కమ్యూనిస్టులు దానిగురించి ఆలోచించి ఉండాలి. కానీ కమ్యూనిస్టులు సరిగ్గా దానికి వ్యతిరేకంగా వ్యవహరించారు. రెండు విభిన్న మాధ్యమాల ఉనికి గురించి ప్రశ్నించకుండానే వారు తమ పిల్లలను ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో చేర్పించారు. ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే, తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మాత్రం కార్మిక వర్గం, దిగువ కులాలు, పేద తరగతులకు చెందిన పిల్లలను ప్రాంతీయ భాషలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్బంధంగా చేర్పించారు. ఇదే రకమైన పాఠశాల విద్యా వ్యవస్థతో వారు పశ్చిమబెంగాల్‌ను ధ్వంసం చేశారు.

ఇప్పుడు వీరు ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాల్లో ఇంగ్లిష్ విద్య ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం, పాఠశాలకు పిల్లలను పంపిన ప్రతి తల్లి ఖాతాకు అమ్మ ఒడి పేరుతో రూ. 15,000 అందించడం అనేవి రక్తరహిత విప్లవాన్ని తీసుకొస్తాయి. ప్రతి గ్రామంలోనూ ఉంటున్న యువత ఇంగ్లిష్ విద్యా పరిరక్షణ దళాలను నిర్వహించాలి. తమ పిల్లలకు ఇంగ్లిష్ విద్యను వ్యతిరేకిస్తున్న వారిపై పోరాడేందుకు తల్లులందరూ అమ్మ హక్కుల బృందాలను ఏర్పర్చాలి. గ్రామాల్లోని మన ఇళ్ల ముందుకు వచ్చిన ఈ అపూర్వ అవకాశాన్ని కోల్పోవడాన్ని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదు.

వ్యాసకర్త డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### రేప్



"రేపిస్ట్‌లకు పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉంది. ఎవరూ రేపిస్ట్‌గా పుట్టరు. పితృస్వామిక భావజాలంతో తలెత్తే అత్యాచార సంస్కృతి నుంచి రేపిస్ట్ తయారవుతారు. మనం జీవిస్తున్న ఈ సమాజం నుంచి వారూ రూపొందుతారు. అలా జరగకుండా ఆపండి. ముగ్గురిని చంపేసినంత మాత్రాన మార్పు రాదు. అంతేకాదు, అత్యాచారానికి గురికావద్దని మహిళకు చెప్పకండి. మహిళలపై అత్యాచారాలకు పాల్పడవద్దని చెప్పండి. అప్పుడు మహిళలు వారిని వారు కాపాడుకోవాల్సిన అవసరం ఉండదు. తాను బాధితురాలు కాకుండా యత్నించడం అనేది మహిళల బాధ్యత కాదు. అత్యాచారానికి గురికాకుండా తప్పించుకోగలిగే పద్ధతులేంటో మహిళలకు తెలీదు" – రాధిక, స్త్రీవాద కార్యకర్త


### అరాచకం



"పాకిస్తాన్‌లో చంద్రి కొల్హి అనే హిందూ అమ్మాయిని జిహాదీలు కిడ్నాప్ చేసి బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చి, ఒక ముస్లింకు ఇచ్చి వివాహం చేశారు. ఆ అమ్మాయి వయసు కేవలం పన్నెండేళ్లే. తల్లిదండ్రులు దుఃఖిస్తున్నారు. పాక్‌లో మైనారిటీలపై అరాచకాలు పెరిగిపోతున్నాయి. సిగ్గుచేటు ఇమ్రాన్ ఖాన్"

– వినితా హిందుస్తానీ, ఉపాధ్యాయురాలు

### కుటుంబం



"ఉల్లిపాయల ధర కిలో రూ.100కు చేరుకుంది. రైల్వే లాభాలు పదేళ్లలో ఎన్నడూలేని స్థాయికి దిగజారాయి. జీఎస్టీ పరిహారం చెల్లించాల్సిందిగా రాష్ట్రాలు కేంద్రాన్ని కోరుతున్నాయి. మహిళా భద్రత జాతీయ స్థాయిలో చర్చనీయాంశం అయింది. కానీ, కాంగ్రెస్ ఆసక్తి మాత్రం కేవలం ఒక్క కుటుంబం పైనే"

– మార్యా షకీల్, జర్నలిస్ట్

### భద్రత



"ఎస్పీజీ భద్రతను పునరుద్ధరించకపోతే ప్రియాంకా గాంధీకి ఎటువంటి ఇబ్బందులు ఎదురవుతాయో ఇప్పటికైనా మీడియాకు అర్థమై ఉంటుంది. ఎటువంటి అనుమతీ లేకుండా ఎప్పుడంటే అప్పుడు అనుకోని అతిథులు రావడానికి మించి ఏముంటుంది. వాళ్లు పార్టీకే చెందినవారైనప్పటికీ వ్యక్తిగత సమయంలో ఎలా అనుమతిస్తారు"

– నగ్మా, కాంగ్రెస్ నేత


### ప్రాధాన్యత



"దేశ ఆర్థిక వ్యవస్థ ఇంత అస్తవ్యస్తంగా ఉంటే గాంధీ కుటుంబానికి ఎస్పీజీ భద్రతను ఉపసంహరించుకోవడం కాంగ్రెస్‌కు పార్లమెంట్‌లో తొలి ప్రాధాన్యత ఎలా అవుతుంది? మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భద్రతను ఉపసంహరించుకున్నప్పుడు కూడా వాళ్లు ఇలాగే స్పందించారా? జీడీపీ పెరుగుదల ఆరేళ్ల కనిష్టానికి చేరుకుంది. నాలుగు నెలలుగా కశ్మీరీ నేతలు నిర్బంధంలో ఉన్నారు. ఇన్ని సమస్యలు ఉండగా, జాతీయ ప్రతిపక్షం అయిన కాంగ్రెస్ మాత్రం భద్రత ఉపసంహరణపైనే ప్రశ్నిస్తోంది" – నిధి రజ్దాన్, జర్నలిస్ట్

### శుభాకాంక్షలు

"కెప్టెన్ మిథాలీ రాజ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఈ పుట్టిన రోజు నాడు నేను నీకు ఇవ్వగలిగిన బహుమతి ఏంటో అర్థంకావడం లేదు. కానీ, నిన్ను నువ్వు తెరపై చూసుకుని గర్వపడేలా నా శాయశక్తులా కృషి చేస్తానని నీకు హామీ ఇస్తున్నా"



– తాప్సీ పన్ను, హీరోయిన్

ఇన్‌బాక్స్

## సతీ సహగమన నిషేధ స్ఫూర్తి

హైందవ సంస్కృతిలో అమానవీయమైన సతీ సహగమన ఆచారాన్ని నిషేధించిన ఉదార ఆంగ్లపాలకుడు విలియం బెంటిక్. దేశంలో భర్త చనిపోయిన వెంటనే అతడి చితి మంటలపై అగ్నికీలలకు ఆహుతి అవుతున్న హైందవ మహిళలకు అండగా నిలిచి, ఆ అనాగరిక ఆచారాన్ని విలియం బెంటిక్ 1829 డిసెంబర్ 4న నిషేధించారు. క్రీ.శ. 510 ఎరాన్ శాసనంలో సతీ సహగమన ఆచారం లిఖితపూర్వకంగా చేర్చారు. ఈ శాసనాన్ని గుప్తుల రాజు భానుగుప్తుడు చేశారు. అప్పటి నుండి కాటికి కాళ్ళు చాచిన ముదుసలి భర్త మరణిస్తే ముక్కుపచ్చలారని పసిపిల్లలను కూడా భర్త చితిలో వేసి, ఆమెను అగ్నికి ఆహుతి చేసే అనాగరిక ఆచారం పేరే సతీ సహగమనం. దీనిపై భారతీయ సంస్కరణల వేగుచుక్క రాజా రామ్మోహన్ రాయ్ తీవ్రస్థాయిలో ఉద్యమించారు. బెంటిక్‌కు ముందు అనేక మంది ఆంగ్ల పాలకుల దృష్టికి ఈ దురాగతాన్ని రామ్మోహన్ రాయ్ తీసుకొనివెళ్ళి దానిని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.


అయితే భారతీయుల మత విశ్వాసాలలో జోక్యం చేసుకోవద్దని బ్రిటిష్ పాలకులు నిర్దేశించడంతో గవర్నర్ జనరల్స్ ఎవరూ సాహసించలేకపోయారు. 1828లో బెంగాల్ గవర్నర్‌గా పనిచేసే కాలములో రాజా రామ్మోహనరాయ్‌తో కలసి సతి దురాచారాన్ని ప్రత్యక్షంగా చూసిన విలియం బెంటిక్ ఈ అనాగరిక ఆచారాన్ని రద్దు చేయాలనే దృఢ నిశ్చయానికి వచ్చారు. ఆ ప్రకారమే 1829లో సతీ సహగమనాన్ని నిషేధించారు. భారతీయుల సంక్షేమానికి అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను రూపొం దించి, భారతీయుల ఆత్మబంధువుగా చరిత్రలో నిలిచిపోయారు. రాజపుత్రులలో అధికంగా ఉండే స్త్రీ, శిశు హత్యలను నిషేధించారు. ఉదారవాదిగా భారతీయుల సంక్షేమానికి పనిచేసిన సంక్షేమ పాలకునిగా ఖ్యాతినొందారు.

(సతీ సహగమన ఆచారాన్ని నిషేధించి నేటికి 190 సంవత్సరాలు)

డా. యస్. బాబూరావు, స్వతంత్ర జర్నలిస్ట్, కావలి, మొబైల్ : 72077 40944

# ఎందుకీ 'తెలుగు' వంచన?

సందర్భం



బులుసు ప్రభాకర శర్మ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రాథమిక స్థాయిలో ఇంగ్లిష్ మీడియంలో బోధన ప్రవేశపెట్టాలని తీసుకున్న సంచలన నిర్ణయం కొందరికి– అదీ మేధావి వర్గంలో నున్నవారికి నచ్చకపోవడం విడ్డూరమే. వారు కళ్ళుమూసుకుని వాస్తవాలను విస్మరించడం ఒకింత బాధాకరం కూడా. ఎక్కడైనా చూడండి! ఎంత పేదరికంలో మగ్గుతున్నవారైనా సరే, తమ పిల్లలు బాగుపడాలనే ఏకైక లక్ష్యంతో తల తాకట్టుపెట్టి మరీ వారిని ఇంగ్లిష్ మీడియం బడిలోనే వేస్తారు.

ఇది ఇప్పటికిప్పుడు వచ్చింది కాదు. దాదాపు నాలుగు దశాబ్దాలనుంచీ జరుగుతున్న కథ. ఇంగ్లిష్ చదువులు చదివిన వారు తతిమ్మావారికంటే బాగున్నారనే వాస్తవాన్ని గ్రహించిన ఓటరు జనాభా తీసుకున్న నిర్ణయం. ఇరవైయేళ్ళక్రితం మా అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ వాచ్‌మన్ సంజీవి తన ఇద్దరు కుమార్తెలను పక్కనే ఉన్న ప్రభుత్వ ఉచిత పాఠశాలలో కాక ఏదో పనికిరాని ఇంగ్లిష్ మీడియం స్కూల్లో చదివిస్తుంటే, ఎందుకలా చేస్తున్నావని అడిగాను. తన జీతం నెలకు రెండువేల రూపాయలు. పిల్లల బడి ఫీజు ఇద్దరికీ కలిపి ఆరువందలు, ఆ పైన యూనిఫారమ్, పుస్తకాలు వగైరా ఖర్చులు. ఇదేమి తెలివితేటలు సంజీవీ అని అడిగాను. ఛీ.. ఆ దుంపల బడిలో ఏమీ నేర్చుకోలేరండీ' అని అతడి సమాధానం. విశాఖపట్నంలో ప్రభుత్వ పాఠశాలలకు దుంపలబడి అని పేరుంది. బడి పక్కన ఉడికించిన చిలకడ దుంపలవంటివి అమ్ముతుండడం, వాటిని పిల్లలు ఇంటెర్వల్లో కాని, బడి వదిలాక కానీ కొనుక్కుని ఆరగించడం వల్లనేమో ఆ పేరొచ్చింది. ఈగలు ముసిరిన ఆ తినుబండారాలను తిన్న పిల్లలు తరచూ రోగాలబారిన కూడా పడుతుంటారు.

అడుగడుగునా ప్రైవేటు ఇంగ్లిష్ మీడియం స్కూళ్ళు అందుబాటులోకి రావడంతో ఈ సర్కారు బడులకు కూడా ఈగలు తోలుకునే పరిస్థితి దాపురించింది. దాన్ని సరిదిద్దడానికి ఇదివరలో ఏ ప్రభుత్వమూ ముందుకు రాలేకపోయింది. ఇన్నాళ్ళకు వైఎస్ జగన్ ధర్మమా అని పరిస్థితి మారుతోందంటే కొందరికి నచ్చడంలేదు. తమ పిల్లలతో పేదసాదల పిల్లాజల్లలూ అలగాజనం కూడా పోటీ పడతారా అనేదే వారి బాధేమో! మాతృభాషపై గౌరవం ఉండవచ్చు. అది తిండి పెట్టకపోతే వేరే మార్గం వెతుక్కోవడంలో తప్పేముంది. కులవృత్తులకు సాటిలేదు గువ్వల చెన్నా అన్నది వినడానికి బాగానే ఉంటుంది. కానీ కులవృత్తులను అంతా ఎందుకు వదలివెళ్ళవలసివచ్చిందో మేధావులకు తెలియదా?

అసలు సంగతికి వద్దాం. ఇంగ్లిష్ బాగా వచ్చినందువల్లనే మనవారు–అంటే భారతీయులు అమెరికా ఇతర విదేశాలలో ఉద్యోగాలు సంపాదించి రాణిస్తున్నారన్నది జగమెరిగిన సత్యం. హైస్కూల్ వరకూ తెలుగు మీడియంలో చదివి, ఇంటర్లో ఒక్కసారిగా ఇంగ్లిష్ మీడియంలో అంతా చదవాల్సి రావడం సగటు విద్యార్థికే కాదు, ప్రతిభావంతులకు కూడా ప్రతిబంధకమే. కొన్నిసార్లు ఇది ఆత్మహత్యలకు కూడా దారితీసేది. ఇంటర్ తర్వాత డిగ్రీ, పీజీ వరకూ కూడా తెలుగు మీడియంలో చదవాలంటే చాలామంది ఇష్టపడడంలేదు–ఉద్యోగాలు దొరకవనే ఒకే కారణంవల్ల. ప్రాథమిక స్థాయి నుంచే గట్టి పునాదులతో ఆంగ్ల మాధ్యమంలో విద్య కొనసాగించడంవల్ల ఉన్నత విద్య పూర్తయ్యేసరికి ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉంటున్నాయి. నేను హిందూ పేపర్లో పనిచేసినప్పుడు తెలుగు మీడియంవారికోసం ప్రత్యేకంగా ఇ-ప్లస్ క్లబ్బులంటూ ప్రతి కాలేజీలోనూ ప్రారంభించవలసివచ్చింది. ఇప్పుడు ఆ అదనపు భారం పిల్లలపై పడబోదు. తెలుగు మీడియంవారు కార్పొరేట్ కళాశాలలో చదువు కొనుక్కొనే బాధకూడా తప్పుతుంది. దర్జాగా గవర్నమెంట్ కాలేజీలలోనే ఉన్నతవిద్యను కొనసాగించవచ్చు.


ఈ ప్రభుత్వచర్య వల్ల కార్పొరేట్ కాలేజీలకు పెద్ద నష్టం వస్తుందనుకోను. వారికి వ్యాపారం ఎలా చేయాలో బాగా తెలుసు. వారంతా తప్పక తెలుగు మీడియంలో ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రారంభించి మరీ డబ్బుచేసుకోగలరు. వారిని అప్పుడు తెలుగుకోసం తపిస్తున్న ఈ ఇంగ్లిష్ చదువులు వెలగబెట్టినాక, తమ సంతానాన్ని కూడా ఇంగ్లిష్ మీడియంలోనే నడిపిస్తున్న మేధావి వర్గం ఆదరిస్తుందేమో చూడాలి. ఎందుకో ఈ ఆత్మవంచన!

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
మొబైల్ : 98495 95371

# మీది నిస్వార్థ భక్తి

ఓరోజు ఉదయం ఒక సాధువు ఓ సువిశాల మార్గంలో నడుచుకుంటూ పోతున్నారు. మార్గ మధ్యంలో ఎండ మండిపోతున్నా ఓచోట కొందరు వాడిన మొహాలతో దేవుడిని ప్రార్థిస్తున్నారు. వారిని చూసి సాధువు 'ఎందుకు మీరిలా ఉన్నారు' అని అడిగారు. ఆయన మాటకు వారందరూ ఒక్కటిగా సమాధానమిస్తూ 'నరకాగ్నినుంచి మమ్మల్ని కాపాడుకోవడానికి దేహాన్నిలా ఎండలో నిల్చుని ఆ భగవంతుడితో మొరపెట్టుకుంటున్నా'మని నీరసంగా చెప్పారు.

'నరకాగ్నికి బలై పోకూడదనే భయంతోనైనా మీరిలా దైవప్రార్థన చేస్తున్నారు. మిమ్మల్ని ఆ దేవుడు తప్పకుండా కాపాడుతాడు' అని ముందుకు వెళ్ళిపోయారు సాధువు. ఆయన అలా మరికొంత దూరం వెళ్ళేసరికి అక్కడ ఇంకొందరు గుమికూడి భగవంతుడికి నమస్కరించడాన్ని గమనించారు. 'మేము స్వర్గానికి వెళ్ళాలనే కోరికతో దేహాన్నిలా ఎండకప్పగించి ప్రార్థిస్తున్నాం' అన్నారు వారు.




వారి మాటలు విన్న సాధువు 'మీరు దిగులుపడకండి. దేవుడికి ప్రార్థిస్తేనే స్వర్గం లభిస్తుందనుకోనక్కరలేదు. అయినా దేవుడు మీ కోరికను నెరవేరుస్తాడు' అని ముందుకు వెళ్ళిపోయారు. సాధువు మరికొంత దూరం వెళ్ళేసరికి అక్కడ ఇంకొందరు కనిపించారు. తమపై మిన్ను విరిగి మీద పడ్డా పరవాలేదన్నట్లుగా ఉన్నారు. 'మీరెవరు.. మీలో ఎలాంటి భయాలూ ఆందోళనలూ కనిపించడం లేదు. కారణమేమిటీ' అని అడిగారు సాధువు.

వాళ్ళందరూ ముక్తకంఠంతో ఇలా చెప్పారు. అంతా ఆ దేవుడి ఇష్టం. దేవుడు ఏమనుకుంటే అది జరగకమానదు. మనకేం కావాలో దేవుడికన్నా మరెవరికి బాగా తెలుస్తుంది? కనుక మాకే దిగులూ లేదు. దేవుడు ఎటు తీసుకుపోతే అటే పోతాం. అతనేదిచ్చినా ఆనందంగా స్వీకరిస్తాం. మా హృదయంలో ఆ భగవంతుడు ఉంటూనే ఉంటాడెప్పటికీనూ' అని. వారి మాటలకు సాధువెంతగానో సంతోషించారు. 'ఏ స్వార్థం లేకుండా మీరు దేవుడికి ప్రార్థిస్తున్నారు. మీరు చాలా చాలా మంచి వారు. దేవుడెప్పుడూ మీ పక్కనే మీతోనే ఉంటాడు' అని సాధువు అక్కడి నుంచి వెళ్ళిపోయారు. – యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

epaper.sakshi.com



శభాష్ మిథు – సినిమా పేజీలో

వార్తల్లో వనితలు

## నేవీకి కళొచ్చింది

ఈరోజు నేవీ డే. భారత నౌకాదళ దినోత్సవం. ఈ సందర్భంగా సబ్ లెఫ్టినెంట్ శివాంగి గురించి చెప్పుకోవాలి. నిన్నంతా చెప్పుకున్నాం కదా.. శివాంగి శిక్షణ ముగించుకుని సోమవారం కొచ్చిలో పైలట్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారని, దాంతో భారత నౌకాదళంలో తొలి మహిళా పైలెట్‌గా గుర్తింపు పొందారని! అది నిజమే, ఇప్పుడేమిటంటే.. తాజా ఇంటర్వ్యూలో ఆమె ఒక ఆసక్తికరమైన సంగతిని వెల్లడించారు. తన పదవయేటే శివాంగి ఆకాశంలో ఎగరాలని అనుకున్నారట. అయితే ఆకాశంలో ఎగురుతున్న పక్షులను చూసో, కళ్లకు మాత్రమే అందుతూ గగన విహారం చేస్తుంటే విమానాలను చూసో కాదు! శివాంగి స్వస్థలం బిహార్ లోని ముజఫర్‌పూర్. ఆమె చిన్నతనంలో అక్కడికి తరచు రాజకీయ నాయకులు హెలికాప్టర్‌లో వచ్చి ఆ చుట్టుపక్కల బహిరంగ సభల కోసం కిందికి దిగేవారు. తండ్రితో పాటు ఆ సభలకు వెళ్లినప్పుడు పెద్దవాళ్లంతా నాయకుల ప్రసంగాలపై ధ్యాస పెడితే, శివాంగి మాత్రం నాయకులు ఎగిరొచ్చిన హెలికాప్టర్‌ను చూస్తూ కలలు కనేవారట. ఆమె ఆశల కలలకు ఆమె తండ్రి రెక్కలు తొడిగారు. ఆ విధంగా శివాంగి స్వప్నమూ సాకారమయింది, తొలిసారి ఒక మహిళ పైలట్‌గా చేరడంతో భారత నౌకాదళానికి గౌరవమూ చేకూరింది. ఏమైనా ఈసారి నేవీడే శివాంగి వల్ల స్పెషల్ అయింది!



సబ్ లెఫ్టినెంట్ శివాంగి

## వేధింపులు చిన్న మాటా!

కనిపించని నాలుగోసింహాన్ని వదిలేస్తే పోలీస్ పవర్‌కి ప్రతీకగా మూడు సింహాలు కనిపిస్తుంటాయి. అయితే సమాజానికి కాపు కాసే పవర్ పోలీసు వ్యవస్థ ఒక్కటేకాదు. ఇంకొకటి కూడా ఉంది. అదే.. 'చట్టం–న్యాయం' అనే వ్యవస్థ. ఇప్పుడీ రెండు వ్యవస్థలకీ కలిపి 'మాస్టర్ క్లాస్' ఒకటి ఇవ్వాలని నటి తనుశ్రీ దత్తా ఓ సూచన చేస్తున్నారు! దేని మీద అంటే.. వేధింపుల మీద. మహిళలు.. పురుషుల నుంచి ఎదుర్కొనే వేధింపుల మీద. ''బాధితురాలు కేసు పెడుతుంది. సాక్ష్యాధారాలు ఉంటాయి. అయినప్పటికీ వేధింపును ఈ రెండు వ్యవస్థలూ సీరియస్‌గా తీసుకోవు. 'అదేం హింస కాదు కదా, అదేం దౌర్జన్యం కాదు కదా, అదేం లైంగిక దాడి కాదు కదా' అంటాయి తప్ప, ఆ మూడింటితో సహ సంబంధం ఉన్న నేరంగా వేధింపును పరిగణించవు. దాంతో బాధితురాలికి న్యాయం జరగడం కష్టం అవుతుంది. అందుకే వేధింపును కూడా తీవ్రమైన నేరంగా పరిగణించాలి'' అని తనుశ్రీ అంటున్నారు. రెండు వ్యవస్థల్నీ ఒకచోట కూర్చోబెట్టి ఎవరి తరపునుంచి వారు కాకుండా, బాధితురాలి వైపునుంచి 'వేధింపు'ను సాక్ష్యాధారాలతో కలిపి చూసి దాని తీవ్రతను నిర్ణయించేలా సమన్వయం కల్పించాలని తనుశ్రీ కోరుతున్నారు.



తనుశ్రీ

## మగపిల్లల్నే హద్దుల్లో పెంచాలి

ఇంట్లో ఆడపిల్లలకు జాగ్రత్త చెబితే ఆ పిల్ల ఒక్కటే సురక్షితంగా ఉంటుంది. ఇంట్లో మగపిల్లవాడిని.. 'జాగ్రత్త' అని హెచ్చరిస్తే బయటి ఆడపిల్లలంతా సురక్షితంగా ఉంటారు. 'దిశ' ఘటన తర్వాత అమ్మాయిల భద్రత కోసం అనేక మంది అనేక విధాలైన సలహాలు ఇస్తున్నారు. అందులో ఇదీ ఒకటిలా అనిపించవచ్చు. అయితే మిగతా సలహాల కన్నా ఇది ఫలవంతమైనది. ఇప్పటికిప్పుడు కాకపోవచ్చు. ఒక జనరేషన్ మగపిల్లల్ని తల్లిదండ్రులు నియంత్రణలో పెంచితే.. ఇప్పుడు చాలా మంది అంటున్నట్లు, ఆశిస్తున్నట్లు.. సమాజంలో మార్పు వస్తుంది. సమాజంలో మార్పు రావడం అంటే ఇంట్లో అబ్బాయిల్ని సంస్కారవంతంగా పెంచడం. ఈ సూచన ఇచ్చినవారు పుదుచ్చేరి గవర్నర్ కిరణ్ బేడీ. ''తల్లిదండ్రులకు ఆడపిల్లల్ని మాత్రమే హద్దుల్లో పెంచడం తెలుసు. ఆ హద్దుల్నే మగపిల్లలకు ఏర్పరిస్తే, వాళ్ల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటే మహిళలపై నేరాలు వాటంతటవే తగ్గిపోతాయి'' అని బేడీ అన్నారు. ఆవిడే ఇంకో సలహా కూడా ఇచ్చారు. పరీక్షల కోసం చదువులు కాకుండా.. విలువల కోసం విద్య అనే విధానం రావాలి అన్నారు. మరి దోషుల్ని శిక్షించడంపై బేడీ ఏమన్నారు? 'శిక్ష తీవ్రంగా ఉండాలి. తప్పు చేసినవాళ్లకే కాదు, తప్పు చేయాలన్న ఆలోచన రాబోయిన వారు కూడా ఆ శిక్ష గుర్తొచ్చి హడలెత్తిపోవాలి అన్నారు కిరణ్ బేడీ. 'దిశ' దారుణ ఘటనపై స్పందించమని అడిగినప్పుడు ఆమె ఇలా అన్నారు.



కిరణ్‌బేడీ



**మొదటి అడుగు**
దైవం మనిద్దరినీ ఒకటి చేయుగాక.

**రెండవ అడుగు**
మనిద్దరికీ శక్తి లభించుగాక.

**మూడవ అడుగు**
వివాహ వ్రత సిద్ధి కలుగుగాక.

**నాలుగు అడుగు**
మనకు ఆనందం కలుగుగాక

**ఐదవ అడుగు**
దైవం మనకు పశుసంపదను కలిగించుగాక

**ఆరవ అడుగు**
రుతువులు మనకు సుఖమిచ్చుగాక

**ఏడవ అడుగు**
దైవం మనకు గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణను అనుగ్రహించుగాక.

# ఎనిమిదో అడుగు

వివాహ వేడుకలో వేసే ఏడు అడుగుల అర్థం ఇది. ఈ ఏడు అడుగులతో పాటు మరో అడుగు కూడా వేసింది బబితా పోగట్. తోటి రెజ్లింగ్ క్రీడాకారుడు వివేక్‌సుహాగ్‌తో బబిత వివాహం మొన్న ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకలో సంప్రదాయంగా వేసే ఏడు అడుగులతో పాటు ఆడపిల్లల అభ్యున్నతి కోరుతూ అదనంగా మరో అడుగు వేశారీ దంపతులు. 'ఆడపిల్లలను కాపాడుదాం, ఆడపిల్లలను చదువుకోనిద్దాం, ఆడపిల్లలను ఆడుకోనిద్దాం' అని ఎనిమిదో అడుగు వేశారు ఈ యువదంపతులు. భారతప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'బేటీ బచావో, బేటీ పఢావో' ప్రచారానికి కొనసాగింపుగా 'ఆడపిల్లలను క్రీడాకారులుగా తీర్దిద్దుదాం' అని కొత్త ఆలోచనకు ఇలా నాంది పలికారు వీళ్లు.

**దేశమెరిగిన సిస్టర్స్**

బబిత పోగట్ పరిచయం అవసరం లేని క్రీడాకారిణి. మల్లయుద్ధ క్రీడాకారిణులు పోగట్ సిస్టర్స్‌లో రెండవ అమ్మాయి బబిత. పదేళ్ల కిందట కామన్‌వెల్త్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకంతో మొదలు పెట్టి ఈ పదేళ్లలో కామన్‌వెల్త్ గేమ్స్, ఏషియన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్, వరల్డ్ చాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించింది. బబిత అక్క గీత కూడా ఇదే స్థాయిలో విజయాలనందుకుంది. ఈ మల్లయోధురాళ్ల జీవితం ఆధారంగా గత ఏడాది హిందీలో 'దంగల్' సినిమా వచ్చింది. అప్పటి వరకు క్రీడాభిమానులకు మాత్రమే తెలిసిన రెజ్లింగ్ సిస్టర్స్ ఒక్కసారిగా దేశం దృష్టిని ఆకర్షించారు.

**మరో ముందడుగు**

బబిత తండ్రి మహావీర్‌సింగ్ పోగట్ ద్రోణాచార్య అవార్డు గ్రహీత. అతడు తన కూతుళ్లు నలుగురినీ మల్లయోధులుగా తీర్చిదిద్దడం ద్వారా హరియాణా సమాజంలో ఆడపిల్లల అభ్యుదయానికి దార్శనికుడయ్యాడు. తల్లి గర్భంలో పిండంగా ఉండగానే చిదిమేసే దుష్ట సంప్రదాయం వేళ్లూనుకుని పోయిన హరియాణా రాష్ట్రంలో పోగట్ సిస్టర్స్ సంప్రదాయ పరిధులను చెరిపేసి విజయశిఖరాల వైపు అడుగులు వేశారు. ఇప్పుడు హరియాణాలో వారి సొంతూరు బలాలి గ్రామంలో జరిగిన వివాహ వేడుక సందర్భంగా బబిత దంపతులు.. సామాజిక చైతన్యం కోసం వివాహవేడుకలో ఇప్పటి వరకు ఉన్న సంప్రదాయాన్ని సవరించి కొత్త సంప్రదాయం వైపు అడుగులు వేశారు.

తొలి ఏడు అడుగులు తమకు సంపూర్ణమైన జీవితం సిద్ధించాలని కోరుకున్న ఈ కొత్త దంపతులు ఎనిమిదో అడుగుని సమాజహితం కోసం వేశారు. తాను ఈ ఏడాది జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో దాద్రి నియోజకవర్గం నుంచి బరిలో దిగడం కూడా విధాన నిర్ణయాల్లో భాగం పంచుకునే అధికారం ఆడవాళ్లకు కూడా ఉందని తెలియచేయడానికేనని ఆమె ఎన్నికల సందర్భంగా చెప్పారు.

– మంజీర



వివేక్ సుహాగ్, బబిత పోగట్

### ఇది సమష్టి నిర్ణయం

మేము ప్రాక్టీస్ కోసం గోధుమ చేలలో పరుగులు తీసేటప్పుడు అందరూ మమ్మల్ని వింతగా చూసేవాళ్లు. వాళ్ల దృష్టిలో స్త్రీ ఎలా ఉండాలంటే... దేహాకృతి స్పష్టంగా తెలియనంత వదులుగా దుస్తులు ధరించాలి. అలాంటి భావజాలం రాజ్యమేలుతున్న రోజుల్లో మేము నిక్కర్, టీ షర్ట్ వేసుకుని జుట్టు పొట్టిగా కత్తిరించుకుని పరుగులు తీయడం మా ఊరి వాళ్లకు ఓ పెద్ద విచిత్రం. ఇన్నేళ్ల మా ప్రయాణంలో మేము ఎక్కడ తప్పటడుగు వేస్తామా అని ఎదురు చూసిన వాళ్లే ఎక్కువ. అలాంటి సమాజంలో ఆడపిల్ల తన జీవితాన్ని తాను జీవించే పరిస్థితులు నెలకొనాల్సిన అవసరం చాలా ఉంది. అడ్డంకులను దాటుకుని ముందడుగు వేసిన మాలాంటి వాళ్లందరం రాబోయే తరాలకు కొత్త దారిని నిర్మించాలి. ఇందులో భాగంగానే గత ఏడాది మా కజిన్ వినేశ్ కూడా తన పెళ్లిలో ఎనిమిది అడుగులు వేసింది. ఇది మేమంతా సమష్టిగా తీసుకున్న నిర్ణయం.



– బబిత పోగట్, రెజ్లింగ్ క్రీడాకారిణి

అవునా!

## బ్యూటీరియా

**మేకప్ చేసుకుంటున్నారు బాగానే ఉంది. వాటి ఎక్స్‌పైరీ డేట్లు చూస్తున్నారా? పోనీ.. వాడిన బ్రష్‌లను, స్పాంజ్‌లను ఎన్నడైనా శుభ్రం చేశారా? లేదంటున్నారా! అయితే మీరు చిక్కుల్లో పడినట్లే. ఎందుకంటే.. ఇలాటి వాటిల్లో హానికారక బ్యాక్టీరియాలు బోలెడు ఉండిపోతాయి అంటోంది ఓ తాజా అధ్యయనం!**

మేకప్‌కు ఉపయోగించే వాటిల్లో కనీసం 90 శాతం వాటిల్లో స్టాఫైలోకాకస్ ఔరియస్, ఈ–కోలీ, సిట్రో బ్యాక్టర్ ఫ్రెండీ వంటి హానికారక బ్యాక్టీరియా ఉంటుందని యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఆస్టన్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు అధ్యయన పూర్వకంగా తెలుసుకున్నారు. ఇవన్నీ ఒకసారి వాడిన మేకప్ సామగ్రిలో మాత్రమే ఉండేవే అయినప్పటికీ, అలా ఉన్నట్లు తెలియక పోవడం వల్ల సమస్యలు వచ్చే అవకాశముందని ఈ అధ్యయనాన్ని నిర్వహించిన శాస్త్రవేత్త అమ్రీన్ బషీర్ తెలిపారు. అధ్యయనం కోసం తాము లిప్‌స్టిక్, లిప్‌గ్లాస్, ఐ లైనర్, మస్కారాలను ఎంచుకున్నామని, వీటిల్లో నీటి మోతాదు ఎంత ఎక్కువ ఉంటే బ్యాక్టీరియా సంతతి అంత ఎక్కువగా ఉన్నట్లు తెలిసిదని చెప్పారు. ఫౌండేషన్, కాంటూరింగ్‌ల కోసం వాడే బ్లెండర్ స్పాంజిల్లో పరిస్థితి మరీ దారుణమని అన్నారు. మొత్తమ్మీద తాము 467 ఉత్పత్తులను పరిశీలించామని వీటిల్లో 96 లిప్‌స్టిక్‌లు కాగా, 92 ఐ లైనర్లు, 93 మస్కారా ప్యాకెట్లతోపాటు 107 లిప్‌గ్లాస్‌లు, 79 బ్లెండర్ స్పాంజిలు ఉన్నాయని వివరించారు. మేకప్ ఉత్పత్తుల్లో సూక్ష్మజీవులు అస్సలు ఉండరాదని నిబంధనలు చెబుతున్నాయని గుర్తు చేశారు. ఒక ప్రశ్నపత్రం ద్వారా తాము మేకప్ సామాగ్రిలో బ్యాక్టీరియా ఎలా చేరుతోందో తెలుసుకునే ప్రయత్నం చేశామని, అందుకు వాడకందారులదే ఎక్కువ బాధ్యతని తేలిందని అన్నారు. ప్రతి మేకప్ సామగ్రికీ ఒక ఎక్స్‌పైరీ డేట్ ఉంటుందని, వినియోగదారులు పట్టించుకోకపోవడం వల్ల ఆ సమయం తరువాత బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుందని అమ్రీన్ వివరించారు. మీరు ఉండే ప్రాంతాన్ని బట్టి ఈ విషయాన్ని తయారీదారులు తెలియజేసే పద్ధతి ఉంటుంది. అమెరికాలోనైతే ప్యాకేజింగ్‌పైనే ఈ సమాచారం ప్రింట్ చేస్తారు. 2013లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం చాలామంది ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిన తరువాత కూడా మేకప్ సామగ్రిని చెత్తబుట్టలోకి పడేయడం లేదని వెల్లడైంది. బ్లెండర్ స్పాంజిల విషయంలో తేలిందేమిటంటే.. 93 శాతం మంది వీటిని ఎప్పుడూ శుభ్రం చేసుకోరూ అని! నేలపై పడిన తరువాత కూడా వాటిని అలాగే వాడేస్తామని 65 శాతం మంది ఒప్పుకున్నారు. వీలైనంత వరకూ ఈ బ్లెండర్ స్పాంజిలను గోరువెచ్చటి నీటిలో, సబ్బులతో శుభ్రం చేసుకోవడం మేలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పరిశోధన వివరాలు అప్లయిడ్ మైక్రోబయాలజీ తాజాసంచికలో ప్రచురితమయ్యాయి.




శుభ్రంగా లేని బ్లెండర్ స్పాంజీలో బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది

చెట్టు నీడ

## యుక్తిపరుని భక్తిమార్గం

ఇస్సాకు, రిబ్కా దంపతులకు దేవుడు ఇద్దరు కుమారుల్ని కవలలుగా ఇచ్చాడు. వాళ్లే ఏశావు, యాకోబు. వాళ్లిద్దరూ భిన్న ధ్రువాలు. ఏశావు చంచల స్వభావి, యాకోబు తాననుకున్నది ఎలాగైనా సాధించాలనుకునే యుక్తిపరుడు. వాళ్లిద్దరి పెనుగులాట, ఘర్షణ తల్లి గర్భంలోనే ఆరంభమయ్యింది. ఏశావు తల్లిగర్భంలో నుండి ముందుగా రాబోతుంటే, అతని కాళ్లు వెనక్కి లాగి తానే ముందుగా బయటికొచ్చి జేష్టుడయ్యేందుకు యాకోబు ప్రయత్నించి విఫలుడయ్యాడు. అనంతర పరిణామాలలో యాకోబు అన్నకు తాను వండిన రుచికరమైన భోజనాన్ని ఎరగా వేసి మొత్తానికి జ్యేష్ఠత్వాన్ని లాగేసుకున్నాడు. రిబ్కాకు పెద్దవాడు చిన్నవానికి దాసుడవుతాడని దేవుడు ముందే తెలిపాడు కాబట్టే తండ్రి నుండి జ్యేష్టుని దీవెనలు పొందడంలో రిబ్కా యాకోబుకు సాయం చేసింది. భర్త ఇస్సాకు సాత్వికుడు. చంచలుడైన ఏశావు, స్వార్థపరుడైన యాకోబు.. వీళ్ల మధ్య కుటుంబంలో సమన్వయాన్ని కాపాడటంలో తల్లిగా, భార్యగా రిబ్కా తీరు ప్రశంసనీయం. ఏశావు అంటే ప్రేమ ఉన్నా దేవుడిచ్చిన ప్రవచనం నెరవేరాలన్న ఆలోచనతోనే రిబ్కా యాకోబుకు సహకరించింది. చివరికి యాకోబు మేనమామ వద్దకు పారిపోయి, అక్కడ కొలువుకు కుదిరి, అక్కడా తన తెలివితేటలతో బోలెడు ఆస్తి సంపాదించి, వాళ్ల ఆగ్రహానికి భయపడి తండ్రి వద్దకు వెనక్కి వస్తూ దేవునితో ఒంటరిగా పెనుగులాడి, పశ్చాత్తాపం చెంది, విశ్వాసి అయిన ఇశ్రాయేలుగా మారి, ఆశీర్వదించబడ్డాడు. అన్నతో ఉన్న జీవితకాలపు వైరాన్ని కూడా దేవుడు అక్కడే తీర్చి ఇద్దరి మధ్యా సయోధ్య చేకూర్చాడు. ఆ యాకోబే దేవుడు తన కొరకు ప్రత్యేకించుకున్న ఇశ్రాయేలీయులకు మూలపురుషుడయ్యాడు.

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్



గ్రీన్ సోల్జర్

# ప్రకృతికి ఫ్రెండ్

**కాలేజీకి సెలవులు వస్తే యువత విహారయాత్రలకు, బంధువుల ఇళ్లకు వెళ్తుండటం సహజమే. కానీ జ్ఞానేశ్వర్ మాత్రం తన బెస్ట్ ఫ్రెండ్ అయిన ప్రకృతి దగ్గరికి వెళ్లి పలకరిస్తుంటాడు! చిన్నారులతో కలిసి మొక్కలు నాటుతుంటాడు. ప్రకృతి సంరక్షణపై గ్రామస్తులకు సంగీత వాయిద్యాలతో పాటలు పాడి వినూత్నంగా అవగాహన కల్పిస్తుంటాడు.**

జ్ఞానేశ్వర్‌ది సంగారెడ్డి జిల్లా నాగల్ గిద్ద మండలం ముక్తాపూర్ గ్రామం. ప్రకృతిని పరిరక్షిస్తానని ప్రతిన బూని పాదరక్షలు లేకుండా ఎనిమిదేళ్లుగా పాదయాత్రలు చేస్తున్నారు! జ్ఞానేశ్వర్ ఎంఎస్సీ జువాలజీ పూర్తి చేశారు. ప్రస్తుతం సిద్దిపేటలో బీఈడీ చదువుతున్నారు. స్వగ్రామం మంజీరా నది పరివాహకంలో ఉండటంతో రోజూ నది అందాలు ప్రకృతి చూస్తూ పెరిగారాయన. 2017లో నది చుట్టుపక్కల ఉన్న చెట్లను నరకడంతో మంజీరా నది మొత్తం ఎండిపోయిన దృశ్యమూ చూశారు. నదిలోని మొసళ్లు గ్రామాల్లోకి వచ్చేవి. పక్షులు మృతి చెందేవి. దీంతో చలించిపోయి మొక్కలు నాటడం మొదలుపెట్టారు. పర్యావరణ హిత కార్యక్రమాలను చేపట్టారు. అందుకు బాలల్ని తన సైన్యంగా మలుచుకున్నాడు. చిన్నారులతో కలిసి వేసవి కాలంలో సీడ్ బాల్స్ (విత్తన బంతులు) తయారు చేసి మంజీరా నది పరివాహక ప్రాంతాల్లో వాటిని విసిరారు. వర్షాలు కురిస్తే అందులోని విత్తనాలు మొలకెత్తేవి. మొదట్లో చిన్నారులను తీసుకొని వెళ్తే వారి తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పేవారు. తర్వాత్తర్వాత వాళ్లూ ముందుకు వచ్చారు. మొక్కలు నాటేందుకు చిన్నారులతో కలిసి వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లేవారు జ్ఞానేశ్వర్. దీంతో గ్రామస్తుల్లోనూ చైతన్యం వచ్చింది. చెట్లను పూజించడం, తామూ మొక్కలు నాటడం ప్రారంభించారు. ఒక్కో దఫా మంజీరా తీరంలో వెయ్యి మొక్కలు నాటాలనే లక్ష్యంతో వెళ్తారు. అక్కడికే విద్యార్థులు భోజనం తెచ్చుకొని సాయంత్రం వరకు మొక్కలు నాటుతారు. జ్ఞానేశ్వర్ గత ఏడాది ఉమ్మడి మెదక్ జిల్లా, హైదరాబాద్, బీదర్‌లలో సైకిల్ యాత్ర నిర్వహించారు. నిరుడు దసరా సెలవుల్లో మంజీరా నది రక్షించాలని కోరుతూ నారాయణఖేడ్‌లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా నదుల ఆవశ్యకతను తెలియజేస్తూ వాటిని ఎందుకు పరిరక్షించుకోవాలో వివరించారు. అలాగే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టంపై హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో ఒకరోజు దీక్ష చేపట్టారు. ఈ ఏడాది దసరా సెలవుల్లోనూ సిద్దిపేట జిల్లా నుంచి నారాయణఖేడ్ వరకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై పాదయాత్ర చేపట్టారు.

– రవి ముదిరాజ్ తాటికొండ,
సాక్షి, మెదక్ డెస్క్






epaper.sakshi.com



● జి. శ్రీరామ్ రాజు, నిర్మల్ కుమార్, హరీశ్ రావు, ఉదయ్‌శంకర్, వెంకటేష్, 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి, ఐశ్వర్యా రాజేష్, భూపతిరాజా

# వ్యక్తిత్వం ప్రతిబింబించేలా సినిమాలుండాలి

**- మంత్రి హరీశ్‌రావు**


''ఇప్పుడు సినిమాల్లో కొత్త భావనలు చోటు చేసుకుంటున్నాయి. కొత్త కొత్త ఆలోచనలతో, కొత్త కథలతో, నూతన దర్శకులు, నటీనటులు అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారు. 'మిస్ మ్యాచ్' కూడా అదే కోవలో కనపడుతోంది'' అని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఉదయ్ శంకర్, ఐశ్వర్యా రాజేష్ జంటగా ఎన్.వి. నిర్మల్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిస్ మ్యాచ్'. జి. శ్రీరామ్ రాజు, భరత్ రామ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో హరీశ్ రావు మాట్లాడుతూ– ''స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ప్రేమకథా చిత్రమిది. ఓ ప్రేమికురాలి విజయం కోసం ప్రేమికుడు పడే తపనను చూపిస్తుంది. సినిమాల్లో మంచి సందేశం ఉండి గౌరవం పెరగాలి. వ్యక్తిత్వం ప్రతిబింబించేలా, మహిళల గౌరవం పెరిగేలా సినిమాలుండాలి. 'మిస్ మ్యాచ్' సినిమా సమాజంతో మ్యాచ్ అయి మంచి విజయం సాధించాలి'' అన్నారు. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ – ''ఉదయ్‌శంకర్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఐశ్వర్యా రాజేష్ అమ్మగారు నాతో పాటు 50–60 సినిమాలకు కలిసి పనిచేశారు. 'కౌసల్య కృష్ణమూర్తి' సినిమాతో ఐశ్వర్య తెలుగులో సిక్సర్ కొట్టింది. ఈ సినిమాలో తను ఆడే ఆటతో బాక్సాఫీస్ బద్దలవుతుంది'' అన్నారు. హీరో వెంకటేష్ మాట్లాడుతూ– ''అమ్మాయిలు ఉన్నత స్థాయికి ఎదిగే స్క్రిప్ట్స్‌ను నేను బాగా ఇష్టపడతాను. ఆ తరహాలో ఉండే 'రాజా, సూర్యవంశం' వంటి సినిమాల్లో నేను కూడా నటించాను. 'మిస్ మ్యాచ్' తప్పకుండా పెద్ద సక్సెస్ కావాలి'' అన్నారు. ''నేను గురువుగా భావించే శ్రీరామ్‌సార్‌గారి తనయుడి చిత్రోత్సవానికి రావడం సంతోషంగా భావిస్తున్నా'' అన్నారు 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి. ''సగటు సినిమా ప్రేక్షకులను మా చిత్రం ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అన్నారు ఉదయ్ శంకర్. ''ఈ చిత్రం ప్రేక్షకుల్ని తప్పక అలరిస్తుంది'' అన్నారు ఐశ్వర్యా రాజేష్. ''తెలివైన అబ్బాయి.. పల్లెటూరి అమ్మాయికి మధ్య జరిగే కథే ఈ సినిమా'' అన్నారు నిర్మల్ కుమార్. ''మంచి కథతో రూపొందించిన చిత్రమిది'' అన్నారు జి. శ్రీరామ్ రాజు, భరత్ రామ్. ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి (ఓఎస్‌డీ) దేశపతి శ్రీనివాస్, తెలంగాణ ఎఫ్.డి.సి. చైర్మన్ రామ్మోహనరావు, నిర్మాత కె.ఎల్. దామోదర ప్రసాద్, రచయిత భూపతి రాజా, మ్యూజిక్ డైరెక్టర్ గిఫ్టన్ తదితరులు పాల్గొన్నారు.



● నాగచైతన్య

## లవ్‌స్టోరీకి డేట్ లాక్

**నా**గచైతన్యకు టీచర్‌గా మారారు శేఖర్ కమ్ముల. ఏం పాఠాలు నేర్పించారంటే తెలంగాణ యాస మాట్లాడేందుకు శిక్షణ ఇచ్చారు. ఎందుకంటే శేఖర్ కమ్ముల దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న 'లవ్‌స్టోరీ' సినిమాలో నాగచైతన్య పాత్ర తెలంగాణ యాస మాట్లాడుతుంది. ఇందులో సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్నారు. నారాయణ్‌దాస్ కె. నారంగ్, పి. రామ్మోహనరావు నిర్మిస్తున్న ఈ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయింది. మలి షెడ్యూల్ మంగళవారం హైదరాబాద్‌లో మొదలైంది. ఈ 'లవ్‌స్టోరీ' విడుదలకు డేట్ లాక్ చేశారని సమాచారం. ఏప్రిల్ 2న సినిమాని విడుదల చేయాలనుకుంటున్నారట. ఉన్నత స్థాయికి ఎదగాలనే పట్టుదలతో ఓ మారుమూల గ్రామం నుంచి హైదరాబాద్ వచ్చే యువకుడిగా నాగచైతన్య, కలను నిజం చేసుకోవాలనుకునే తపనతో తన ఊరి నుంచి హైదరాబాద్ చేరుకునే యువతిగా సాయిపల్లవి నటిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఎలా ప్రేమ చిగురించింది? ఆ తర్వాత ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది.



● 'టక్ జగదీష్' పోస్టర్

## టక్ జగదీష్

**అ**తని పేరు జగదీష్, కానీ అందరూ 'టక్ జగదీష్' అని పిలుస్తారు. మరి ఆ పేరు వెనక స్టోరీ ఏంటి? అంటే జగదీషే చెప్పాలి. 'నిన్ను కోరి' సినిమా తర్వాత దర్శకుడు శివ నిర్వాణ, హీరో నాని మరో సినిమా కోసం కలిశారు. ఈ సినిమాకు 'టక్ జగదీష్' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ చిత్రం టైటిల్‌ను మంగళవారం ప్రకటించారు. హరీష్ పెద్ది, సాహూ గారపాటి నిర్మించనున్న ఈ చిత్రంలో రీతూ వర్మ, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కానుంది. ''నా తొలి హీరోతో మళ్లీ కలిసి పని చేయడం చాలా సంతోషంగా ఉంది'' అన్నారు శివ నిర్వాణ. నానీతో తెరకెక్కించిన 'నిన్ను కోరి' దర్శకుడిగా శివ నిర్వాణకు తొలి సినిమా అనే సంగతి తెలిసిందే. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రూపొందనున్న తాజా చిత్రానికి సంగీతం: యస్.యస్. తమన్, కెమెరా: ప్రసాద్ మూరెళ్ల.

## తిట్టేవారు కూడా కావాలి

**''పొగడ్తలు ఉన్న చోటే విమర్శలు కూడా ఉంటాయి. విమర్శలను విశ్లేషించుకుంటూ ప్రతిరోజూ కొత్త విషయాలను నేర్చుకుంటూ కెరీర్లో ముందుకు సాగిపోవాలనుకుంటున్నాను'' అన్నారు సంగీత దర్శకుడు తమన్. వెంకటేష్, నాగచైతన్య హీరోలుగా కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెంకీమామ'. ఇందులో పాయల్ రాజ్‌పుత్, రాశీఖన్నా కథానాయికలుగా నటించారు. డి. సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు తమన్ చెప్పిన విశేషాలు.**



● 'వెంకీమామ' ఒక ఎమోషనల్ ఫిల్మ్. ఈ సినిమా రఫ్ వెర్షన్ చూసి నేను కంటతడి పెట్టుకున్నాను. ఇందులోని ఎమోషన్ ఆడియన్స్‌కు బాగా కనెక్ట్ అవుతుందని అనుకుంటున్నాను. మామా? అల్లుడా? అన్నట్లు వెంకటేష్, నాగచైతన్య ఇద్దరూ పోటీపడి నటించారు. ఫస్టాఫ్ ఎంటర్‌టైనింగ్‌గా, సెకండాఫ్ ఎమోషనల్‌గా ఉంటుంది. వెంకటేష్‌గారి డ్యాన్స్ సినిమాలో హైలైట్. డైరెక్టర్ బాబీ బాగా తెరకెక్కించాడు.

● 'సరైనోడు' సినిమా తర్వాత బ్రేక్ తీసుకుని బాగా రిలాక్స్ అయ్యాను. ఆ తర్వాత చేసిన 'మహానుభావుడు, భాగమతి, తొలిప్రేమ, ఛల్ మోహన్‌రంగ, అరవిందసమేత వీరరాఘవ' సినిమాల పాటలకు మంచి పేరు వచ్చింది. నా పాటలకు మంచి స్పందన లభిస్తోందంటే అందుకు కారణం కథలు బాగుండటమే.

● సోషల్ మీడియా కామెంట్స్‌ను పట్టించుకుంటాను. ప్రతి ట్వీట్ ఓ ప్రెస్‌మీటే (నవ్వుతూ). ఓ నెటిజన్ వ్యతిరేకంగా ఓ ట్వీట్ పోస్ట్ చేశాడు? అంటే అతనెక్కడో బాధపడి ఉంటాడు. అది గమనించి నెక్ట్స్ టైమ్ అలా చేయకుండా ఉండాలనుకుంటాను. అలా తిట్టేవారు కూడా కావాలి. ఎందుకంటే అమ్మ తిట్టకపోతే ఎలా బాగుపడతాం.

● ప్రస్తుతానికి రీమిక్స్ సాంగ్‌కు కాస్త దూరంగా ఉందామనుకుంటున్నాను. ఇప్పుడు సినిమాలోని ఆరు పాటలను ఒకేసారి కాకుండా విడివిడిగా విడుదల చేయడం మంచి పరిణామమే అని నా అభిప్రాయం. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు ఉంటున్నాయి. సావన్, రాగ.. ఇలా డిఫరెంట్ ప్లాట్‌ఫామ్స్ ఉన్నాయి. అందువలన ఆడియన్స్‌కు మరింత చేరువ అయ్యే చాన్స్ ఉంటుంది.

● 'వెంకీమామ' ఫ్యామిలీ డ్రామా, 'అల.. వైకుంఠపురములో..' ఫన్ అండ్ యాక్షన్ ఫిల్మ్, 'డిస్కో రాజా' డిఫరెంట్ జానర్, 'ప్రతిరోజూ పండగే' ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.. ఇలా భిన్న రకాల సినిమాలకు సంగీతం సమకూర్చడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను.

## శభాష్ మిథు

**వెం**డితెరపై కొత్త ఆట ఆడటానికి రెడీ అయిపోయారు కథానాయిక తాప్సీ. 'శభాష్ మిథు'లో క్రికెటర్‌గా కనిపించబోతున్నారామె. ప్రముఖ మహిళా క్రికెటర్ మిథాలీ రాజ్ బయోపిక్ ఇది. ఈ చిత్రానికి రాహుల్ ధోలాకియా దర్శకుడు. 'కహానీ' (2012), 'క్వీన్' (2014), 'మేరీకోమ్' (2014), 'పద్మావత్' (2018) వంటి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ తీసిన వయాకామ్ 18 సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. మంగళవారం మిథాలీ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను ప్రకటించడం విశేషం. ''కలలను సాకారం చేసుకోవాలనుకునే యువతులకు నా సినిమా ఓ స్ఫూర్తిగా నిలుస్తుందన్న నమ్మకం ఉంది'' అని పేర్కొన్నారు మిథాలీరాజ్. ''మిథాలీ.. నీ పుట్టినరోజుకి ఏం బహుమతి ఇవ్వాలో అర్థం కావడం లేదు. వెండితెరపై నాలో నువ్వు ప్రతిబింబించేలా ప్రయత్నిస్తానని ప్రామిస్ చేస్తున్నాను. కవర్ డ్రైవ్ నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాను'' అన్నారు తాప్సీ. ఈ సంగతి ఇలా ఉంచితే... 'సూర్మ' (2017)లో హాకీ ప్లేయర్‌గా, సాండ్ కీ ఆంఖ్ (2019) సినిమాలో షూటర్‌గా నటించిన తాప్సీ తాజాగా 'రష్మీ: ద రాకెట్'లో అథ్లెట్ (రన్నింగ్)గా నటిస్తున్నారు. ఇప్పుడు 'శభాష్ మిథు' సినిమా కోసం ఆమె క్రికెటర్‌గా మారారు. ఇవన్నీ గమనిస్తుంటే బాలీవుడ్‌లో స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ మూవీ అంటే తాప్సీనే చేయాలని దర్శక–నిర్మాతలు భావిస్తున్నట్లు అనిపిస్తోంది కదూ.




● తాప్సీ, మిథాలీ రాజ్



● తాప్సీ

## ఆర్టిస్టుగా ఉంటే ఆ కిక్కే వేరు



● శ్రీనివాస్ రెడ్డి

''**న**టుడిగా సక్సెస్ సాధించిన తర్వాత కంటెంట్ ఉన్న చిన్న సినిమాలను నిర్మించాలనుకుని 'భాగ్యనగర వీధుల్లో గమ్మత్తు' సినిమాను నిర్మించాను. ఈ సినిమా కోసం తీసుకున్న నటీనటులందరి బలాలు నాకు తెలుసు. అందుకే వేరే దర్శకుడు ఎందుకు? అని నేనే డైరెక్ట్ చేశాను'' అన్నారు నటుడు వై. శ్రీనివాస్‌రెడ్డి. ఫ్లయింగ్ కలర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్స్ పతాకంపై వై. శ్రీనివాస్‌రెడ్డి స్వీయదర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'భాగ్యనగర వీధుల్లో గమ్మత్తు'. శ్రీనివాస్‌రెడ్డి, సత్య, 'షకలక' శంకర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ– ''ఒక రోజులో జరిగే కథ ఇది. భాగ్యనగరంలో మాదకద్రవ్యాలను సరఫరా చేసేవారిని ఓ పోలీసాఫీసర్ పట్టుకోవాలని ప్రయత్నిస్తుంటాడు. ఇందులో ఓ షార్ట్‌ఫిల్మ్ గ్యాంగ్ ఎలా ఇరుక్కుంది? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. వినోదం మాత్రమే కాదు.. పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలనే చిన్న సందేశం కూడా ఉంది. ఈ సినిమాతో మా మేనల్లుడుని ఆర్టిస్టుగా పరిచయం చేస్తున్నాను. సెంటిమెంట్ కోసం ఈ సినిమా తొలి షాట్‌ను మా నాన్నగారిపై డైరెక్షన్ చేశాను. ల్యాప్‌టాప్‌లో సినిమా చూసుకున్నారాయన. ఇటీవలే నాన్నగారు చనిపోయారు. 'దిల్' రాజుగారి బ్యానర్‌పై ఈ సినిమాను ఓన్ రిలీజ్ చేస్తున్నా. దర్శకత్వం, నిర్మాణం, హీరో, నటుడు.. ఈ నాలుగింట్లో నటుడిగా ఉండటమే నాకు ఇష్టం. ఆర్టిస్టుగా ఉంటే ఆ కిక్కే వేరు'' అన్నారు.



● నిఖిల్

## గౌరవంగా ఉంది

'**అ**ర్జున్ సురవరం'తో మంచి హిట్ అందుకున్నారు నిఖిల్. ఇప్పుడు మరో కొత్త సినిమాను ప్రకటించారు. అల్లు అరవింద్ సమర్పణలో సుకుమార్, 'బన్నీ' వాసు నిర్మాతలుగా ఈ సినిమా తెరకెక్కనుంది. 'కుమారి 21ఎఫ్' ఫేమ్ సూర్య ప్రతాప్ పల్నాటి ఈ చిత్రానికి దర్శకుడు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్–ప్లే సుకుమార్ అందిస్తున్నారు. ''గీతా ఆర్ట్స్ సంస్థలో సినిమా చేయడం గౌరవంగా ఫీల్ అవుతున్నాను. సుకుమార్, 'బన్నీ' వాసు, సూర్య ప్రతాప్‌లతో పని చేయడం ఎగ్జయిటింగ్‌గా ఉంది'' అని పేర్కొన్నారు నిఖిల్. త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది.

## క్రైమ్ థ్రిల్లర్



● ప్రగ్యా

**సా**గర్ గంధం, ప్రగ్యా నయన్ జంటగా బషీర్ ఆలూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సమరం'. శ్రీనివాస్ వీరంశెట్టి, జీవీఎస్ నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. ఈ నెలలో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: ప్రగ్యా నయన్, కెమెరా: నాగబాబు కర్ర, సంగీతం: రాజ్ కిరణ్.

## ప్రేమ.. స్నేహం



● శైలజ

**ప**వన్, శైలజ జంటగా జి. మురళి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మేరా దోస్త్'. పి. వీరారెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. జి.మురళి మాట్లాడుతూ– ''ప్రేమ, స్నేహంతో పాటు కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారనుకుంటున్నా'' అన్నారు. ''సినిమా పట్ల మా టీమ్ ఎంతో నమ్మకంతో ఉంది. కథ, చిన్నాగారి సంగీతం మా సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. దాదాపు 150 థియేటర్స్‌లో సినిమాని విడుదల చేస్తున్నాం'' అన్నారు పి.వీరారెడ్డి. ''నటనకి ప్రాధాన్యత ఉన్న పాత్ర చేశాను. ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న మా సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది'' అన్నారు శైలజ.

## చూసీ చూడంగానే నచ్చుతుంది

**ని**ర్మాత రాజ్ కందుకూరి తనయుడు శివ కందుకూరి హీరోగా నటించిన చిత్రం 'చూసీ చూడంగానే'. శేష సింధురావు దర్శకత్వం వహించారు. వర్ష బొల్లమ్మ హీరోయిన్‌గా నటించారు. 'పెళ్ళి చూపులు, మెంటల్ మదిలో' వంటి చిత్రాలను నిర్మించిన రాజ్ కందుకూరి నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని నిర్మాత డి. సురేష్ బాబు, డైరెక్టర్ తరుణ్ భాస్కర్ విడుదల చేశారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ – ''రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది. మా గత చిత్రాల్లాగానే ఈ సినిమా కూడా సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై విడుదల కానుంది. గోపీసుందర్ మంచి సంగీతం అందించారు. 'మెంటల్ మదిలో' ఫేమ్ వేదరామన్ చక్కని విజువల్స్ అందించారు. ఈ నెల చివరి వారంలో సినిమా విడుదల చేస్తున్నాం'' అన్నారు.



● రాజ్ కందుకూరి, తరుణ్ భాస్కర్, డి.సురేష్, శివ కందుకూరి



PARAS



సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 4-12-2019

వజ్రపు సంకల్పం



● గవర్నర్ చేతులు మీదగా ప్రారంభించబడిన పాఠశాల భవన సముదాయం


● పాఠశాల భవనాల నిర్మాణాలను పర్యవేక్షిస్తూ..


● వజ్రపు వెంకటేష్‌ను సత్కరిస్తున్న గవర్నర్, విద్యాశాఖామంత్రి, జిల్లా కలెక్టర్

# బడికి ప్రేమతో..!

**ఆ గదుల్లో నేర్చుకున్న పాఠాలు వృథాపోలేదు**
**ఆ బడి పంచిన జ్ఞాపకాలు చెదిరిపోలేదు**
**ఆ బడి నేర్పిన సంస్కారం మరుగునపడలేదు**
**తన ఎదుగుదలకు పునాది వేసిన తల్లిలాంటి బడిని మరచిపోలేదు.**
**తాను చదువుకున్న బడి శిథిలావస్థకు చేరుకున్న దృశ్యం ఆ పూర్వ విద్యార్థి మనస్సును కలచివేసింది. తన కొడుకు వివాహానికి పెట్టాలనుకున్న పెళ్లి ఖర్చు కోటి రూపాయలతో చదువులమ్మ చెంతకు చేరాడు వజ్రపు వెంకటేష్.**

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన వజ్రపు వెంకటేష్ తన తండ్రి 'వజ్రపు నర్సింహమూర్తి పౌండేషన్' (వీఎన్‌ఎం పౌండేషన్) ద్వారా కొంతకాలంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒకరోజు తాను చదువుకున్న పాఠశాలలోని పేద విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు, నోటు పుస్తకాలు అందించేందుకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఆయన అక్కడ బడి దుస్థితిని చూసి చలించిపోయారు. చక్కని వాతావరణంలో చదవాల్సిన విద్యార్థులు చెట్లనీడల్లో, గాలికి పడుతున్న సిమెంట్ రేకుముక్కల మధ్య బిక్కుబిక్కుమంటూ చదువుతున్నారు. అక్కడ విద్యార్థులను పలకరించగా 'ఎండాకాలంలో నేరుగా సూర్యుడు తమ నెత్తిపైనే తాండవిస్తుంటాడని, వర్షాకాలంలో తామంతా గుంపుగా ఓ చోటుకు చేరి తలదాచుకోవలసిన పరిస్థితుల్లో చదువుతున్నామంటూ' విలపించారు. అప్పుడే వజ్రపు వెంకటేష్ ఓ గట్టి నిర్ణయం తీసుకున్నారు.

### జత కలిసిన కుటుంబం

తన భార్య అనూష, తల్లి శంకరలక్ష్మీ, కుమారులు జాన్ వికాస్, ఆశీష్‌తో తన మనోగతాన్ని పంచుకున్నాడు. కుటుంబ సభ్యులూ వెంకటేశ్ మనోగతాన్ని అర్థం చేసుకొని ఓ నిర్ణయానికి వచ్చారు. కుమారుడు జాన్ వికాస్ వివాహానికి పెట్టే ఖర్చు కోటి రూపాయలతో కోట్లమందికి ఉపయోగపడే చదువుల గు(బ)డికి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ ఆశను, ఆకాంక్షను వినతిపత్రం రూపంలో తెలియజేశారు. కలెక్టర్ నుంచి వెంటనే అనుమతి లభించింది.

### కోటి అభినందనలు

శిథిలావస్థకు చేరుకున్న బడిని పడగొట్టించారు వజ్రపు వెంకటేష్. గత ఏడాది ఆగస్టు 31న అప్పటి జిల్లా కలెక్టర్ ధనుంజయరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి సాయిరామ్ చేతుల మీదుగా కోటి రూపాయలతో పది గదుల భవనానికి శంకుస్థాపన జరిగింది. తాను చదువుకున్న బడి రుణం తీర్చుకుంటున్నందుకు ధన్యుడనంటూ చెప్పిన వెంకటేష్ మాటలు విన్న జిల్లా కలెక్టర్ ఉప్పొంగి పోయారు. సొంత లాభాలకు పాకులాడే ఈ రోజుల్లో ఆడంబరంగా జరుపుకునే కన్న కొడుకు పెళ్లికి అయ్యే ఖర్చును బడికి వెచ్చించిన వెంకటేష్‌ను సాక్షాత్ దేవుడిగా అభివర్ణించారు.

### మరో అరకోటి

వజ్రపు వెంకటేష్ ఆధ్వర్యంలో తన సంస్థ ద్వారానే భవన పనులు శరవేగంగా జరిగాయి. ధరలు పెరిగినా వెనుకంజ వేయకుండా మరో అడుగు ముందుకేసి అరకోటి అదనపు ఖర్చుతో ఈ ఏడాది నవంబరు 28న రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరిచందన్, రాష్ట్ర విద్యాశాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా అంగరంగ వైభవంగా పాఠశాల భవన సముదాయాన్ని ప్రారంభించారు. శిథిలావస్థలో ఉన్న బడిని ఆకాశమంత ఎత్తులో నిలబెట్టి అందరి మదిలో సమున్నతంగా నిలుచున్నారు వజ్రపు వెంకటేష్.

– మద్దిలి కేశవరావు,
సాక్షి, ఇచ్ఛాపురం రూరల్

సీరియల్

**చిన్నప్పుడు సరదాగా ఆడిన ఆటైనా, ఇష్టంతో నేర్చుకున్న ఏదైనా.. ప్రతీది జీవితంలో ఉపయోగపడటం అనేది ఒక అదృష్టం. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం మాత్రం మన ప్రయత్నమే. ఆ రెండింటినీ సిన్సియర్‌గా అందిపుచ్చుకున్న సీరియల్ నటుడు నందకిశోర్. 'జీ తెలుగు'లో వచ్చే 'రామసక్కని సీత' సీరియల్‌లో రామరాజుగా బుల్లితెర ప్రేక్షకులను అలరిస్తున్న నందకిశోర్ చెబుతున్న ముచ్చట్లివి.**

# అదృష్టాన్ని నిలబెట్టుకోవడమే విజయం



'మా అమ్మానాన్నలు శారద, వెంకటరమణ. నాన్న రైల్వేలో జాబ్ చేసేవారు. ముగ్గురు అన్నదమ్ములలో నేను చివరి వాడిని. మా నాన్నగారే నా మొదటి గురువు. చిన్నప్పుడు ఆయనే నా ముఖానికి మేకప్ వేశారు. భూమికా థియేటర్ గ్రూప్‌ను నిర్వహించే గరికపాటి ఉదయభాను గారి దగ్గర పదవతరగతి నుంచి నాటకరంగంలో పాల్గొనేవాడిని. కెరియర్ దీర్ఘకాలం కొనసాగాలంటే నాటక రంగం బాగా ఉపయోగపడుతుంది. అదృష్టవశాత్తు అలా నా మూలాలు నాటక రంగంలో పడ్డాయి.

### అన్నదమ్ముల అనుబంధం

ఇంట్లో చిన్నవాడిని అయినా మా అన్నయ్యల సపోర్ట్ నాకు బాగా ఉండేది. అన్నదమ్ములం అయినా మంచి స్నేహితులుగా ఉంటాం. ఒకమ్మాయిని ప్రేమించాను అని చెప్పినప్పుడు ఇంట్లో చిన్నవాడినైనా మా అన్నయ్యలిద్దరూ నాకు ముందు పెళ్లి జరిపించారు. ఇప్పటికీ నాకు వారు అండగా ఉంటారు. నా సతీమణి పేరు లక్ష్మి. ప్రేమించి పెళ్లి చేసుకోవడం ఒక అదృష్టం అయితే ఈ ఫీల్డ్‌లో ఉన్న నన్ను అర్థం చేసుకోవడం నిజంగా అదృష్టం. మాకు ముగ్గురు కూతుళ్లు.

### ఆల్‌రౌండర్‌గా!

చిన్నప్పటి నుంచి ఆటలు, పాటలు, చదువు.. అన్నింటిలోనూ చురుకుగా ఉండేవాడిని. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. ఆటల్లో క్రికెట్ అంటే చాలా ఇష్టం. ఇక్కడ క్రికెట్ లీగ్ జరిగినప్పుడు సినిమా వాళ్లతో కలిసి పాల్గొన్నాను. టీవీ కేటగిరీ నుంచి నా క్రికెట్ స్కిల్స్ చూసి వాళ్ల టీమ్‌లో పాల్గొనే అవకాశం ఇచ్చారు. చిన్నప్పుడు ఏదైతే ఇష్టంతో నేర్చుకున్నానో అవన్నీ నా జీవితంలో ఉపయోగపడుతూ వచ్చాయి. సింగర్, డ్యాన్సర్, యాక్టర్, ప్లేయర్‌గా.. ఇలా అన్నింటా ఉన్నాను. డ్యాన్సర్‌గా జల్సా, నర్తనశాల, రగడ.. వంటి టీవీ డ్యాన్స్ షోలో పాల్గొన్నాను. స్టేజ్ షోలోనూ ప్రదర్శనలు ఇచ్చాను. అయితే, అప్పటి కష్టానికి ఇప్పటిలా మార్కెట్ లేదు. ఇప్పుడు ప్రతీది అప్‌డేటెడ్‌గా ఉండాలి.




### విలన్ నుంచి హీరోగా!

2005 సంవత్సరం నుంచి నా కెరియర్ మొదలైంది అని చెప్పవచ్చు. అంతకుముందు నాలుగైదేళ్లు ఈ రంగంలో నిలదొక్కుకోవడానికి సమస్యలు ఎదుర్కొన్నాను. ఆ టైమ్‌లో ఈ రంగంలో పోటీ ఎక్కువ ఉంది. ఇప్పటితో పోల్చుకుంటే అప్పుడు అవకాశాలు తక్కువ. పదిహేనేళ్ల క్రితం దూరదర్శన్‌లో వచ్చిన 'వెలుగు నీడలు' సీరియల్‌లో విలన్‌గా చేశాను. అక్కణ్ణుంచి చిన్న చిన్న క్యారెక్టర్లు చేస్తూ చెన్నై ఇండస్ట్రీకి వెళ్లాను. అక్కడ అంకురం సీరియల్‌లో సైడ్ క్యారెక్టర్ చేశాను. ఆ తర్వాత ర్యాడాన్ ప్రొడక్షన్‌లో అవకాశం వచ్చింది. ఆ తర్వాత రెండేళ్లకు ఇక్కడ 'స్రవంతి' సీరియల్‌లో అవకాశం వచ్చింది. ఐదేళ్ల పాటు వచ్చిన ఆ సీరియల్ వల్ల నాకు మంచి పేరు, గుర్తింపు వచ్చాయి. ఈ సీరియల్ తర్వాత వరుసగా అవకాశాలు వచ్చాయి. స్రవంతి నుంచి శుభలేక, మంచుపల్లకి, శ్రీమతి కళ్యాణం, రామా సీత, రామసక్కని సీత.. ఇలా వరుస సీరియల్స్ చేసుకుంటూ వస్తున్నాను. టీవీలో సీరియల్స్‌తో పాటు సినిమాల్లోనూ చిన్న చిన్న రోల్స్ చేశాను. సీరియల్స్‌తో పాటు సినిమాల్లోనూ రాణించాలనే ప్రయత్నంలో ఉన్నాను. ఇప్పుడొక సినిమా కూడా చేస్తున్నాను. సీరియల్ వల్ల నటనలోనూ, ప్రొడక్షన్‌లోనూ మంచి ఎక్స్‌పీరియెన్స్ వచ్చింది.

### రామసక్కని సీత

రియల్ లైఫ్‌లో మా ముగ్గురు అన్నదమ్ముల్లో చిన్నవాడిని. 'రామసక్కని సీత' సీరియల్‌లో నలుగురు అన్నదమ్ముల్లో పెద్దవాడిని. ఇది పూర్తిగా కుటుంబ నేపథ్యం ఉన్న కథనం. నాది రామరాజు పాత్ర. అన్నదమ్ముల సఖ్యత, భార్యా–భర్తల అనురాగం, సమాజంలో మంచి పేరున్న వ్యక్తి.. ఇలా ఏ దశలో ఎలా ఉండాలో బంధాల ద్వారా చూపుతుంది ఈ సీరియల్. అనుకోని పరిస్థితుల్లో సీత రామరాజు భార్యగా ఆ ఇంట అడుగుపెడుతుంది. అమ్మలా చూసే సీత ప్రవర్తనతో తమ్ముళ్లు మారుతారు. మంచి ప్రేక్షకాదరణతో ఆకట్టుకుంటున్న ఈ సీరియల్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

### నటనే జీవితం


నటన మొదలుపెట్టినప్పటి నుంచి ఇదే నా జీవితమైంది. దీంట్లోనే కొనసాగుతాను. నటుడిగా కొనసాగాలంటే ఆరోగ్యం, ఫిట్‌నెస్, ముఖకాంతి.. ఇవన్నీ తప్పనిసరి. అందుకే ఎన్ని పనులున్నా రోజూ ఉదయం 5:30గంటలకు లేస్తాను. జిమ్‌లో వర్కవుట్స్ చేస్తాను. షూటింగ్ లేకపోతే సినిమాలు చూడ్డం, స్టోరీ డిస్కషన్స్, కాన్సెప్ట్ డెవలప్ చేయడం వంటి వాటిల్లో పాల్గొంటుంటాను. మిగతా టైమ్ నా కుటుంబంతో గడుపుతాను. పూర్తి శాకాహారిని. వంట వచ్చు కాబట్టి అప్పుడప్పుడు ఇంట్లో కొత్త వంటకాలను ట్రై చేస్తుంటాను. వాటి టేస్ట్‌ను ఇంట్లో వారికి దగ్గరుండి మరీ వడ్డిస్తాను.'

– నిర్మలారెడ్డి

ఇంటిప్స్

### భలే బంగాళదుంప

● బంగాళదుంపల పై పొట్టు తేలికగా రావాలంటే వాటిని 5 నిమిషాలు మరుగుతున్న నీళ్లలో ఉడికించాలి. తర్వాత ఆ నీళ్లు వడకట్టి బంగాళదుంపలను చల్లని నీళ్లలో వేయాలి. ● బంగాళదుంపలను ఉడికించేటప్పుడు నీళ్లలో పైన కొద్దిగా ఉప్పు చల్లాలి. దీని వల్ల బంగాళదుంపలకు అన్ని వైపులా సమంగా ఉప్పు చేరుతుంది. ● చాలా మంది బంగాళదుంప–ఉల్లిపాయలను కలిపి నిల్వ ఉంచుతుంటారు. ఉల్లిపాయలు విడుదల చేసే తేమ వల్ల బంగాళదుంపలు త్వరగా పాడవుతాయి. అందుకని వేటికవి విడిగా భద్ర పరుచుకోవాలి.
● బంగాళదుంపలను ఉడికించిన నీటిని ఉపయోగిస్తూ కిటికీ అద్దాలను తుడిస్తే చక్కగా శుభ్రపడతాయి.



గుర్తుచేద్దాం

# ఆటాడుకుందామా!

పిల్లలచేత ఆటలు ఆడిస్తూ..



మీ ఇంట్లో ఏదైనా మంచి కార్యక్రమం జరుగుతోందా...
అయితే ఆటలు ఆడించే ఎడ్ల సతీశ్ కుమార్‌ను పిలవండి మరింత సందడి మీ ముందుంటుంది.
గోళీలు, కర్రబిళ్ల, గాలిపటాలు, దాండియా కర్రలతో మీ ఇంటి ముందు ప్రత్యక్షమవుతారు..
మీ ఇంటికి వచ్చిన అతిథులను ఆటపాటలతో ముంచెత్తి, పండుగ వాతావరణం తీసుకువస్తారు.
రంగస్థల నటుడు, సంప్రదాయ ఆటలలో నిష్ణాతుడు, జానపద గిరిజన నృత్యాల నిపుణుడు అయిన సతీశ్‌కుమార్ దేశవిదేశాలలో భారతదేశ సంప్రదాయాన్ని ప్రదర్శిస్తున్నారు. మరుగున పడిపోతున్న ఆటలను, వస్తువులను నేటి తరానికి పరిచయం చేస్తున్నారు. సంప్రదాయ ఆటలతోపాటు, జానపద నృత్యాలు, దాండియా ఆటలతో ఇంటిని ఆనంద సాగరంలో ముంచుతున్నారు. భారతీయ సంప్రదాయాన్ని దేశవిదేశాలలో ప్రచారం చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన సతీశ్ కుమార్‌ను 'సాక్షి' పలకరించింది. ఆ వివరాలు...

### నానమ్మ ప్రభావం...

'చిన్నప్పుడు నానమ్మ చాలా కథలు చెప్పేది. రాముల వారి గుడి దగ్గర రామ్‌లీల, ఒగ్గు కథలు, నాటకాలు అన్నిటికీ నానమ్మ తనతో తీసుకు వెళ్లేది. అవి చూస్తుండటం వల్ల కళల పట్ల మక్కువ పెరిగింది. 1995 ప్రాంతంలో ఉర్దు, తెలుగు నాటకాలు వేయడం ప్రారంభించాను. సాగర సంగమం సినిమా చూసిన తరవాత నాట్యం నేర్చుకోవాలనుకున్నాను. కూచిపూడి నాట్యకారిణి ఉమారామారావుగారి శిష్యుడైన అనిల్ కుమార్ గారి దగ్గర కూచిపూడి నేర్చుకున్నాను. ఆ తరవాత లంబాడా, కోయ, గోండు వంటి జానపద, గిరిజన నృత్యాలు నేర్చుకుని, వాటిని ఒక పద్ధతిలో రూపొందించి వారి చేతే నాట్యం చేయించడం ప్రారంభించాను. దేశమంతా తిరిగి, అన్ని రాష్ట్రాల జానపదాలు తెలుసుకున్నాను. శివగంగ నాట్యం సుమారు వంద ప్రదర్శనలిచ్చాను. హాంగ్‌కాంగ్‌లో 1980లో పది రోజుల పాటు జరిగిన ఉత్సవాలలో మన దేశం నుంచి నేను ప్రతినిధిగా హాజరయ్యాను.

### ఇదే నా మార్గం...

నేను ఈ కళలలో ఉండటం నాన్నగారికి ఇష్టం లేదు. ఏదో ఒక ఉద్యోగం చేసుకోమనేవారు. నానమ్మ మాత్రం నన్ను ప్రోత్సహించేది. నాన్నకు కోపం రాకుండా ఉండటం కోసం ఉదయం నాలుగు గంటలకే టాంక్‌బండ్‌కి వెళ్లి, అక్కడ సాధన చేసి, ఆరు గంటలకల్లా డాన్స్ క్లాసుకి వెళ్లేవాడిని. అలా పట్టుదలతో నాట్యం నేర్చుకున్నాను. అప్పట్లోనే నాటకాలు కూడా వేయడం మొదలుపెట్టాను. 1996లో హాంగ్‌కాంగ్, 1997లో అమెరికా వెళ్లాను. అక్కడ కార్యక్రమాలకు వివిధ దేశాల ప్రతినిధులు వచ్చారు. వారంతా నన్ను ప్రోత్సహించి, ఆటా సభలకు పంపారు. అక్కడి వారికి మన సంప్రదాయ నృత్యాలు నేర్పించి, ఆటా ప్రారంభోత్సవ వేడుకలో చేయించాను. అలా అక్కడ సభలలో కొత్త ఒరవడి మొదలుపెట్టాను. అక్కడ 'తెలుగు దేశం మనది' ప్రదర్శన చూసి, కార్యక్రమానికి హాజరైన పన్నెండు వేల మంది ప్రేక్షకులు నిలబడి చప్పట్లు కొట్టారు. ఒక కళాకారుడికి ఇంతకంటె ఏం కావాలి. అప్పుడు అనుకున్నాను, 'ఇదే నా మార్గం' అని. అక్కడ రెండేళ్లు ఉండి భారతదేశానికి వచ్చేశాను.

### స్వదేశంలో కొత్తగా...

మన దేశంలో కొత్తగా ఏదైనా క్రియేట్ చేయమని తెలంగాణ కల్చరల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణగారు కోరారు. 'ఈ తరం వారు మరచిపోతున్న మన ఆటలు నేర్పిస్తాను' అన్నాను. ఆయన 'సరే' అన్నారు. 2017లో మన ఊరి ఆటలు (ఎథ్‌నిక్ గేమ్స్) పేరున మరుగున పడిపోతున్న 'కర్ర – బిళ్ల, గోళీలు, బొంగరాలు, కర్ర సాము, వామన గుంటలు, గచ్చకాయలు, చింత గింజలు' వంటి ఆటలు ఆడించడం మొదలుపెట్టాను. అలాగే పిల్లలకి రాజస్థానీ తలపాగాలు కట్టి, వారితో దాండియా ఆడిస్తాను. వాతావరణాన్ని ఏభై ఏళ్ల క్రితం ఉన్న సంప్రదాయాల్లోకి తీసుకెళ్తాను. మన సంప్రదాయం తెలిసిన నానమ్మలను, అమ్మమ్మలను పిలిచి, వారితో తిరగలిలో బియ్యం పోసి విసిరిస్తాను. రోట్లో వడ్లు వేసి దంపిస్తాను. మనవలకి, పిల్లలకి వాళ్లు నేర్పేలా చేస్తారు. సంప్రదాయాన్ని నిత్యనూతనంగా ఉంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేస్తున్నాను.

### మన సంప్రదాయాలను ఆంగ్లంలో...

విదేశాలలో ప్రదర్శనలిస్తున్నప్పుడు... బతుకమ్మ, గొబ్బెమ్మ, లంబాడీ, భాంగ్రా వీటికి సంబంధించిన పాటలను ఆంగ్లంలోకి అనువదించి, పాడుతూ చెబుతాను. గుంటూరు జేకేసీ కళాశాలలో సిల్వర్ జూబిలీ, గోల్డెన్ జూబిలీ కార్యక్రమాల సందర్భంగా ఆడించాను. సంక్రాంతి సంబరాలు జరిపించాను. 'అహం భారతీయం' లో హరికథలు, బుర్రకథలు, ఒగ్గు కథలు అన్నీ కలిపి 1998లో ప్రదర్శించాం. నా కష్టానికి తగ్గ ఫలితం వస్తుందని అనను కాని, ఆనందంగా ఉంటుంది. మమ్మల్ని ఇంకా ప్రోత్సహించాలని కోరుకుంటున్నాను. అలాగే మాలాంటి వాళ్లకు శాశ్వత ఉపాధి కలిపిస్తే మరింత బాగా చేయగలుగుతాం.

కిల్లింగ్ వీరప్పన్‌లో, ఆత్మసమర్పణ్ (హిందీ సినిమా)లో, కొన్ని హిందీ సీరియల్స్‌లోను నటించాను. వచ్చిన ఏ అవకాశాన్నీ విడిచిపెట్టకుండా సద్వినియోగం చేసుకుంటున్నాను. 'ఒకసారి బిర్యానీ దొరికితే, ఒకసారి టీ కూడా దొరక్కపోవచ్చు. నేను కళాకారుడినని తెలిసి, అమెరికాలో ఒకసారి చార్టర్ విమానాన్ని గంటసేపు నా కోసం ఆపారు. ఒకసారి ఒక పెద్ద కార్యక్రమానికి మూడు లారీల సామాను తెచ్చాను. ఎడ్ల బండి, గంగిరెద్దు, భోగి మంటలు అన్నీ ఉన్నాయందులో. పెద్దలతో ఆటలు, అమ్మలక్కలాటలు సైతం ఆడించాను.

– ఎడ్ల సతీశ్ కుమార్



ప్రదర్శనలో భాగంగా..!



– సంభాషణ: వైజయంతి పురాణపండ
– ఫొటోలు: నోముల రాజేష్ రెడ్డి

కాస్మటాలజీ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

## కోల్డ్ క్రీమ్ రాస్తున్నప్పటికీ...

**నా వయసు 19 ఏళ్లు. నాది పొడి చర్మం (డ్రై స్కిన్). ఇది చలికాలం కాబట్టి ముఖానికి కోల్డ్ క్రీమ్ రాస్తున్నాను. ఇలా రాసినప్పుడు మాత్రం చర్మం బాగానే ఉంటుంది. కానీ ముఖం కడుక్కున్న వెంటనే అది బాగా డ్రైగా మారిపోతోంది. కోల్డ్ క్రీమ్ రాస్తున్నప్పటి నుంచి చర్మం కాంతి కోల్పోయి, ముఖం నిగారింపు తగ్గినట్లుగా కనిపిస్తోంది. నా సమస్యకు తగిన పరిష్కారం చెప్పండి.**

**– సంహిత, కరీంనగర్**



పొడి చర్మం ఉన్నవారు చలికాలంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. వీరిలో రక్షణ కవచంలా ఉండాల్సిన స్కిన్ బ్యారియర్ డిస్టర్బ్ అయ్యి సమస్యలకు దారితీస్తుంది. ఇక ముఖ్యంగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే... కోల్డ్ క్రీమ్స్ అనేవి అందరికీ సరిపడవు. ముఖానికి, శరీరానికి కూడా వేరువేరుగా క్రీమ్స్ ఫార్ములాలు అందుబాటులో ఉంటాయి. పొడి చర్మం ఉన్నవారు సిండెట్ బేస్ సబ్బు వాడితే మంచిది. డాక్టర్ల సూచించిన మాయిశ్చరైజర్స్ వాడటం మంచి ఫలితాలను ఇస్తుంది. ఇవి స్కిన్ బ్యారియర్‌ను రిపేరు చేస్తాయి కాబట్టి మీకు సరిపడే మాయిశ్చరైజన్‌ను డాక్టర్ సలహా మీద వాడండి.

## మళ్లీ మొటిమలు వస్తున్నాయి...



**నా వయసు 34 ఏళ్లు. ఇటీవల తరచూ మొటిమలు వస్తున్నాయి. ముఖం కూడా డల్‌గా మారింది. అప్పట్లో నేను టీన్స్‌లో ఉన్నప్పుడు నాకు మొటిమలు విపరీతంగా వచ్చాయి. కానీ ఇప్పుడు మళ్లీ మొటిమలు వస్తుండటం చాలా ఎంబరాసింగ్‌గా ఉంది. నా సమస్యకు పరిష్కారాన్ని సూచించండి.**

**– ఆర్. సుహాసిని, నిజామాబాద్**

మొటిమలు మళ్లీ మళ్లీ రావడానికి కొన్ని కారణాలుంటాయి. ఉదాహరణకు మహిళల్లో హార్మోన్‌ల ప్రభావం, ప్రీ–మెన్‌స్ట్రువల్ సింగ్రోమ్ వంటి కారణాల వల్ల మొటిమలు వస్తుంటాయి. అంతేగాక... మన ఆహారపు అలవాట్లు కూడా ఈ సమస్యకు ఒక ప్రధాన కారణం కావచ్చు. అంటే మనం తీసుకునే ఆహారంలో నూనెలు, కొవ్వుల పాళ్లు ఎక్కువగా ఉండటం కూడా మొటిమలకు వచ్చేందుకు దోహదపడుతుంది. మీ విషయంలో మీకు ఏ కారణంగా మొటిమలు వచ్చాయన్న అంశంతో పాటు మరికొన్ని వ్యక్తిగత అంశాలను పరిగణనలోకి తీసుకొని, దానికి అనుగుణంగా చికిత్స సూచించాల్సి/చేయాల్సి ఉంటుంది. కాబట్టి మీరు ఒకసారి మీకు దగ్గర్లో ఉన్న కాస్మటాలజిస్ట్‌ను సంప్రదించండి.

## చుండ్రు తీవ్రత ఎక్కువైంది...

**నా వయసు 24 ఏళ్లు. నాది సాధారణ చర్మం. నేను గత ఆర్నెల్ల నుంచి చుండ్రు (డాండ్రఫ్)తో బాధపడుతున్నాను. ఈమధ్య ఈ సమస్య తీవ్రత మరింత పెరిగింది. బాగా దురదగా కూడా ఉంటోంది. జుట్టు రాలిపోవడం (హెయిర్‌ఫాల్) కూడా ఎక్కువైంది. ఎన్ని యాంటీ డాండ్రఫ్ షాంపూలు మార్చినా ఫలితం లేదు. దయచేసి నా సమస్యకు తగిన పరిష్కారం సూచించండి.**

**– సంజయ్, నల్లగొండ**

చుండ్రు (డాండ్రఫ్) అనేక కారణాల వల్ల వస్తుంటుంది. చలికాలంలో దీని తీవ్రత పెరిగి మరింత ఇబ్బంది పెడుతుంది. షాంపూలు వాడినంత మాత్రాన మీ సమస్య తొలగిపోదు.



దీనికి ప్రత్యేకించి యాంటీడాండ్రఫ్ లోషన్స్‌తో పాటు మెడికేటెడ్ షాంపూలు వాడాల్సి ఉంటుంది. అలాగే జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉంటాయి. మీ జుట్టు రాలడం సమస్యకు తగిన కారణాలు కూడా తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు కొన్ని ఆరోగ్య పరీక్షలు కూడా చేయించాల్సి రావచ్చు. మీరు ఒకసారి డాక్టర్‌ను సంప్రదిస్తే మంచిది.



**డాక్టర్ సుభాషిణి జయం,** చీఫ్ మెడికల్ కాస్మటాలజిస్ట్,
ఎన్‌ఛాంట్ మెడికల్ కాస్మటాలజీ క్లినిక్, శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్

# సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు


స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

బుధవారం
4-12-2019


ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) రంగంలో కొలువుల సంక్షోభం తలెత్తనుందా..
సాఫ్ట్‌వేర్ కొలువుల్లో మళ్లీ కోతలు మొదలు కానున్నాయా...
మిడ్, సీనియర్ లెవల్ ఉద్యోగులపై కత్తి వేలాడుతోందా..?!
అంటే.. అవుననే సమాధానం వినిపిస్తోంది!!

**కారణం... కాగ్నిజంట్, ఇన్ఫోసిస్ వంటి ఐటీ దిగ్గజ సంస్థలు.. మిడ్, సీనియర్ స్థాయిలో భారీగా ఉద్యోగులను తొలగించాలని భావిస్తున్నట్లు చెప్పడమే! వీటితోపాటు మరికొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు సైతం కొలువుల్లో కోతల దిశగా అడుగులు వేస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసలు ఐటీ రంగంలో ఉద్యోగుల తొలగింపునకు కారణం ఏంటి? మిడ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ తమ ఉద్యోగాలు కాపాడుకోవడానికి ఏం చేయాలి.. కొత్త నియామకాల కోసం ఎదురు చూస్తున్న ఫ్రెషర్స్ పరిస్థితి ఏంటి?! తదితర అంశాలపై విశ్లేషణాత్మక కథనం...**



## జాబ్ ట్రెండ్స్

# ఐటీ కొలువు.. భద్రత నిల్!

- 'కాగ్నిజెంట్ ఇండియాలో.. మిడ్, సీనియర్ స్థాయిలో ఏడు వేల ఉద్యోగుల తొలగింపునకు రంగం సిద్ధం'.
- 'పది వేల మంది సీనియర్ ఉద్యోగులను తొలగించాలని ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ నిర్ణయం'.

» సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో మిడ్, సీనియర్ ఉద్యోగులపై వేలాడుతున్న కత్తి
» ఉద్యోగుల తొలగింపుపై స్పష్టమైన సంకేతాలిస్తున్న ఐటీ సంస్థలు
» రీ-స్కిల్లింగ్, జాబ్ రెడీ స్కిల్స్ లేకపోవడమే కారణం

ఇలాంటి వార్తలు గత కొద్ది రోజులుగా ఐటీ రంగ ఉద్యోగులతోపాటు సాఫ్ట్‌వేర్ కొలువుల కోసం కలలు కంటున్న ఆయా కోర్సుల విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఐటీలో పదేళ్ల క్రితం ఎదురైన సంక్షోభ పరిస్థితులు పునరావృతం కానున్నాయా?! అనే భయం ఐటీ రంగ ఉద్యోగులను వెంటాడుతోంది. నిపుణులు, ప్రముఖ స్టాఫింగ్ సంస్థల అభిప్రాయాల ప్రకారం-ఐఓటీ, ఆటోమేషన్, ఆర్థిక మందగమన పరిస్థితుల నేపథ్యంలో.. కంపెనీలు లక్షల్లో వేతనం పొందుతున్న సీనియర్ల సంఖ్య తగ్గించుకోవాలని చూస్తున్నాయి. అయితే ఫ్రెషర్స్ విషయంలో పరిస్థితులు ఆశాజనకంగానే ఉన్నాయని చెబుతున్నారు.

### ఎందుకీ పరిస్థితి?

వాస్తవానికి ఐటీ రంగంలో వృద్ధి బాగానే ఉన్నా.. ఉద్యోగుల తొలగింపు పరిస్థితులు తలెత్తడానికి కారణం ఏమిటి? అనే ప్రశ్న ఎదురవుతోంది. దీనికి రకరకాల కారణాలు చెబుతున్నారు. ముఖ్యంగా మన సాఫ్ట్‌వేర్ సంస్థలు వ్యాపార కార్యకలాపాల పరంగా విదేశీ క్లయింట్లపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. సదరు క్లయింట్స్.. మారిన పరిస్థితుల్లో ఔట్ సోర్సింగ్‌కు బదులు.. వారి స్వదేశంలోనే కార్యకలాపాలు నిర్వహించుకోవాలని భావిస్తున్నారు. దాంతో ప్రాజెక్టులు తగ్గి ఉద్యోగుల కోత తప్పనిసరిగా మారిందనే వాదన వినిపిస్తోంది. మరోవైపు మిడ్, సీనియర్ లెవెల్ ఎగ్జిక్యూటివ్స్ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా రీ-స్కిల్లింగ్‌వైపు దృష్టిసారించకపోవడం కూడా కోతలకు మరో ప్రధాన కారణమని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. సీనియర్లకు ఇచ్చే భారీ వేతనాలతో పోల్చితే తక్కువ జీతంతోనే ఫ్రెషర్స్‌ను నియమించుకోవచ్చని.. తద్వారా ఆర్థిక భారం తగ్గుతుందని కంపెనీలు భావిస్తున్నాయి. గత త్రైమాసికంలో 42 శాతం వృద్ధి నమోదు చేసుకున్న కాగ్నిజెంట్ సంస్థ సైతం మిడ్, సీనియర్ స్థాయి ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించడానికి కారణం ఇదేనని పేర్కొంటున్నారు.

### పది శాతం మందిపై ప్రభావం

ఐటీ రంగ నిపుణుల అంచనాల ప్రకారం-రానున్న మూడు, నాలుగు నెలల్లో ఆయా సంస్థల్లో మిడ్, సీనియర్ స్థాయిలో కనిష్టంగా 5 శాతం, గరిష్టంగా పది శాతం వరకు ఉద్యోగాల్లో కోతలు ఉండే ఆస్కారముంది. ప్రస్తుతం దేశంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో మొత్తం ఉద్యోగుల్లో మిడ్ లెవెల్ ఎగ్జిక్యూటివ్స్ వాటా 30 శాతం. వీరిలో సగటున ఒక్కో ఉద్యోగికి రూ.10లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వార్షిక వేతనం అందుతోంది. ఇంతటి భారీ జీతాలు అందుకుంటున్న మిడ్ లెవెల్ ఎగ్జిక్యూటివ్స్‌లో అధిక శాతం మంది కొత్త టెక్నాలజీ నేర్చుకోవడంపై ఆసక్తి చూపడం లేదన్నది సంస్థల వాదన. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త టెక్నాలజీ నైపుణ్యాలతో, జాబ్ రెడీ స్కిల్స్‌తో సిద్ధంగా ఉన్న ఫ్రెషర్స్‌ను తక్కువ జీతానికే నియమించుకోవాలని సంస్థలు భావిస్తున్నాయి. ప్రాజెక్ట్ మేనేజర్స్ స్థాయిలో రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ వేతనం అందుకునే వారి ఉద్యోగాలు గరిష్ట రిస్క్‌లో ఉన్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

### ఫ్రెషర్స్‌కు నో టెన్షన్.. కానీ

నాలుగైదేళ్లకోసారి పాత టెక్నాలజీ మారిపోతుందని... కొత్త టెక్నాలజీ పుట్టుకొస్తుందని.. అప్‌డేట్ కాని మిడ్, సీనియర్ ఉద్యోగుల కొనసాగింపును సమీక్షించడం సాధారణమేనని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. కాబట్టి తాజా గ్రాడ్యుయేట్లు, కొత్తగా ఐటీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు. ఐటీ కొలువుల్లో చేరాలనుకునే అభ్యర్థులు కొత్త టెక్నాలజీ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఐఓటీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, రోబోటిక్స్ వంటి అంశాలపై పట్టుసాధించాలని సలహా ఇస్తున్నారు. ఇలాంటి స్కిల్స్ ఉన్న వారికే సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయని చెబుతున్నారు.

### మిగతా రంగాల మాటేమిటి?

ఐటీ మాదిరిగానే దాదాపు అన్ని రంగాల్లోనూ నూతన నైపుణ్యాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. వీటిని సొంతం చేసుకోకుంటే.. మిడ్ లెవల్, సీనియర్ లెవల్ ఉద్యోగుల కెరీర్‌పై ప్రతికూల ప్రభావం పడే ఆస్కారముంది. ముఖ్యంగా ఇటీవల కాలంలో తయారీ రంగంలో ఆటోమేషన్ ఆధారిత కార్యకలాపాలు ఊపందుకున్నాయి. దీంతో ఈ రంగంలోనూ ఉద్యోగాల్లో కోత మొదలైంది. ఆటోమొబైల్ రంగం సంక్షోభంతో లక్షల మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి తలెత్తింది. టెలికం రంగంలోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. నియామకాలు, ఉద్యోగుల తొలగింపు మిగతా రంగాలతో పోల్చితే బీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో నేటికీ కొంత సానుకూల పరిస్థితి కనిపిస్తోంది. సంక్షోభ పరిస్థితుల్లోనూ నియామకాలు చేపడుతూ ఈ-కామర్స్ కొంత ముందంజలో నిలుస్తోందని చెప్పొచ్చు. ఇందులోనూ అధిక శాతం డేటా అనలిటిక్స్, డేటా సైన్స్, ఏఐ విభాగాల్లోనే ఉద్యోగాలు ఉంటున్నాయి. కింది స్థాయిలో మార్కెటింగ్, సేల్స్, డెలివరీ విభాగాల్లో సిబ్బందిని తగ్గించుకోవాలని సంస్థలు భావిస్తున్నాయి.

### ముప్పును తప్పించుకునేదెలా?

ఐటీ రంగంలో మిడ్, సీనియర్ లెవల్‌లో కోతల ముప్పును తప్పించుకోవాలంటే.. ఉద్యోగులు తప్పనిసరిగా నూతన టెక్నాలజీలైన ఐఓటీ, ఏఐ అండ్ ఎంఎల్, 3-డి డిజైన్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్లౌడ్ సర్వీసెస్‌లో శిక్షణ పొందాలని నిపుణులు సూచిస్తున్నారు. కొత్తగా ఐటీ కొలువులు కోరుకునే ఫ్రెషర్స్ సైతం ఈ టెక్నాలజీలపై దృష్టిపెట్టాలంటున్నారు.

### రీ-స్కిల్లింగ్!



సంస్థలు గతేడాది నుంచే తమ ఉద్యోగులకు రీ-స్కిల్లింగ్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. నాస్కామ్ నివేదిక ప్రకారం-గత సంవత్సరం యాక్సెంచర్ సంస్థ 51 వేల మంది ఉద్యోగులకు డేటా అనలిటిక్స్, ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, ఐఓటీ తదితర అంశాల్లో శిక్షణనిచ్చింది. ఇదే బాటలో క్యాప్ జెమినీ, ఇంటెల్, అమెజాన్, ఇన్ఫోసిస్, టీసీఎస్‌లు సైతం తమ ఉద్యోగుల రీ-స్కిల్లింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చాయి. అంతేకాకుండా వచ్చే నాలుగేళ్లలో దేశంలోని ఐటీ సంస్థలు.. తమ ఉద్యోగుల్లో 40 శాతం మందికి రీ-స్కిల్లింగ్‌పై శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని నాస్కామ్ పేర్కొంది. రీ-స్కిల్లింగ్ శిక్షణకు మిడ్, సీనియర్ లెవల్‌లో అధిక శాతం మంది ఆసక్తి చూపకపోవడం వల్ల వీరి ఉద్యోగాల మనుగడ ప్రమాదంలో పడింది.

### ఐటీలో కోతలు.. ముఖ్యాంశాలు




» కాగ్నిజెంట్‌లో ఏడు వేలు, ఇన్ఫోసిస్‌లో పదివేల మంది ఉద్యోగుల తొలగింపు దిశగా చర్యలు.
» పదేళ్ల అనుభవం ఉండి.. రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వేతనం పొందుతున్న వారిపై ప్రభావం.
» ఐటీ సంస్థల్లో చివరి త్రైమాసికంలో సగటున పది శాతం మేరకు మిడ్, సీనియర్ లెవల్ ఉద్యోగులపై వేటు.
» నూతన టెక్నాలజీపై అవగాహన లేకపోవడమే ప్రధాన కారణమని చెబుతున్న సంస్థలు.
» జాబ్ రెడీ స్కిల్స్, కొత్త టెక్నాలజీ నైపుణ్యాలున్న ఫ్రెషర్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం.

### వృద్ధి నమోదు.. కానీ

ఐటీ సంస్థల్లో వృద్ధి నమోదవుతోంది. కానీ..భవిష్యత్తు పరిస్థితులను ముందుగానే అంచనా వేస్తున్న సంస్థలు.. వ్యయం తగ్గించుకోవాలని భావిస్తున్నాయి. మిడ్, సీనియర్ లెవల్ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకునే దిశగా చర్యలు చేపడుతున్నాయి. కాబట్టి ఫ్రెషర్స్ కొత్త టెక్నాలజీపై నైపుణ్యంతో ఉద్యోగాన్వేషణకు ఉపక్రమించాలి.

– ఎ.శశి కుమార్, ఎండీ, ఇండీడ్ ఇండియా డాట్ కామ్

### రీ-స్కిల్లింగ్‌ను అందిపుచ్చుకోవాలి

సంస్థలు అంతర్గతంగా చేపడుతున్న రీ-స్కిల్లింగ్ శిక్షణలో పాల్గొని కొత్త నైపుణ్యాలు సొంతం చేసుకునేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలి. లేకుంటే.. ఉద్యోగ మనుగడ ప్రమాదంలో పడుతుందని గుర్తించాలి. ఒకవేళ ఇప్పటికే బెంచ్‌పై ఉంటే.. సొంతంగానైనా శిక్షణ తీసుకోవాలి. తాము శిక్షణ పొందిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. తమకున్న ఆసక్తిని తెలియజేయాలి. ఇది కొంత సానుకూల ఫలితాన్ని ఇస్తుంది.

– రీతూపర్ణ చక్రవర్తి, కో-ఫౌండర్, టీమ్‌లీజ్ స్టాఫింగ్ అండ్ కన్సల్టింగ్ సంస్థ

## మను-39

హైదరాబాద్ (గచ్చిబౌలి)లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **విభాగాల వారీ ఖాళీలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్-34, ప్రొఫెసర్-2, అసోసియేట్ ప్రొఫెసర్-2, హెచ్‌వోడీ-1.
» **అర్హత:** పోస్టును బట్టి ఇంజనీరింగ్ డిగ్రీ, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి. నెట్/సెట్/స్లెట్ క్వాలిఫై అయి ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 24, 2019.
» **వెబ్‌సైట్:** http://manuu.edu.in

## ఎయిమ్స్ (ఢిల్లీ)-194

ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 194 జూనియర్ రెసిడెంట్ (ఇంటర్న్‌షిప్) ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

AIIMS Admit Card

» **విభాగాలు:** నెఫ్రాలజీ, రేడియోథెరపీ, కార్డియాలజీ, సర్జరీ, న్యూరాలజీ, డెంటల్ సర్జరీ తదితర విభాగాలున్నాయి.
» **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ ఉత్తీర్ణత.
» **ఎంపిక:** ప్రవేశ పరీక్ష, మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 10, 2019.
» **కౌన్సెలింగ్ తేదీ:** డిసెంబర్ 24, 2019.
» **వెబ్‌సైట్:** www.aiimsexams.org

## బీహెచ్ఈఎల్-23

బెంగళూరులోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్).. ఒప్పంద ప్రాతిపదికన 23 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **విభాగాల వారీ ఖాళీలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్ (సివిల్)-3, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ (సివిల్)-20.
» **అర్హత:** డిప్లొమా (సివిల్), బీఈ/బీటెక్ (సివిల్) ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
» **వయసు:** 2019, డిసెంబర్ 1 నాటికి 33 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక:** అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 21, 2019.
» **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** డిసెంబర్ 26, 2019.
» **వెబ్‌సైట్:** www.bhel.com




## ఏఆర్‌సీఐ-11

హైదరాబాద్ (బాలాపూర్)లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 11 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **విభాగాల వారీ ఖాళీలు:** టెక్నికల్ అసిస్టెంట్-1, అసిస్టెంట్-5, టెక్నీషియన్-5.
» **వయసు:** పోస్టులను 28-30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతి, ఇంజనీరింగ్ డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
» **ఎంపిక:** ట్రేడ్/స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు ఫీజు:** రూ.300.
» **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 30, 2019.
» **వెబ్‌సైట్:** www.arci.res.in

## నార్త్ ఈస్ట్ రైల్వే-1104

గోరఖ్‌పూర్ ప్రధాన కేంద్రంగా ఉన్న నార్త్ ఈస్ట్ రైల్వే (ఎన్ఈఆర్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 1104 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ) దరఖాస్తులు కోరుతోంది.
» **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, డీజిల్ మెకానిక్ తదితర ట్రేడులున్నాయి.
» **అర్హత:** పదోతరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత ఉండాలి.
» **వయసు:** 2019, డిసెంబర్ 25 నాటికి 15-24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు ఫీజు:** రూ.100.
» **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 25, 2019.
» **వెబ్‌సైట్:** https://ner.indianrailways.gov.in

## ఎస్‌సీఆర్-4103 అప్రెంటీస్ ఖాళీలు

సికింద్రాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) వివిధ ఖాళీగా ఉన్న 4103 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **ట్రేడుల వారీ ఖాళీలు:** ఏసీ మెకానిక్-249, కార్పెంటర్-16, డీజిల్ మెకానిక్-640, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్-18, ఎలక్ట్రీషియన్-871, ఎలక్ట్రానిక్ మెకానిక్-102, ఫిట్టర్-1460, మెషినిస్ట్-74, ఎఎండబ్ల్యూ-24, ఎంఎంటీఎం-12, పెయింటర్-40, వెల్డర్-597.
» **అర్హత:** పదోతరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత.
» **వయసు:** 2019, డిసెంబర్ 8 నాటికి 15-24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక:** అకడమిక్ మెరిట్, మెడికల్ ఫిట్‌నెస్, ఫిజికల్ స్టాండర్డ్స్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు ఫీజు:** రూ.100.
» **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 8, 2019.
» **వెబ్‌సైట్:** https://scr.indianrailways.gov.in

## హెచ్ఎంటీ-8

రాజస్థాన్‌లోని హిందుస్థాన్ మెషిన్ టూల్స్ లిమిటెడ్ (హెచ్ఎంటీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 8 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **విభాగాల వారీ ఖాళీలు:** ప్రాజెక్ట్ సీనియర్ ఇంజనీర్-2, ప్రాజెక్ట్ డిప్యూటీ ఇంజనీర్-6.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
» **వయసు:** పోస్టులను బట్టి 35-50 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 13, 2019.
» **వెబ్‌సైట్:** www.hmtindia.com

## నేవల్ డాక్ యార్డ్-275

విశాఖపట్నంలోని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ (నేవీ)కి చెందిన నేవల్ డాక్ యార్డ్ అప్రెంటీస్ స్కూల్ 2020-21కి గాను వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న 275 ట్రేడ్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రీషియన్-29, ఎలక్ట్రానిక్స్ మెకానిక్-32, ఫిట్టర్-29, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-15, మెషినిస్ట్-19, పెయింటర్-15, ఏసీ మెకానిక్-19, వెల్డర్-23, కార్పెంటర్-23, ఫౌండ్రీమ్యాన్-7, మెకానిక్-14, షీట్ మెటల్ వర్కర్-29, పైప్ ఫిట్టర్-21.
» **అర్హత:** పదోతరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత.
» **వయసు:** 1999, ఏప్రిల్ 1 నుంచి 2006, ఏప్రిల్ 1 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక:** రాతపరీక్ష, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **పరీక్షతేదీ:** జనవరి 29, 2020.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 5, 2019.
» **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** డిసెంబర్ 12, 2019.
» **వెబ్‌సైట్:** www.indiannavy.nic.in

## ప్రవేశాలు

### ఎల్‌బీఎస్ఐఎమ్‌లో ప్రవేశాలు

భారత ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలోని లాల్ బహదూర్ శాస్త్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎల్‌బీఎస్ఐఎం)-2020కి గాను వివిధ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
» పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (జనరల్, ఫైనాన్స్, రీసెర్చ్ అండ్ బిజినెస్ అనలిటిక్స్, లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్).
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత, క్యాట్-2019, జీమ్యాట్-2020ల్లో వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.
» **ఎంపిక:** షార్ట్‌లిస్ట్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, అనుభవం ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు ఫీజు:** రూ.1250.» **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 15, 2019.
» **వెబ్‌సైట్:** www.lbsim.ac.in


### సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..

డైలీ,వీక్లీ, మంత్లీ కరెంట్ అఫైర్స్
ఎస్ఐ, కానిస్టేబుల్ స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్స్, వీడియో గైడెన్స్
శ్రీ అక్షర డీఎస్సీ స్టడీ సర్కిల్ సీనియర్ ఫ్యాకల్టీ కె.కనకరాజ్ గారిచే డీఎస్సీ/టెట్‌కు పరీక్షలకు సంబంధించిన వీడియో గైడెన్స్..
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

సాక్షి స్పోర్ట్స్
బుధవారం
4-12-2019

## ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ టోర్నీ: దివ్యా రెడ్డికి రెండు పతకాలు



ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ మహిళా అథ్లెట్ దివ్యా రెడ్డి రెండు పతకాలు సాధించింది. మలేసియాలోని సారావక్‌లో జరుగుతున్న ఈ చాంపియన్‌షిప్‌లో దివ్యా రెడ్డి 40 ఏళ్ల వయో విభాగంలో 800 మీటర్ల కేటగిరీలో విజేతగా నిలిచి స్వర్ణం సొంతం చేసుకోగా... 400 మీటర్ల విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. 800 మీటర్ల ఫైనల్లో దివ్యా రెడ్డి అందరికంటే ముందుగా 2 నిమిషాల 53.64 సెకన్లలో గమ్యానికి చేరి చాంపియన్‌గా అవతరించింది. గో తెంగ్ యిన్ (మలేసియా–2ని:54.15 సెకన్లు) రజతం... అమితా కనెగాంకర్ (భారత్–2 ని:54.73 సెకన్లు) కాంస్యం సాధించారు.



ఉప్పల్ స్టేడియంలో విండీస్ ఆటగాళ్ల ప్రాక్టీస్

# విండీస్ బలమెంత?

వెస్టిండీస్ జట్టు ఇటీవలే అఫ్గానిస్తాన్‌పై వన్డే సిరీస్‌లో విజయం సాధించింది. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత ఆ జట్టు ఒక సిరీస్ గెలవగలిగింది. అయితే ఆ వెంటనే అదే అఫ్గాన్ జట్టు చేతిలో టి20 సిరీస్‌ను కోల్పోయింది. ఇదే విండీస్ నిలకడలేమికి నిదర్శనం. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచ విజేతగా ఉన్నా జట్టులో ఏ ఒక్క ఆటగాడిపైనా పూర్తిగా నమ్మకం పెట్టలేని స్థితి. ఇలాంటి నేపథ్యంలో పటిష్టమైన భారత జట్టును వారి సొంతగడ్డపై టి20లు, వన్డేల్లో నిలువరించడం అంత సులువు కాదు. కెప్టెన్ పొలార్డ్ మినహా క్రిస్ గేల్, ఆండ్రీ రసెల్, డ్వేన్ బ్రేవో, సునీల్ నరైన్‌లాంటి భారత అభిమానులు గుర్తించే ఆటగాళ్లెవరూ ఇప్పుడు జట్టులో లేరు. ఈ నేపథ్యంలో విండీస్ జట్టు తాజా స్థితిని విశ్లేషిస్తే...

**జట్టులో భారీగా హిట్టర్లు • నిలకడలేమి ప్రధాన లోపం • ఇటీవల అఫ్గాన్ చేతిలోనూ ఓటమి • డిసెంబర్ 6న భారత్‌తో తొలి పోరు**

### సీపీఎల్‌తో దక్కిన గుర్తింపుతో...

విండీస్ జట్టులో యువ ఆటగాళ్ల ఎంపిక మొత్తం వారి కరీబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) ప్రదర్శనపైనే ఆధారపడినట్లు కనిపిస్తోంది. హేడెన్ వాల్ష్ జూనియర్ (లెగ్ స్పిన్నర్), బ్రెండన్ కింగ్ (ఓపెనర్)లకు లీగ్ ప్రదర్శన తర్వాత వెంటనే జాతీయ జట్టులో చోటు దక్కింది. అయితే ఇటీవల అఫ్గాన్‌తో లక్నోలో జరిగిన సిరీస్‌లో వీరిద్దరు విఫలమయ్యారు. భారత గడ్డపై పిచ్‌లకు వారి ఆట సరిపోలేదు. సరిగ్గా చెప్పాలంటే సీపీఎల్ స్థాయికి, భారత్‌లో ఒక అంతర్జాతీయ మ్యాచ్ ఆడే స్థాయికి మధ్య అనంతమైన అంతరం ఉంది. కాబట్టి వీరు భారత్‌లో ఎలా ఆడతారో చూడాలి.

### స్పిన్నర్ ఎక్కడ?

విదేశీయులైనా సరే వైవిధ్యం ఉన్న స్పిన్నర్లయితే భారత్‌లోనూ మంచి ఫలితాలు సాధించగలరని గతంలో రుజువైంది. ఐపీఎల్‌లో నరైన్ విలువేమిటో అందరికీ తెలుసు. అయితే గాయంతో ఇప్పుడు అతను విండీస్ జట్టుకు దూరమయ్యాడు. హేడెన్ వాల్ష్‌కు ఏమాత్రం అనుభవం లేకపోగా, ఆఫ్‌స్పిన్నర్ ఖారీ పైర్‌ను ఎదుర్కోవడం భారత బ్యాట్స్‌మెన్‌కు నల్లేరు మీద నడకలాంటిదే. పైర్ కూడా సీపీఎల్ నుంచే వెలుగులోకి వచ్చాడు.

### పొలార్డ్ నాయకత్వం ఎలా ఉంది?

సిరీస్ నేపథ్యంలో ఇటీవల రోహిత్ శర్మ, పొలార్డ్‌లతో రూపొందించిన టీవీ ప్రకటన అందరిలోనూ ఆసక్తి రేపింది. పొలార్డ్‌కు ఎంతో అనుభవం ఉన్నా కెప్టెన్సీపరంగా అతడికి పెద్దగా గుర్తింపు లేదు. అఫ్గానిస్తాన్‌తో ఆరు మ్యాచ్‌లు సహా అతను ఇప్పటి వరకు ఎనిమిది అంతర్జాతీయ మ్యాచ్‌లలోనే విండీస్‌కు నాయకత్వం వహించాడు. అయితే విండీస్‌కు మరో ప్రత్యామ్నాయం లేక భారీ హిట్టర్ అయిన పొలార్డ్‌కే పరిమిత ఓవర్ల కెప్టెన్సీ అప్పగించారు. అయితే పూరన్ తదితర యువ ఆటగాళ్లను ప్రోత్సహించి, తీర్చిదిద్దడంలో అతనిదే కీలక పాత్ర అని విండీస్ టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అతనిలోని అసలైన నాయకత్వ లక్షణాలకు భారత్‌తో సిరీస్ ఒక సవాల్ కానుంది. దీనిని అతను ఎలా ఎదుర్కొంటాడనేది ఆసక్తికరం.

### అలెన్‌పై ఆశలు..

రసెల్‌లాంటి భీకరమైన హిట్టర్ దూరం కావడంతో లోయర్ ఆర్డర్‌లో అదే తరహా ఆటగాడి కోసం విండీస్ అన్వేషణ కొనసాగుతోంది. ప్రస్తుతానికి ఈ సిరీస్‌లో ఆ జట్టు అలెన్‌పై అలాంటి ఆశలు పెట్టుకుంటోంది. ఈ ఏడాది సీపీఎల్‌లో అలెన్ 16నుంచి 20 ఓవర్ల మధ్య బ్యాటింగ్‌కు దిగినప్పుడు ఏకంగా 225 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధించాడు. కొంత వరకు స్పిన్ బౌలింగ్ కూడా చేయగల ఇతను అద్భుతమైన ఫీల్డర్ కావడం అదనపు బలం.

### వీరు ఆడితేనే...

పెద్దగా అనుభవం లేని జట్టు, భారత్‌లో పరిస్థితులపై అవగాహన లేని ఆటగాళ్లే ఎక్కువ. ఇలాంటి స్థితిలో విండీస్ కొందరు ఆటగాళ్లపైనే ఆశలు పెట్టుకుంటోంది. గతంలో చెప్పుకోదగ్గ రికార్డు లేకపోయినా సరే కొంత వరకైనా వీరు రాణిస్తేనే విండీస్‌కు విజయావకాశాలు ఉంటాయనేది వాస్తవం. బౌలింగ్ అంతంత మాత్రంగానే ఉండటంతో పొలార్డ్, హెట్‌మైర్, లూయిస్, పూరన్‌ల బ్యాటింగ్ ఆ జట్టును ఆదుకోవచ్చు.

### అమెరికా టు వెస్టిండీస్



వెస్టిండీస్ జట్టులోని లెగ్ స్పిన్నర్ హేడెన్ వాల్ష్ జూనియర్ అఫ్గాన్‌తో మ్యాచ్ తర్వాత అరుదైన ఆటగాళ్ల జాబితాలో చేరాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో రెండు దేశాలకు ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. అమెరికా తరఫున 8 టి20లు, 1 వన్డే మ్యాచ్ ఆడిన అనంతరం అతనికి వెస్టిండీస్ జట్టు నుంచి పిలుపు వచ్చింది. ఈ ఏడాది ఆగస్టు 25న అమెరికా తరఫున ఆడితే రెండు నెలలు తిరిగేలోగా అతను విండీస్ తరఫున ఆడాడు. ఐసీసీ నిబంధనల ప్రకారం ఏదైనా అసోసియేట్ జట్టు ఆటగాడు మ్యాచ్ ఆడిన మరుసటి రోజే పూర్తిస్థాయి సభ్య దేశం తరఫున బరిలోకి దిగవచ్చు. అమెరికా ఆధీనంలో ఉన్న వర్జిన్ ఐలాండ్స్‌లోని సెయింట్ క్రాయిక్స్‌లో హేడెన్ పుట్టాడు. దాంతో సహజంగానే అమెరికా దేశస్తుడయ్యాడు. ఆ తర్వాత పసితనంలోనే ఆంటిగ్వాకు వలస వెళ్లడంతో రెండు దేశాల పౌరసత్వం కూడా లభించింది. వెస్టిండీస్‌లో భాగమైన లీవార్డ్ ఐలాండ్స్, బార్బడోస్ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడిన అనంతరం తన అమెరికా పాస్‌పోర్టుతో అతను ఆ జట్టు సెలక్షన్స్‌కు హాజరయ్యాడు. యూఎస్‌ఏ తరఫున ఐసీసీ వరల్డ్ క్రికెట్ లీగ్ డివిజన్ 2 (వన్డే), టి20 వరల్డ్ కప్ అమెరికాస్ రీజియన్ ఫైనల్ (టి20లు)లో వాల్ష్ ప్రాతినిధ్యం వహించాడు. సీపీఎల్ 2019లో వాల్ష్ అత్యధికంగా 21 వికెట్లు పడగొట్టి అందరి దృష్టిలో పడ్డాడు.



భారత మహిళల టీటీ జట్టు

# పసిడి పంట

**దక్షిణాసియా క్రీడల్లో భారత్ జోరు • టీటీలో రెండు స్వర్ణాలు**

**కఠ్మాండు (నేపాల్):** దక్షిణాసియా క్రీడల్లో రెండో రోజు భారత క్రీడాకారులు పసిడి పతకాల పంట పండించారు. అథ్లెటిక్స్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, షూటింగ్ క్రీడాంశాల్లో తమ ఆధిపత్యాన్ని చాటుకొని పతకాలు సొంతం చేసుకున్నారు. ఓవరాల్‌గా రెండో రోజు మంగళవారం భారత్‌కు 27 పతకాలు లభించాయి. ఇందులో 13 స్వర్ణాలు ఉన్నాయి. టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ ఈవెంట్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు స్వర్ణ పతకాలు నెగ్గాయి. తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ సభ్యురాలిగా ఉన్న భారత టీటీ మహిళల జట్టు ఫైనల్లో 3–0తో శ్రీలంకను ఓడించింది. ఫైనల్స్ మ్యాచ్‌ల్లో సుతీర్థ ముఖర్జీ 11–9, 11–7, 11–3తో ఇషారా మధురాంగిపై, కృత్విక సిన్హా రాయ్ 11–6, 11–4, 11–2తో ఇరాండి వరుస్వితానాపై, ఆకుల శ్రీజ 11–5, 11–5, 11–3తో హన్సిని పియుమిలాపై నెగ్గారు. ఆంథోని అమల్‌రాజ్, హర్మీత్ దేశాయ్, సౌమ్యజిత్ ఘోష్ సభ్యులుగా ఉన్న భారత పురుషుల టీటీ జట్టు ఫైనల్లో 3–0తో నేపాల్‌పై గెలిచింది. వాలీబాల్ ఈవెంట్‌లోనూ భారత జట్లకు రెండు స్వర్ణాలు దక్కాయి. ఫైనల్స్‌లో భారత పురుషుల జట్టు 20–25, 25–15, 25–17, 29–27తో పాకిస్తాన్‌పై నెగ్గగా, భారత మహిళల జట్టు 25–17, 23–25, 21–25, 25–20, 15–6తో నేపాల్‌ను ఓడించింది.



చెయిన్ సింగ్

షూటింగ్‌లో భారత్‌కు 4 స్వర్ణాలు, 4 రజతాలు, కాంస్యంతో కలిపి తొమ్మిది పతకాలు వచ్చాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో మెహులీ ఘోష్... టీమ్ విభాగంలో భారత్ పసిడి పతకాలు గెలుచుకుంది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో చెయిన్ సింగ్... పురుషుల 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో యోగేశ్ సింగ్ స్వర్ణాలు సాధించారు. తైక్వాండోలో మహిళల 57 కేజీల విభాగంలో కశిష్ మలిక్ పసిడి పతకం నెగ్గింది. అథ్లెటిక్స్‌లో భారత్‌కు అర్చన సుశీంద్రన్ (మహిళల 100 మీటర్లు), జిష్నా (మహిళల హైజంప్), సర్వేశ్ అనిల్ కుషారే (పురుషుల హైజంప్), అజయ్ కుమార్ సరోజ్ (పురుషుల 1500 మీటర్లు) బంగారు పతకాలు అందించారు. ఖో–ఖోలో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్‌కు అర్హత సాధించాయి.

## సెమీస్‌లో ఆంధ్ర పరాజయం

**పుదుచ్చేరి:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మహిళల అండర్–23 టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు పోరాటం ముగిసింది. ముంబై జట్టుతో మంగళవారం జరిగిన సెమీఫైనల్లో ఆంధ్ర జట్టు 69 పరుగుల తేడాతో ఓడిపోయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 149 పరుగులు చేసింది. ముంబైకి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత జట్టు స్టార్ ఓపెనర్ జెమీమా రోడ్రిగ్స్ (50 బంతుల్లో 67; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆంధ్ర జట్టు బౌలర్లలో జి. సింధుజ రెండు వికెట్లు తీయగా... గద్వాల్ శరణ్య, ఇ.పద్మజ ఒక్కో వికెట్ పడగొట్టారు. 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు 17.5 ఓవర్లలో 80 పరుగులకు ఆలౌటైంది. ముంబై బౌలర్ జాన్వీ కేవలం 11 పరుగులిచ్చి 5 వికెట్లు తీయడం విశేషం. ఆంధ్ర జట్టులో ఐదుగురు 'డకౌట్' కావడం గమనార్హం. అంజలి శర్వాణి (34 బంతుల్లో 40; 6 ఫోర్లు) ఇన్నింగ్స్ కారణంగా ఆంధ్ర జట్టు ఆమాత్రమైనా స్కోరు చేయగలిగింది. మరో సెమీఫైనల్లో గుజరాత్‌పై జార్ఖండ్ పది వికెట్ల తేడాతో గెలిచి ఈనెల 5న ముంబైతో ఫైనల్ పోరుకు సిద్ధమైంది.

## బుమ్రా కసరత్తులు!

**ముంబై:** వెన్నునొప్పితో భారత జట్టుకు దూరమైన స్టార్ పేసర్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తన ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకునే ప్రయత్నంలో పడ్డాడు. దీనికి సంబంధించి అతను ప్రత్యేక కసరత్తులు మొదలు పెట్టాడు. సెప్టెంబరులో గాయపడిన బుమ్రా ఆ తర్వాత స్వదేశంలో దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లతో సిరీస్‌లలో ఆడలేదు. ఇప్పుడు వెస్టిండీస్‌తో పోరుకు కూడా అతను అందుబాటులో లేడు. అయితే రాబోయే కీలకమైన న్యూజిలాండ్ పర్యటన సమయానికి బుమ్రా అన్ని రకాలుగా ఫిట్‌గా ఉండాలని భారత టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. అదే ప్రయత్నంలో బుమ్రా జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఐపీఎల్ టీమ్ ఢిల్లీ క్యాపిటల్స్ స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ రజినీకాంత్ శివజ్ఞానమ్ అతనికి సహకరిస్తున్నాడు. ఐపీఎల్‌లో బుమ్రా ముంబై తరఫున ఆడుతున్నా... మరో జట్టు ట్రైనర్‌ను వాడుకుంటుండటం విశేషం. అయితే తమకు దీనిపై ఎలాంటి అభ్యంతరం లేదని, నిబంధనల ప్రకారం ఐపీఎల్ సమయంలోనే రజినీకాంత్ మరో జట్టు ఆటగాడితో పని చేయరాదని ఢిల్లీ యాజమాన్యం స్పష్టం చేసింది. బుమ్రా ఇప్పటికే గుజరాత్ రంజీ జట్టుతో కలిసి నెట్‌ప్రాక్టీస్‌లో పాల్గొంటూ తన ఆటకు మరింత పదును పెట్టుకుంటున్నాడు.



# మెస్సీ సిక్సర్...

**రికార్డు స్థాయిలో ఆరోసారి 'గోల్డెన్ బాల్' పురస్కారం సొంతం**


**పారిస్:** ప్రతి యేటా ప్రపంచ అత్యుత్తమ ఫుట్‌బాల్ ప్లేయర్‌కు అందించే 'బ్యాలన్ డి ఓర్' (గోల్డెన్ బాల్) అవార్డు ఈసారి అర్జెంటీనా స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సీని వరించింది. ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ఆరోసారి గెల్చుకోవడం ద్వారా మెస్సీ కొత్త చరిత్ర సృష్టించాడు. గతేడాది వరకు ఐదుసార్లు చొప్పున క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్), మెస్సీ ఈ అవార్డు సాధించి సమఉజ్జీగా నిలిచారు. తాజా పురస్కారంతో రొనాల్డోను వెనక్కి నెట్టి మెస్సీ అత్యధికసార్లు ఈ అవార్డు గెల్చుకున్న ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. గతంలో మెస్సీ 2009, 2010, 2011, 2012, 2015లలో ఈ అవార్డు గెల్చుకున్నాడు.

సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ కార్యక్రమంలో మెస్సీకి అత్యధికంగా 686 ఓట్లు లభించాయి. నెదర్లాండ్స్ డిఫెండర్ విర్గిల్ వాన్ డిజ్క్ 679 ఓట్లతో రెండో స్థానంలో నిలువగా... పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో మూడో స్థానానికి పరిమితమయ్యాడు. 2019 సీజన్‌లో మెస్సీ 54 మ్యాచ్‌ల్లో 46 గోల్స్ సాధించాడు. మహిళల విభాగంలో అమెరికాకు చెందిన మెగాన్ రాపినోయ్ 'బ్యాలన్ డి ఓర్' అవార్డును గెల్చుకుంది. ఈ ఏడాది జరిగిన మహిళల ప్రపంచకప్‌ను అమెరికా గెలవడంలో ఆమె ప్రముఖ పాత్ర పోషించింది. ప్రపంచ కప్‌లో అత్యధిక గోల్స్ సాధించే వారికి ఇచ్చే 'గోల్డెన్ బూట్' అవార్డును, ఫిఫా బెస్ట్ ప్లేయర్ అవార్డును మెగాన్ గెల్చుకోవడం విశేషం. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా)లో ఓటింగ్ సభ్యత్వం ఉన్న 176 దేశాలకు సంబంధించిన ప్రముఖ ఫుట్‌బాల్ జర్నలిస్టులు లేదా ఫుట్‌బాల్‌ను టెలికాస్ట్ చేసే బ్రాడ్‌కాస్టర్‌లు ఈ ఓటింగ్‌లో పాల్గొంటారు.



## అజహర్‌కు రూ. 1.5 కోట్లు

**బాకీలు చెల్లించనున్న బీసీసీఐ**



**ముంబై:** భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్‌కు బాకీగా ఉన్న రూ. కోటీ 50 లక్షలను చెల్లించేందుకు బీసీసీఐ సిద్ధమైంది. ఈ మొత్తాన్ని అజహర్‌కు ఇవ్వాలని బోర్డు ఏజీఎంలో నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ వెల్లడించాడు. బోర్డు నిబంధనల ప్రకారం మాజీ ఆటగాళ్లకు ఇవ్వాల్సిన పెన్షన్ తదితర సౌకర్యాలతో కలిపి అజ్జూకు రూ. కోటిన్నర రావాల్సి ఉంది. అయితే అతనిపై మ్యాచ్ ఫిక్సింగ్‌కు సంబంధించిన నిషేధం కొనసాగుతుండటంతో బోర్డు వీటిని నిలిపివేసింది. 2012లోనే ఏపీ హైకోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, తన బాకీలు చెల్లించాలంటూ రెండేళ్ల క్రితమే అజహర్ విజ్ఞప్తి చేశాడు. అయితే సీఓఏ మాత్రం స్పందించలేదు. ఎట్టకేలకు ఇప్పుడు బోర్డు అధ్యక్షుడి హోదాలో గంగూలీ తన తొలి కెప్టెన్‌కు మేలు చేకూర్చేలా అధికారిక నిర్ణయం తీసుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఉన్న అజహర్... భారత్ తరఫున 99 టెస్టులు, 334 వన్డేలు ఆడాడు.

## న్యూజిలాండ్‌దే టెస్టు సిరీస్

- ఇంగ్లండ్‌తో రెండో టెస్టు 'డ్రా'
- విలియమ్సన్, టేలర్ సెంచరీలు

**హామిల్టన్:** ఇంగ్లండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను న్యూజిలాండ్ 1–0తో సొంతం చేసుకుంది. మంగళవారం ముగిసిన రెండో టెస్టులో చివరి రోజు కివీస్ బ్యాట్స్‌మెన్ విలియమ్సన్ (234 బంతుల్లో 104 నాటౌట్; 11 ఫోర్లు), రాస్ టేలర్ (186 బంతుల్లో 105 నాటౌట్; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ శతకాలతో కదంతొక్కారు. వర్షంతో ఆట నిలిచిపోయే సమయానికి న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసి 140 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వాన ఎంతకీ తగ్గకపోవడంతో ఆటను ముగించారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో చెలరేగిన కెప్టెన్ రూట్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు నెగ్గగా... కివీస్ పేసర్ నీల్ వాగ్నర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం లభించింది.



విలియమ్సన్, టేలర్


**కివీస్‌కు 'స్పిరిట్ ఆఫ్ క్రికెట్' అవార్డు**

న్యూజిలాండ్ జట్టుకు 'స్పిరిట్ ఆఫ్ క్రికెట్' అవార్డు దక్కింది. ఈ ఏడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో కివీస్ రన్నరప్‌గా నిలిచింది. 'సూపర్ ఓవర్'దాకా ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో సమఉజ్జీగా నిలిచిన న్యూజిలాండ్... బౌండరీల లెక్కల్లో వెనుకబడి ఓడింది. అయితే ఆ టోర్నీలో కేన్ విలియమ్సన్ సేన చూపిన హుందాతనం అందరి మనసుల్ని గెలుచుకుంది. ఫైనల్లో క్షణానికోసారి పైచేయి మారుతున్నా... స్టోక్స్ (ఇంగ్లండ్) బ్యాట్‌ను తాకుతూ ఓవర్ త్రో బౌండరీ వెళ్లినా... అంపైర్ అదనపు పరుగు ఇచ్చినా... కివీస్ ఆటగాళ్లు మాత్రం ఎక్కడా సంయమనం కోల్పోలేదు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) న్యూజిలాండ్ జట్టును 'క్రిస్టోఫర్ మార్టిన్–జెన్‌కిన్స్ స్పిరిట్ ఆఫ్ క్రికెట్' అవార్డుకు ఎంపిక చేసింది. ఇంగ్లండ్‌తో ఇక్కడ జరిగిన రెండో టెస్టు 'డ్రా'గా ముగియగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ), బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌లు ఉమ్మడిగా స్పిరిట్ అవార్డును కివీస్ జట్టుకు అందజేశారు.

## కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో సౌరభ్ వర్మ

**టాప్–30లో ఆరుగురు భారత షట్లర్లు**

**న్యూఢిల్లీ:** జాతీయ చాంపియన్ సౌరభ్ వర్మ కెరీర్ బెస్ట్ 29వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అతను ఏడు స్థానాలు మెరుగుపర్చుకొని 29వ ర్యాంక్‌కు ఎగబాకాడు. ఇటీవల జరిగిన సయ్యద్ మోదీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సౌరభ్ రన్నరప్‌గా నిలువడంతో ర్యాంక్ మెరుగైంది. మొత్తంమీద టాప్–30లో ఆరుగురు భారత షట్లర్లున్నారు. పురుషుల సింగిల్స్‌లో ఇలా ఆరుగురు ఆటగాళ్లున్న దేశం భారతే కాగా... ఐదుగురితో చైనా రెండో వరుసలో ఉంది. భమిడిపాటి సాయిప్రణీత్ 11వ, కిడాంబి శ్రీకాంత్ 12వ, కశ్యప్ 23వ, సమీర్ వర్మ 26వ, హెచ్.ఎస్.ప్రణయ్ 27వ స్థానాల్లో కొనసాగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో



సింధు, సైనాలిద్దరు టాప్–10లో నిలకడగా ఉన్నారు. ప్రపంచ చాంపియన్ సింధు 6వ, సైనా నెహ్వాల్ 10వ ర్యాంకులో కొనసాగుతున్నారు.

## అత్యుత్తమ ర్యాంక్‌లో భారత టీటీ జట్టు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ర్యాంకింగ్స్‌లో భారత పురుషుల జట్టు తమ అత్యుత్తమ ర్యాంకులో నిలిచింది. ఐటీటీఎఫ్ విడుదల చేసిన ర్యాంకుల్లో సత్యన్ జ్ఞానశేఖరన్, ఆచంట శరత్ కమల్, హర్మీత్ దేశాయ్‌లతో కూడిన భారత్ ఎనిమిదో ర్యాంకుకు ఎగబాకింది. 280 రేటింగ్ పాయింట్లతో ఆస్ట్రియాతో కలిసి ఉమ్మడిగా ఉన్నప్పటికీ... భారత్ 8, ఆస్ట్రియా తొమ్మిదో ర్యాంకులో కొనసాగుతున్నాయి. చైనా, జపాన్, జర్మనీలు వరుసగా టాప్–3లో ఉన్నాయి. పురుషుల వ్యక్తిగత ర్యాంకుల్లో సత్యన్ 30వ, శరత్ కమల్ 36వ, హర్మీత్ దేశాయ్ 85వ ర్యాంకుల్లో ఉన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
4-12-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 40,675 | ▼ 127 |
| నిఫ్టీ | 11,994 | ▼ 54 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,472 | ▼ 96 |
| డోజోన్స్ | 27,376 | ▼ 407 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,159 | ▼ 127 |
| డాక్స్ | 12,989 | ▼ 25 |
| షాంఘై | 2,885 | ▲ 9 |
| నికాయ్ | 23,380 | ▼ 150 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.89 | 72.53 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.20 | 94.40 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.98 | 80.87 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.48 | 66.88 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.99 | 50.15 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.65 | 53.45 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.32 | 19.93 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.05 | 20.05 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.53 | 10.94 |

# మారుతీ కార్ల ధరలు పెంపు..

**జనవరి 1 నుంచి అమలు**



**న్యూఢిల్లీ:** దేశీయ అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా తన వాహన ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏడాది ఆరంభం నుంచి ఈ పెంపు అమల్లోకి రానుందని తెలియజేసింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని ఇక నుంచి కస్టమర్లకు బదలాయించక తప్పదని, గడిచిన ఏడాది కాలం నుంచి ధరల భారం ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. ఈ నేపథ్యంలో 2020 జనవరి నుంచి పెరిగే ధరలు మోడల్ ఆధారంగా ఉండనున్నట్లు వివరించింది. ప్రస్తుతం సంస్థ ఎంట్రీ లెవెల్ స్మాల్ కార్ ఆల్టో నుంచి ప్రీమియం మల్టీ పర్పస్ వాహనం ఎక్స్ఎల్6 వరకు విక్రయిస్తోంది. వీటి ధరల శ్రేణి రూ. 2.89 లక్షల నుంచి రూ. 11.47 లక్షల వరకు ఉంది.

# బంగారానికి 'ట్రంప్' బూస్ట్!

**వాణిజ్య యుద్ధం ముగింపు ఇప్పట్లో ఉండదన్న సంకేతాలు**

**న్యూయార్క్/న్యూఢిల్లీ:** వాణిజ్య యుద్ధానికి ఇప్పట్లో ముగింపు లభించే అవకాశాలు లేవన్న సంకేతాలు పసిడికి ఊతం ఇస్తున్నాయి. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్- న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజ్- నైమెక్స్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర మంగళవారం భారీగా పెరిగింది. ఈ వార్తరాసే రాత్రి 9గంటల సమయంలో పసిడి ధర 17 డాలర్లు పెరిగి 1,486 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బ్రెజిల్, అర్జెంటీనాలపై సోమవారం అమెరికా వాణిజ్య ఆంక్షలు, చైనాతో 2020 ఎన్నికల వరకూ వాణిజ్య యుద్ధం సమసిపోయే అవకాశాలు లేవని మంగళవారం అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన పసిడికి బలాన్ని ఇచ్చాయి. హాంకాంగ్ ఆందోళనకారులకు మద్దతునిచ్చే హ్యూమన్ రైట్స్ అండ్ డెమోక్రసీ యాక్ట్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేయడం, హాంకాంగ్‌లో ఆందోళనకారులకు మద్దతు కొనసాగిస్తే, దానికి ప్రతిగా తాము కూడా తగిన రీతిలో బదులివ్వాల్సి ఉంటుందని చైనా అమెరికాను హెచ్చరించడం తత్సంబంధ అంశాలు పసిడిపై ఇప్పటికే తమ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. గడిచిన 52 వారాల్లో పసిడి ధర ఔన్స్ (31.1గ్రా) ధర 1,248 డాలర్ల కనిష్ట స్థాయిని చూసింది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం, ఉత్తరకొరియా, ఇరాన్ వంటి దేశాలకు సంబంధించి భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాల నేపథ్యంలో బంగారం ధర భారీగా పెరిగి నెలన్నర క్రితం 1,566 డాలర్లను తాకింది.



**దేశీయంగానూ పటిష్టమే...**

భారత్ విషయానికి వస్తే, మంగళవారం రాత్రి 9 గంటలకు పసిడి ధర 10 గ్రాములకు దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో రూ.816 లాభంతో రూ.38,768 వద్ద ట్రేడవుతోంది. ఇదే విధంగా రాత్రి ట్రేడింగ్ కొనసాగి, రూపాయి బలపడకుండా ఉంటే పసిడి ధర బుధవారం భారీగా పెరిగే అవకాశం ఉంది.

## బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లో ముగిసిన వీఆర్ఎస్

**92,700 మంది ఉద్యోగులు సమ్మతి**



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ టెలికం సంస్థలు బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ ప్రవేశపెట్టిన స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పథకం మంగళవారంతో ముగిసింది. రెండు సంస్థల్లో 92,700 మంది ఉద్యోగులు వీఆర్ఎస్ ఎంచుకున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. బీఎస్ఎన్ఎల్‌లో 78,300 మంది, ఎంటీఎన్ఎల్‌లో 14,378 మంది దీన్ని ఎంచుకున్నారు. 'ఊహించిన స్థాయిలోనే ఇది ఉంది. మేం సుమారు 82,000 మేర సిబ్బంది సంఖ్య తగ్గుతుందని భావించాం. 78,300 మంది వీఆర్ఎస్ ఎంచుకోగా, మరో 6,000 మంది రిటైరయ్యారు' అని బీఎస్ఎన్ఎల్ సీఎండీ పి.కె. పుర్వార్ తెలిపారు. మరోవైపు 14,378 మంది వీఆర్ఎస్‌ను ఎంచుకున్నట్లు ఎంటీఎన్ఎల్ సీఎండీ సునీల్ కుమార్ తెలిపారు. వీఆర్ఎస్‌తో ఇరు సంస్థల వేతన భారం రూ. 8,800 కోట్ల మేర తగ్గనుంది. బీఎస్ఎన్ఎల్‌లో వేతన పరిమాణం రూ.14,000 కోట్ల నుంచి రూ. 7,000 కోట్లకు దిగివస్తుందని పుర్వార్ తెలిపారు. ఎంటీఎన్ఎల్ వేతన భారం రూ. 2,272 కోట్ల నుంచి రూ. 500 కోట్లకు తగ్గుతుంది.

# మరిన్ని సంస్కరణలకు రెడీ

- భారత్‌ను పెట్టుబడులకు గమ్యస్థానం చేయడమే లక్ష్యం
- బ్యాంకింగ్, మైనింగ్ తదితర రంగాల్లో చర్యలుంటాయ్
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్





**న్యూఢిల్లీ:** భారత్‌లో తయారీ కోసం, పెట్టుబడులకు భారత్‌ను ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చేందుకు మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కార్పొరేట్ పన్ను తగ్గింపు సహా ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో చర్యలు తీసుకున్నట్లు ఆమె గుర్తు చేశారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన భారత్ – స్వీడన్ వ్యాపార సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి సీతారామన్ మాట్లాడారు. ''భారత ప్రభుత్వం తదుపరి సంస్కరణలను బ్యాంకింగ్, మైనింగ్, బీమా తదితర రంగాల్లో తీసుకొచ్చేందుకు కట్టుబడి ఉందని నేను హామీ ఇస్తున్నాను'' అని ఈ సందర్భంగా చెప్పారు. ఆ సంస్కరణలు ఏంటన్న వివరాలను మాత్రం పేర్కొనలేదు. భారతీయ పరిశ్రమలే కాకుండా భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించే పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రభుత్వం పరిష్కరించే పనిలో ఉందని చెప్పారు. ''బడ్జెట్ తర్వాత నుంచి పరిశ్రమలను నిరంతరం సంప్రదిస్తూ, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకుంటున్నాను. బడ్జెట్ తర్వాత నుంచి మరుసటి బడ్జెట్ 2020 ఫిబ్రవరి వరకు వేచి చూడకుండానే, కార్పొరేట్ పన్ను తగ్గింపు రూపంలో భారీ సంస్కరణ చర్య తీసుకున్నాం. ప్రభుత్వం సంస్కరణలను ఏ విధంగా విశ్వసిస్తుందన్నది ఈ ఒక్క చర్య తెలియజేస్తుంది. మేము మరిన్ని చర్యలు తీసుకోనున్నామని ఈ రోజు నేను స్పష్టం చేస్తున్నాను'' అంటూ ప్రభుత్వ ఆలోచనలను ఈ సదస్సు వేదికగా మంత్రి సీరారామన్ ఆవిష్కరించారు. కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గిస్తూ గత సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకున్న విషయం గమనార్హం. గడిచిన 28 ఏళ్లలో పన్నుల పరంగా ఇది అతిపెద్ద సంస్కరణ. తయారీ రంగంలో కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమలకు ప్రోత్సాహకంగా కార్పొరేట్ పన్నును ప్రస్తుతమున్న 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గించింది. ఈ నిర్ణయాలతో కేంద్ర ప్రభుత్వం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.45 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోనున్నది.

**స్వీడన్ కంపెనీలకు ఆహ్వానం**

భారత్‌లోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలంటూ స్వీడన్‌కు చెందిన కంపెనీలను ఈ సందర్భంగా మంత్రి నిర్మలా సీతారామన్ ఆహ్వానించారు. రానున్న ఐదేళ్ల కాలంలో మౌలిక సదుపాయాల రంగంలో రూ.100 లక్షల కోట్ల మేర ఇన్వెస్ట్ చేయాలన్న భారత్ ప్రణాళికల గురించి తెలియజేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ పది భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను గుర్తించి ఈ నెల 15 నాటికి నివేదికను అందజేయనున్నట్టు చెప్పారు. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి నేతృత్వంలో ఒక కార్యాచరణ బృందాన్ని (టాస్క్‌ఫోర్స్) గత సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం నియమించింది. 2019–20 నుంచి 2024–25 మధ్య కాలంలో రూ.100 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రణాళికను అనుసరించి ప్రాధాన్య క్రమంలో జాతీయ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల జాబితాను ఈ టాస్క్‌ఫోర్స్ రూపొందించాల్సి ఉంటుంది. రూ.100 కోట్లకు పైగా వ్యయంతో కూడిన గ్రీన్‌ఫీల్డ్ (ముందస్తు పని అవసరం లేనివి), బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులను (ప్రాజెక్టు ఆరంభానికి ముందు పనితో కూడుకున్నవి) ఇది తన నివేదికలో భాగంగా పొందుపరచాల్సి ఉంటుంది. భారత్ కేవలం పెద్ద మార్కెట్‌గానే కాకుండా, కొనుగోలు శక్తి, ఆకాంక్షలతో కూడిన మధ్య తరగతి జనాభా అధికంగా కలిగి ఉండడం ఎన్నో అవకాశాలకు వేదికగా మంత్రి పేర్కొన్నారు. ''స్పష్టమైన నిబంధనలతో, మరింత పారదర్శకత మార్గంలో ఈ దేశం నడుస్తోంది. తమకు బాగా తెలిసిన, తమకు ఎంతో ఆమోదనీయమైన వాతావరణం కోసం అంతర్జాతీయ ఇన్వెస్టర్లు చూస్తున్నట్టు అయితే.. అందుకు భారత్ సరిగ్గా సరితూగుతుంది'' అని మంత్రి సీతారామన్ వివరించారు.

## ఆర్‌బీఐ మూడురోజుల విధాన సమీక్ష ప్రారంభం!

**గురువారం 'కీలక' ప్రకటన**



**ముంబై:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత్ దాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం మంగళవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశం దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు, వ్యవస్థలో డిమాండ్ వంటి కీలక అంశాలపై చర్చించనుంది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపోసహా కీలక నిర్ణయాలను గురువారం ఆర్‌బీఐ వెలువరిస్తుంది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు క్యూ2లో ఆరేళ్ల కనిష్టం 4.5 శాతానికి పడిపోవడం, ఆర్థికవ్యవస్థ మందగమనం తీవ్రతను స్పష్టంచేస్తూ పలు గణాంకాలు వెలువడుతున్న నేపథ్యంలో తాజా సమావేశం జరుగుతోంది. ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకుని వృద్ధికి ఊపందించడమే లక్ష్యంగా ఆర్‌బీఐ రెపో రేటు మరింత తగ్గుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. గడచిన ఐదు సమావేశాల్లో ఆర్‌బీఐ రెపోరేటు 135 బేసిస్ పాయింట్లు (1.35 శాతం) తగ్గింది. దీనితో ఈ రేటు 5.15 శాతానికి దిగివచ్చింది.

# రూ.4.91 లక్షల కోట్ల రుణ పంపిణీ

**అక్టోబర్, నవంబర్‌లలో ప్రభుత్వ బ్యాంకింగ్ గణాంకాలు**



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకులు అక్టోబర్, నవంబర్‌లలో రూ.4.91 లక్షల కోట్ల రికార్డు స్థాయి రుణ పంపిణీలు జరిపాయి. వినియోగం పెంపు, ఆర్థిక వృద్ధి పునరుత్తేజం లక్ష్యంగా రుణ వృద్ధి మెరుగుపడాలని కేంద్రం భావిస్తున్న నేపథ్యంలో ఈ గణాంకాలు వెలువడ్డాయి. బ్యాంకులు వినియోగదారులను చేరుకోవాలని, వారి అవసరాలకు అనుగుణంగా తగిన అన్ని నిబంధనలూ అనుసరించి రుణ పంపిణీలు జరగాలనీ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సెప్టెంబర్‌లో బ్యాంకులకు విజ్ఞప్తి చేశారు. ఆర్థికవృద్ధిలో ఇది కీలక అంశమని తెలిపారు. ఈ నేపథ్యంలో రెండు నెలల్లో బ్యాంకులు దేశ వ్యాప్తంగా 374 జిల్లాల్లో ప్రత్యేక రుణ మేళాలు నిర్వహించాయి. ప్రత్యేకించి రుణ పంపిణీల విషయంలో లఘు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు, కార్పొరేట్లు, రిటైల్, వ్యవసాయ విభాగాలపై దృష్టిపెట్టాయి. రుణ పంపిణీలకు సంబంధించి నిబంధనల్లో ఏ మాత్రం రాజీ పడలేదని మంగళవారం గణాంకాల విడుదల సందర్భంగా ఆర్థికమంత్రిత్వశాఖ పేర్కొంది. అక్టోబర్‌లో రూ.2.52 లక్షల కోట్లు, నవంబర్‌లో రూ.2.39 లక్షల కోట్ల రుణ పంపిణీలు జరిగినట్లు వివరించింది. రెండు నెలల్లో ప్రత్యేకించి ఎంఎస్ఎంఈలకు రూ.72,985 కోట్లు, కార్పొరేట్లకు రూ.2.2 లక్షల కోట్ల రుణ పంపిణీలు జరిగినట్లు తెలిపింది. రూ.27,225 కోట్ల గృహ రుణాలు మంజూరు అయ్యాయి. వాహన రుణాల విలువ రూ.11,088 కోట్లుగా ఉంది. విద్యకు సంబంధించి ఈ మొత్తం రూ.1,111 కోట్లు. వ్యవసాయ రుణాలు రూ.78,374 కోట్లు.

# ఇక షావోమీ.. వ్యక్తిగత రుణాలు

- యాప్ ఆధారంగా మంజూరు
- 'మీ క్రెడిట్' పేరిట యాప్ విడుదల
- రూ. లక్ష వరకు లోన్




**న్యూఢిల్లీ:** చైనాకు చెందిన షావోమీ.. భారత్‌లో రుణ మంజూరీ సేవలను ప్రారంభించింది. ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఇక్కడ మార్కెట్‌కు సుపరిచితమైన ఈ సంస్థ.. మొబైల్ అప్లికేషన్ ఆధారంగా వ్యక్తిగత రుణాలను ఇవ్వనున్నట్లు మంగళవారం ప్రకటించింది. ఇందుకోసం 'మీ క్రెడిట్' పేరిట యాప్‌ను అందుబాటులో ఉంచింది. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రూ. లక్ష వరకు రుణం పొందవచ్చని వివరించింది. ఈ అంశంపై కంపెనీ వైస్ ప్రెసిడెంట్, ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మను జైన్ మాట్లాడుతూ.. 'ఆన్‌లైన్ ద్వారా వ్యక్తిగత రుణాలను అందించడానికి మీ క్రెడిట్ యాప్‌ను అధికారికంగా ప్రారంభించాం. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో ఈ సేవలు పైలట్ పద్ధతిలో అందుబాటులో ఉన్నాయి. అత్యంత తక్కువ ప్రాసెసింగ్ సమయంతో రుణం పొందే విధంగా యాప్‌ను రూపొందించాం' అని చెప్పారు. ప్రస్తుతం రుణ భాగస్వాముల జాబితాలో ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్, మనీ వ్యూ, ఎర్లీశాలరీ, జెస్ట్‌మనీ, క్రెడిట్‌విద్యా వంటి బ్యాంకింగేతర సంస్థలు ఉన్నట్లు వెల్లడించారు. వ్యక్తగత రుణ పద్ధతిలో ఉన్న సవాళ్లను అధిగమిస్తూ.. డిజిటల్ పద్ధతిలో రుణ మంజూరీ చేయనున్నామని వివరించిన ఆయన.. యువ నిపుణులు, మిలీనియల్స్ (1980– 2000 మధ్య జన్మించినవారు) తమ లక్ష్యమని చెప్పారు. వినియోగదారు డేటా సురక్షితంగా ఉండడం కోసం అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో షావోమీ భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ ఏడాది నవంబర్‌లో రూ. 28 కోట్లను మంజూరు చేసింది. ఇందులో 20% మంది రూ. లక్ష రుణం తీసుకున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం 10 రాష్ట్రాల్లో 1,500 పిన్‌కోడ్‌లలో సేవలు అందుబాటులో ఉండగా.. 2019–20 చివరినాటికి 100% పిన్‌కోడ్‌లలో సేవలు విస్తరించాలని భావిస్తోంది. ఇక షావోమీ ఫోన్ యూజర్లకు క్రెడిట్ స్కోర్‌ను ఉచితంగా అందిస్తోంది.

**ఫైనాన్షియల్ సేవలపై దృష్టి**

భారత్‌లో ఇప్పటికే 'మీ పే' పేరిట యూపీఐ ఆధారిత పేమెంట్ యాప్ సేవలను అందిస్తోన్న ఈ సంస్థ.. రానున్నకాలంలో మరిన్ని ఫైనాన్షియల్ సేవలను ఇక్కడి మార్కెట్లో అందించనున్నట్లు ప్రకటించింది. తాజాగా అందుబాటులోకి తెచ్చిన 'మీ క్రెడిట్'కు వచ్చే స్పందన ఆధారంగా విస్తృత సేవలను తీసుకుని రానున్నట్లు వివరించింది. ఇక 2023 నాటికి ఆన్‌లైన్ క్రెడిట్ వ్యాపారం రూ. 70 లక్షల కోట్లకు చేరుకోనుందని బీసీజీ తన నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం రూ. 4 లక్షల కోట్ల విలువైన వ్యక్తిగత రుణాలను 1.9 కోట్ల మంది కస్టమర్లు పొందారని, వీరి అవుట్‌స్టాండింగ్ అమౌంట్ రూ. 2 లక్షలుగా ఉన్నట్లు సిబిల్ రిపోర్ట్ ద్వారా వెల్లడైనట్లు షావోమీ వివరించింది.

## ట్యాక్స్ రీఫండ్ ప్రక్రియ వేగవంతం

**నవంబర్ దాకా రూ. 1.46 లక్షల కోట్లు**




**న్యూఢిల్లీ:** ఆదాయ పన్ను శాఖ ట్యాక్స్ రీఫండ్ కేసుల ప్రాసెసింగ్‌ను మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబర్ దాకా 2.10 కోట్ల కేసులను ప్రాసెస్ చేసి, రూ. 1.46 లక్షల కోట్లు రీఫండ్ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇది గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 20 శాతం అధికమని వివరించాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ 28 దాకా (దాదాపు ఎనిమిది నెలలు) సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) మొత్తం 4.70 కోట్ల ట్యాక్స్ రిటర్న్‌లను ప్రాసెస్ చేసినట్లు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే వ్యవధిలో 3.91 కోట్ల రిటర్న్‌లను ప్రాసెస్ చేసినట్లు వివరించాయి.

# డిపాజిట్లపై బీమా పెంపు... మాకు సమాచారం లేదు




- ఆర్‌బీఐ అనుబంధ విభాగం డీఐసీజీసీ ప్రకటన
- ప్రస్తుతం రూ. లక్ష డిపాజిట్ వరకే బీమా రక్షణ
- రూ. 5 లక్షలు చేయాలని డిమాండ్లు
- పరిశీలనలో ఉందని ఇటీవల ఆర్థికమంత్రి ప్రకటన

**న్యూఢిల్లీ:** బ్యాంక్ డిపాజిట్‌దారుడు ప్రస్తుతం రూ. లక్ష వరకూ మాత్రమే తన డిపాజిట్‌కు రక్షణ పొందగలుగుతాడు. ఇందులో ఎటువంటి మార్పూ లేదు. బ్యాంక్‌లో వేసే డిపాజిట్లపై బీమా పెంపు సమాచారం ఏదీ తమకు లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుబంధ విభాగం డీఐసీజీసీ(డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్) స్పష్టంచేసింది. ప్రస్తుతం బ్యాంక్ డిపాజట్లపై బీమా రక్షణ రూ. లక్ష వరకూ ఉంది. అయితే ఈ బీమా రక్షణను పెంచే యోచనలో ప్రభుత్వం ఉందని గతనెల్లో ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందనీ సూచించారు. వ్యక్తిగత డిపాజిట్లకు సంబంధించి రూ. 5 లక్షల వరకూ బీమా పెంపు నిర్ణయం తీసుకోవాలని శంకర భారతీ అనే ఒక స్వచ్ఛంద సంస్థ చేసిన డిమాండ్ నేపథ్యంలో నిర్మలా సీతారామన్ ఈ ప్రకటన చేశారు. శంకర్ భారతీ ఆఫీస్ బేరర్లలో పలువురు ఆర్ఎస్ఎస్‌కు దగ్గరివారు కావడం గమనార్హం.

**ఆర్‌టీఐ కింద డీఐసీజీసీ సమాచారం...**

సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద వచ్చిన ఒక దరఖాస్తుకు డీఐసీజీసీ సమాధానం ఇస్తూ, ''బీమా పెంపునకు సంబంధించిన సమాచారం ఏదీ కార్పొరేషన్‌కు చేరలేదు'' అని తెలిపింది. డీఐసీజీసీ చట్టం, 1961 సెక్షన్ 16 (1) ప్రకారం దివాలా చర్యల కిందకు వెళ్లిన బ్యాంక్‌కు సంబంధించిన ఒక డిపాజిట్‌దారునకు అసలు, వడ్డీతో కలిపి రూ. లక్ష వరకే బీమా ఉంటుంది. అంటే రూ.లక్షలోపు డిపాజిట్‌దారు తన సొమ్మును పూర్తి స్థాయిలో పొందగలుగుతాడు. రూ. లక్ష పైన ఎంత డిపాజిట్ ఉన్నా... సంబంధిత డిపాజిట్ దారుకు రూ. లక్ష మొత్తమే బీమా కింద అందుతుంది. భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించే విదేశీ బ్యాంకులు, ప్రాంతీయ ఏరియా బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ బ్రాంచీలుసహా అన్ని కమర్షియల్ బ్యాంకులకు కార్పొరేషన్ నుంచి బీమా కవరేజ్ ఉంటుంది. పలు బ్యాంకులు తీవ్ర మోసాల్లో ఇరుక్కుంటూ, ప్రజల పొదుపులను ఇబ్బందుల్లోకి నెడుతున్న నేపథ్యంలో తాజా అంశానికి ప్రాధాన్యత ఏర్పడింది. మహారాష్ట్ర కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న పీఎంసీ బ్యాంక్ ఇటీవలే ఈ తరహా ఇబ్బందుల్లోకి జారిన విషయం ఇక్కడ గమనార్హం.

## బీఎస్-6 ఎక్స్‌యూవీ 300

**ధర రూ. 8.30 లక్షలు -11.84 లక్షలు**



**న్యూఢిల్లీ:** మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం).. భారత్ స్టేజ్ (బీఎస్)-6 నిబంధనలకు అనుగుణంగా ఉన్న ఎక్స్‌యూవీ 300 స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యూవీ)ను మంగళవారం విడుదలచేసింది. ఈ కారు ధరల శ్రేణి రూ. 8.30 లక్షల నుంచి రూ. 11.84 లక్షలగా నిర్ణయించింది.

## మెర్సిడెస్ ప్రీమియం జీఎల్‌సీ @ రూ. 52.56 లక్షలు




**న్యూఢిల్లీ:** మెర్సిడెస్–బెంజ్.. భారత మార్కెట్లో ప్రీమియం జీఎల్‌సీ ఎస్‌యూవీని విడుదలచేసింది. జీఎల్‌సీ 200 పేరిట అందుబాటులోకి వచ్చిన పెట్రోల్ వేరియంట్ ధర రూ. 52.75 లక్షలు కాగా, డీజిల్ వేరియంట్ (జీఎల్‌సీ 200డీ) ధర రూ. 57.75 లక్షలు.

# తనఖా షేర్ల బదిలీ ఆపండి

- కార్వీ కేసులో శాట్‌ను ఆశ్రయించిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలు...
- సెక్యూరిటీల బదలాయింపుపై శాట్ మధ్యంతర ఉత్తర్వులు
- నేడు వెలువడనున్న తుది ఆదేశాలు




**న్యూఢిల్లీ:** క్లయింట్ల షేర్లను సొంతానికి వాడుకుందని ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా కార్వీకి రుణాలిచ్చిన బ్యాంకులకు ఊరటనిస్తూ సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ శాట్ ఆదేశాలిచ్చింది. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ (ఎన్ఎస్‌డీఎల్).. మరిన్ని షేర్లను కార్వీ క్లయింట్ల ఖాతాల్లోకి బదలాయించకుండా స్టే విధిస్తూ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తుది ఉత్తర్వులు బుధవారం (నేడు) మధ్యాహ్నానికి ఇవ్వనుంది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశాల మేరకు ఎన్ఎస్‌డీఎల్ ఇప్పటికే చాలామటుకు షేర్లను క్లయింట్లకు బదిలీ చేయగా.. మరికొందరు ఇన్వెస్టర్లకు సెక్యూరిటీల బదలాయింపు ఇంకా జరగాల్సి ఉంది. అయితే, తనఖా పెట్టిన షేర్లకు ప్రతిగా కార్వీకి రుణాలిచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ మొదలైన సంస్థలు ఈ విషయంలో సెబీ ఆదేశాలను సవాలు చేస్తూ శాట్‌ను ఆశ్రయించాయి. దీనిపైనే శాట్ తాజా ఆదేశాలిచ్చింది.

**రుణాలపై ప్రభావం చూపుతుంది..**

రుణాల కోసం తనఖా ఉంచిన షేర్లను ఇలా ఏకపక్షంగా బదలాయించేస్తే.. ఇలాంటి రుణాల మంజూరుపై తీవ్ర ప్రభావం పడుతుందని బ్యాంకులు తమ వాదన వినిపించాయి. ఆయా షేర్లను క్లయింట్లు విక్రయించేసిన పక్షంలో మళ్లీ వెనక్కి రప్పించడం కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో క్లయింట్లకు బదిలీ చేసిన షేర్లను వెనక్కి తీసుకుని, ఎస్క్రో అకౌంట్లో ఉంచాలని కోరాయి. నియంత్రణ సంస్థలు, నియంత్రిత సంస్థలు చేసే 'తప్పులకు' తమను బాధ్యులను చేయడం సరికాదని బ్యాంకులు పేర్కొన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రూ. 470 కోట్ల విలువైన షేర్లకు ప్రతిగా రూ. 300 కోట్ల రుణమిచ్చింది. మిగతా వాటికన్నా ముందుగా శాట్‌ను ఆశ్రయించిన బజాజ్ ఫైనాన్స్ .. సుమారు రూ. 345 కోట్ల రుణమిచ్చింది. మరోవైపు, బ్యాంకులు బాధ్యతారహితంగా బ్రోకరేజీలకు రుణాలిస్తున్నాయంటూ ఎన్ఎస్‌డీఎల్ తరపు న్యాయవాది ఆరోపించారు. సెబీ ఆదేశాల మేరకే క్లయింట్ల ఖాతాల్లోకి ఎన్ఎస్‌డీఎల్ షేర్లను బదిలీ చేసిందని స్పష్టం చేశారు.

సుమారు 95,000 మంది క్లయింట్లకు చెందిన రూ. 2,300 కోట్లకు పైగా విలువ చేసే షేర్లను బజాజ్ ఫైనాన్స్ తదితర సంస్థల్లో తనఖా పెట్టి కార్వీ స్టాక్ బ్రోకింగ్ సంస్థ దాదాపు రూ. 600 కోట్ల దాకా రుణాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త క్లయింట్లను చేర్చుకోకుండా కార్వీపై సెబీ ఆంక్షలు విధించగా, స్టాక్ ఎక్స్ఛేంజీలు ఆ సంస్థ ట్రేడింగ్ లైసెన్సును రద్దు చేశాయి. ఈ క్రమంలో.. కార్వీ తనఖా పెట్టిన షేర్లను ఆయా క్లయింట్ల ఖాతాల్లోకి బదిలీ చేయాలన్న సెబీ ఆదేశాలను నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ (ఎన్ఎస్‌డీఎల్) ప్రస్తుతం అమలు చేస్తోంది. ఇప్పటికే 83,000 మంది ఇన్వెస్టర్ల ఖాతాల్లోకి షేర్ల బదిలీ పూర్తయ్యింది. చెల్లింపుల సమస్య కారణంగా మిగతా ఖాతాల్లోకి బదలాయింపు జరగాల్సి ఉంది.

## మెటర్నిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా

# 'గాంధీ ఆస్పత్రి'

### 200 పడకలతో ఏర్పాటుకు సర్కారు నిర్ణయం



**సాక్షి, హైదరాబాద్:** మెటర్నిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిని రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దనుంది. రాష్ట్రవ్యాప్తంగా జరిగే హైరిస్క్ ప్రసవాలను భవిష్యత్‌లో ఇక్కడే నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఇందు కోసం ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేకంగా మెటర్నిటీ కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఐసీయూ సహా అన్ని రకాల అత్యాధునిక సౌకర్యాలతో దీన్ని తీర్చిదిద్దుతారు. దీనికోసం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎంసీహెచ్) నుంచి రూ.50 కోట్లు మంజూరయ్యాయి. అందులో ఇప్పటివరకు రూ.30 కోట్లు విడుదల చేశారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో లేనివిధంగా ఇక్కడ అన్ని రకాల హైరిస్క్ ప్రసవాలు చేస్తారు. రాష్ట్రంలోనే అన్ని ఆస్పత్రులకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా ఇది నిలవనుంది. ఏరియా, జిల్లా, ఇతర ఆస్పత్రుల నుంచి కేసులను ఇక్కడకు రిఫర్ చేస్తారు. సాధారణ ప్రసవాలకు ఇప్పటికే గాంధీ ఆస్పత్రిలో 150 పడకలు ఉన్నాయి. వాటితో సంబంధం లేకుండా కొత్తగా వచ్చే 200 పడకలను హైరిస్క్ కేసుల కోసం కేటాయిస్తారు. ఇది అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోనే డెలివరీలకు మోడల్‌గా ఉంటుందని వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి తెలిపారు.

## పోలీసు అధికారుల జైలు శిక్షపై స్టే

### సింగిల్ జడ్జి తీర్పుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

**సాక్షి, హైదరాబాద్:** కోర్టు ధిక్కార కేసులో ముగ్గురు పోలీసు అధికారులకు సింగిల్ జడ్జి విధించిన జైలు శిక్ష అమలును నిలిపివేస్తూ హైకోర్టు ధర్మాసనం స్టే ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ నగర పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి, కరీంనగర్ ఏసీపీ తిరుపతి, ఎస్‌హెచ్‌ఓ శశిధర్‌రెడ్డిలకు ఆరు నెలల జైలుశిక్ష, రూ. 2 వేల చొప్పున జరిమానా, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ. 10 చొప్పున లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశిస్తూ గతంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాల్‌చేస్తూ పోలీసు అధికారులు దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్‌లోని ఓ రిసార్టుపై దాడులు చేయరాదని హైకోర్టు ఆదేశించినా పట్టించుకోకుండా సివిల్ దుస్తుల్లో వెళ్లి తనిఖీలు చేసినందుకు పోలీసులపై కోర్టు ధిక్కరణ కింద హైకోర్టు సింగిల్ జడ్జి జైలుశిక్ష విధించారు. అయితే రిసార్ట్స్ యాజమాన్యం సమర్పించిన పత్రాల ఆధారంగా సింగిల్ జడ్జి తీర్పు చెప్పారని, వాస్తవానికి ఇది కింది కోర్టు తేల్చాల్సిన వ్యవహారమని హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. అప్పీల్ పిటిషన్లను విచారణకు అనుమతిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## పన్నుల వసూళ్లలో ప్రతిభ కనబర్చాలి: నీతూప్రసాద్

**సాక్షి, హైదరాబాద్:** ఉద్యోగులంతా కష్టపడి పన్నుల వసూళ్లలో ప్రతిభ కనబర్చి ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చడంలో ముందుండాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్ ఆకాంక్షించారు. మంగళవారం కమిషనరేట్‌లో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నీతూ కుమారి ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమెను కలిసిన బృందంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జలాలుద్దీన్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇ.సునిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లు ఎ.ప్రభాకర్, రహమతుల్లా, రాష్ట్ర కార్యదర్శులు కోటి వెంకటేశ్వర్లు, విక్టర్ పాల్, ప్రవీణ్ కుమార్, మధుసూదన్‌రావు, కోశాధికారి ఇ.జగదీశ్వర్ ప్రసాద్, పంజాగుట్ట డివిజన్ అధ్యక్షుడు నర్సింహరావ్, చార్మినార్ డివిజన్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్ ఖాన్ తదితరులు ఉన్నారు.






## 12న ఎమ్మార్పీఎస్ చలో ఢిల్లీ

**హైదరాబాద్:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం డిమాండ్ చేస్తూ ఈనెల 12, 13 తేదీల్లో చలో ఢిల్లీ –మాదిగల లొల్లి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ –టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రిక, కరపత్రాన్ని మంగళవారం ఓయూ గెస్ట్‌హౌస్‌లో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో చాన్నాళ్లుగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును మాత్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా మాదిగలను మోసగించిందన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరిస్తామని చెప్పిన బీజేపీ రెండుసార్లు అధికారం చేపట్టినా పట్టించుకోవట్లేదని మండిపడ్డారు.





